సంపుటి : 78 సంచిక : 32 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ అధిక జ్యేష్ఠ శుద్ధ నవమి
25-31 మే 2026
వెల : ₹20/-





## పొదుపే ప్రపంచం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.




# చార్‌ధామ్ యాత్రకు లక్షలాదిగా భక్తులు

ఈ ఏడాది ఉత్తరాఖండ్ చార్‌ధామ్ యాత్రలో లక్షలాదిగా భక్తులు పాల్గొన్నారు. **25** రోజుల్లో **12.60** లక్షల మంది యాత్రికులు దర్శనం చేసుకున్నారు.వీరిలో **5,23,582** మంది యాత్రికులు కేదార్‌నాథ్‌కు, **3,24,081** మంది బద్రీనాథ్‌కు, **2,05,425** మంది గంగోత్రికి, **2,07,390** మంది యమునోత్రి ధామ్‌కు చేరుకున్నారు. మే **13**న **80,401** మందికి పైగా యాత్రికులు ఈ నాలుగు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అత్యధికంగా **32,423** మంది యాత్రికులు కేదార్‌నాథ్‌కు చేరుకోగా, **21,260** మంది బద్రీనాథ్‌కు, **13,403** మంది యమునోత్రికి,**13,315** మంది గంగోత్రి ధామ్‌కు చేరుకున్నారు. కేదార్‌నాథ్ యాత్ర కష్టతరమైనప్పటికీ, పుణ్యక్షేత్రాన్ని సందర్శించే భక్తుల సంఖ్య నిరంతరం కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలల ప్రాజెక్టు కింద కేదార్‌నాథ్ పుణ్యక్షేత్రం పునర్నిర్మాణం, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నాయకత్వంలో సురక్షితమైన, సౌకర్యవంతమైన, అనుకూలమైన యాత్ర భక్తులలో గొప్ప ఉత్సాహాన్ని నింపాయని, అందుకే వారి సంఖ్య పెరుగుతున్నదని సంబంధిత అధికారులు తెలిపారు. చార్‌ధామ్ పుణ్యక్షేత్రాల భద్రతే తమ ప్రధాన ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి తెలిపారు. భక్తులకు సులువైన దర్శనం కల్పించేందుకు స్లాట్ నిర్వహణ, జన నియంత్రణ వ్యవస్థలను క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. రియల్-టైమ్ డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.





# బీహార్‌లో 1200 ఏళ్ల నాటి బౌద్ధారామం

బీహార్‌లోని గయా జిల్లాలో ఒక గ్రామంలో సుమారు 1200 సంవత్సరాల నాటిదని భావిస్తున్న ఒక భారీ ప్రాచీన బౌద్ధారామం అవశేషాలను పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ ప్రదేశంలో క్రీ.పూ. 3వ శతాబ్దం నాటి వర్ధిల్లుతున్న మానవ నివాసానికి సంబంధించిన ఆధారాలు లభించాయి. ఇక్కడ మట్టిపాత్రల అవశేషాలు, విగ్రహాలు, స్థూపాలు, ఇతర పురాతన వస్తువుల నిధి కూడా బయటపడింది. బౌద్ధగయకు నైరుతి దిశలో సుమారు 30 కిలోమీటర్లు, పాట్నాకు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుబ్బా గ్రామంలోని ఈ ప్రదేశం సుమారు ఒక చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో స్పష్టంగా విస్తరించి ఉంది. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఆర్కియాలజీ (CABA) నుండి తవ్వకాల లైసెన్స్ పొందిన తర్వాత, మగధ విశ్వవిద్యాలయంలోని ప్రాచీన భారత, ఆసియా అధ్యయన విభాగం బృందం మే 9న ఆ ప్రదేశంలో తవ్వకాలు ప్రారంభించి, ఈ ఆవిష్కరణ చేసింది. ఇటుక కట్టడాలు, గోడలలో గూళ్లు ఉన్న చిన్న గదులు, ఇటుకలు, రాళ్లతో చేసిన స్థూపాలు, రాతితో చేసిన విగ్రహాలు ముఖ్యమైన ఆవిష్కరణలలో ఉన్నాయి. ఈ గదులలో, ఇటుక పునాదిపై నునుపుగా ఉన్న 'సున్నపు పూత'తో నిర్మించిన రెండు అంతస్తులు కూడా బయటపడ్డాయి. వాటిలో ఒకటి చెక్కుచెదరనిది కాగా, మరొకటి దెబ్బతిన్నది. అయితే, ఇక్కడ కనుగొన్న ప్రధానమైన వాటిలో ఒకటిగా, భారీ ఇటుకల నిర్మాణం పూడ్చిపెట్టి ఉన్న 35 అడుగుల ఎత్తైన దిబ్బ. దానిలోని ఒక చిన్న భాగాన్ని బయటపెట్టగా, ఒక బ్రహ్మాండమైన టెర్రకోట ఇటుకల గోడ వెలుగులోకి వచ్చింది. ఆ ప్రదేశం చుట్టూ చెల్లాచెదురుగా పడి ఉన్న అనేక రాతి స్తంభాలు కూడా బయటపడ్డాయి. అవి అప్పటికాలంలో అద్భుతాలుగా పరిగణించే భారీ నిర్మాణాలను సూచిస్తున్నాయి.





Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust,
92001006140532 5, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

**భా**రతదేశం ప్రపంచ వేదికపై ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక శక్తిగా ఎదుగుతున్న ఈ కాలంలో, భారత్‌ను అర్థం చేసుకోవాలనే చర్చ కూడా సమాంతరంగా సాగుతోంది. అయితే ఒకవైపు భారత్ ఆధునిక శక్తిగా గుర్తింపు పొందుతున్నప్పటికీ, మరోవైపు దాని సాంస్కృతిక మూలాలను అర్థం చేసుకోవడంలో పాశ్చాత్య ప్రపంచం ఇంకా సందిగ్ధతలోనే ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలె యూరప్, అమెరికా పర్యటన ఒక సాధారణ విదేశీ పర్యటన కాదు; అది సంభాషణ ద్వారా వివిధ సంస్కృతుల మధ్య వారధి నిర్మించే ప్రయత్నంగా నిలిచింది.

1897లో స్వామి వివేకానంద అమెరికా, ఐరోపా పర్యటన అనంతరం భారతీయులపై పాశ్చాత్య దేశాలలో నెలకొన్న అపోహలను ప్రస్తావించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఒక శతాబ్దంపైగా గడిచినా ఈ అపోహల్లో పెద్దగా మార్పులేదు. అలాగే భారతదేశం స్వాతంత్ర్యం సాధించి ఎనభై ఏళ్లకు చేరువవుతున్నా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నా, పాశ్చాత్య ప్రపంచం భారత్‌ను పూర్తిగా అర్థం చేసుకోవడంలో ఇంకా వెనుకబడే ఉంది.

ఈ నేపథ్యంలో హోసబలె పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటన ప్రధాన లక్ష్యం RSS గురించి పాశ్చాత్య ప్రపంచంలో ఉన్న అపోహలను తొలగించడం. దశాబ్దాలుగా వామపక్ష భావజాల ప్రభావిత మీడియా, అకడమీషియా సంఘ్‌ను "హిందూ ఆధిపత్య" లేదా "మైనారిటీ వ్యతిరేక" సంస్థగా చిత్రీకరించాయి. ఈ ప్రచారం పాశ్చాత్య మేధావులు, విధాన నిర్ణేతలలో కూడా అనుమానాలను పెంచింది. అందుకే సంఘ నాయకత్వం ప్రత్యక్షంగా చర్చల్లో పాల్గొని తమ దృక్పథాన్ని వివరించాల్సిన అవసరం ఏర్పడింది. వాషింగ్టన్ DCలోని Hudson Instituteలో జరిగిన చర్చ ఈ పర్యటనలో ముఖ్య ఘట్టంగా నిలిచింది. అక్కడ హోసబలె హిందుత్వం అసలు తత్వాన్ని వివరించారు. "వసుధైవ కుటుంబకం" అనే భారతీయ దృక్పథం ప్రకారం ప్రపంచమంతా ఒక కుటుంబమని ప్రాచీన కాలం నుంచి హిందూ సమాజం చెబుతూ వస్తున్నదని, అందువల్ల ఆధిపత్య భావనకు అక్కడ స్థానం లేదని

**శాలివాహన 1948 శ్రీ పరాభవ అధిక జ్యేష్ఠ శుద్ధ నవమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం
**పొదుపే ప్రపంచం**

ధారావాహిక నవల
(37) **గణపతిదేవుడు**
– మత్తి భానుమూర్తి


20లో

ప్రత్యేక వ్యాసం
**సావర్కార్ వ్యూహం - స్వాతంత్ర్య ఫలం**


34లో

# జాగృతి

## సంపాదకీయం

ఆయన స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయ సంస్థ కాదని, అది సమాజ నిర్మాణం కోసం పనిచేసే ప్రజా ఉద్యమమని వివరించారు. సంఘం నిర్వహించే సేవా కార్యక్రమాలను కూడా ఆయన ప్రపంచానికి పరిచయం చేశారు. రోజువారీ శాఖల ద్వారా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడం నుండి విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విపత్తు సహాయం వరకు ఆర్ఎస్ఎస్ చేస్తున్న సేవలను వివరణాత్మకంగా చెప్పారు. ముఖ్యంగా ఈ సేవల్లో కుల, మత, భాష ఆధారిత వివక్షకు స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. పాశ్చాత్య దేశాలు తమ రాజకీయ ప్రమాణాలతో భారత్‌ను

## చర్చలతోనే అపోహలు దూరం

అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంవల్లే అపోహలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు.

ప్రపంచం ప్రస్తుతం యుద్ధాలు, ఆర్థిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం, కుటుంబ వ్యవస్థ బలహీనపడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లకు కేవలం రాజకీయ, ఆర్థిక పరిష్కారాలు సరిపోవని, సమాజ కేంద్రిత విలువలు అవసరమని పేర్కొన్నారు. కుటుంబం, సమాజం, ప్రకృతి మధ్య సమతుల్యతను కాపాడే భారతీయ ఆలోచనా విధానం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవగలదని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంలో భారతీయ డయాస్పోరా పాత్ర కూడా ఎంతో కీలకమైంది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు ఆధునిక ప్రపంచానికనుగుణంగా జీవిస్తూ, తమ నాగరికతా మూలాలను కాపాడుకుంటున్నారు. ఈ అనుభవాలు వారిని ఆయా దేశాల మధ్య వారధిగా నిలబెడుతోంది. పాశ్చాత్య సమాజాలకు భారతీయ విలువలను పరిచయం చేయడంలో ప్రవాస భారతీయులు ముఖ్య పాత్ర పోషించగలరని హోసబలె పేర్కొన్నారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన THRIVE 2026 చర్చల్లో ఆయన ప్రస్తావించిన అంశాలు మరింత లోతైనవిగా నిలిచాయి. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ఆధునిక కాలంలో మానవజాతి, "ఆధ్యాత్మికత, నైతికత" గురించి మళ్లీ ఆలోచించడం ప్రారంభించిందని చెప్పారు. భారతదేశం వేల ఏళ్లుగా ఆధ్యాత్మికతను ఒక శాస్త్రంగా పరిగణిస్తూ వచ్చింది. సైన్స్, ఆధ్యాత్మికత పరస్పర విరుద్ధాలు కావని, రెండింటి సమన్వయం ద్వారానే సమగ్ర మానవ అభివృద్ధి సాధ్యమని భారతీయ నాగరికత ఎప్పటినుంచో చెబుతోందని వివరించారు.

ఈ మొత్తం పర్యటనలో ప్రధానంగా కనిపించిన అంశం "సంభాషణ". హిందూ సంప్రదాయంలో "శాస్త్రార్థం" అనే భావన ఉంది. అంటే వాదన కోసం వాదించడం కాదు; సత్యాన్వేషణ కోసం అర్థవంతమైన చర్చ జరపడం. హోసబలె పర్యటన అదే భావనకు ఆధునిక రూపంగా నిలిచింది. వ్యూహాత్మక లేదా రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, ప్రజల స్థాయిలో పరస్పర అవగాహన పెంపొందించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఇది ఒక కీలక సందేశాన్ని అందించింది. ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభాలకు పరిష్కారం కేవలం ఆర్థిక ఒప్పందాల్లోగానీ, సైనిక కూటముల్లో గానీ లేదు. వివిధ దేశాల సంస్కృతుల మధ్య పరస్పర గౌరవం, సంభాషణ, అవగాహన అవసరం. భారతదేశం తన ప్రాచీన నాగరికతా విలువలతో, ఆధునిక సామర్థ్యాలతో ప్రపంచానికి ఒక సమతుల్య దిశను చూపగలదు. ఆ దిశగా సాగుతున్న ప్రయాణంలో హోసబలె ఈ పర్యటన నాగరికత, సంస్కృతి మేళవించిన ఒక ముఖ్యమైన సంభాషణగా చరిత్రలో నిలిచిపోతుంది. ★





40లో

కథ

**అభిమానవంతుడు**

– వారణాసి భానుమూర్తి రావు

ధరహాసం





| | | |
|---|---|---|
| సనాతన ధర్మంపై విషం కక్కుతున్న డీఎంకే (జాతీయం) | - | 12 |
| కమల వికాసానికి అభివృద్ధే బ్రహ్మాస్త్రం (తెలంగాణ) | - | 14 |
| యుద్ధవిమానాలకు కీలకం పుట్టపర్తి (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ఈ ఖరీఫ్‌లో సాగు – పంట మార్పిడితో మేలు (వ్యవసాయం) | - | 18 |
| చర్చలను బట్టే ఇరాన్ వ్యూహం? (అంతర్జాతీయం) | - | 24 |
| ఆత్మవిశ్వాసానికి ఇతిహాసాలే ఆధారం (వ్యక్తిత్వ వికాసం) | - | 26 |
| సాంకేతికత నుంచి సంప్రదాయానికి... (మార్పు) | - | 28 |
| జానపద గీతిక–జాతి జీవనాళిక (గళమెత్తిన గతం) | - | 30 |
| విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు (నాంది) | - | 32 |
| సీపీఎం హింసా రాజకీయం.. (ఆర్ఎస్ఎస్–100) | - | 36 |
| ఐపీఎల్‌లో 'విరాట్ పర్వం'! (క్రీడ) | - | 43 |
| ఆలోచన మంచిదే కానీ.. మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్! (సినిమా) | - | 50 |




**ప్రపంచం ప్రస్తుతం ఒక అనూహ్యమైన ఇంధన సంక్షోభం ఎదుర్కొంటోంది. పశ్చిమ ఆసియా ప్రాంతంలో జరుగుతున్న సంఘర్షణలు ముఖ్యంగా హార్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అడ్డంకులు ఏర్పడడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగి సరఫరా సమస్యలు తలెత్తాయి. ఈ సంక్షోభం కారణంగా అనేక దేశాలు ఇంధన వినియోగం తగ్గించడానికి వివిధ చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలకు వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌ను పరిమితంగా సరఫరా చేయడం  నుండి ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి నుండి పని చేయడం (వర్క్ ఫ్రమ్ హెూమ్) వరకు అనేక వ్యూహాలు అమలు చేస్తున్నాయి. మొదటగా సంక్షోభం నేపథ్యం అర్థం చేసుకోవాలి. పశ్చిమ ఆసియా నుండి ప్రపంచ ఇంధన సరఫరాలో గణనీయమైన భాగం వస్తుంది. జలసంధి అడ్డంకులు వల్ల రోజువారీ లక్షల బ్యారెల్స్ చమురు రవాణా ప్రభావితమైంది. దీనివల్ల ఆసియా, ఐరోపా, ఆఫ్రికా దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ద్రవ్యోల్బణం పెరిగి వృద్ధి రేట్లు తగ్గాయి. ఈ నేపథ్యంలో దేశాలు పొదుపు చర్యలు అనుసరిస్తున్నాయి.**

ఆసియా ఖండం ఈ సంక్షోభం నుండి ఎక్కువగా బాధపడుతోంది. ఇక్కడి దేశాలు మధ్యప్రాచ్యం నుండి చాలా ఇంధనం దిగుమతి చేసుకుంటాయి. మన పొరుగుదేశమైన పాకిస్తాన్‌లో సైనిక, ప్రభుత్వ నాయకత్వం సమావేశం అయి సంక్షోభంపై సమీక్షించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో లైట్లు తగ్గించారు. స్కూళ్లు, కాలేజీలు రెండు వారాలు మూసివేశారు. పెట్రోల్ బంకుల అక్రమ నిల్వను అడ్డుకోవడానికి పోలీసులు మోహరించారు. పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. ఆర్థిక మంత్రి ఇంధన నిల్వలు ఐదు నుండి ఏడు రోజులు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఇంధన దిగుమతులకు టెండర్లు జారీ చేశారు. ఎల్ఎన్‌జి కొనుగోళ్లు పెంచారు. పాకిస్తాన్ ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకుంది. ప్రభుత్వ కార్యాలయాలకు నాలుగు రోజుల పని వారం అమలు చేసింది. సగం సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశించారు. ఇంధన వినియోగం తగ్గించడానికి ఈ చర్యలు సహాయ పడతాయి. హైవేలపై వేగ పరిమితులు విధించారు. ప్రభుత్వ అధికారుల విదేశీ ప్రయాణాలు నిషేధించారు. ప్రభుత్వం ఇంధన ధరలను స్థిరంగా ఉంచడానికి సబ్సిడీలు అందిస్తోంది కానీ ఆర్థిక భారం పెరుగుతోంది. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ ఇంధన ఆధారితం కాబట్టి ఈ చర్యలు అనివార్యమయ్యాయి. ఇంధన సమస్య వల్ల ఫ్యాక్టరీలు ప్రభావితమవుతున్నాయి. విద్యుత్ కోతలు ఎదుర్కొంటున్నాయి. ఎల్ఎన్‌జి దిగుమతులు పెంచాలని ప్రభుత్వం చూస్తోంది. బిలియన్ డాలర్ల బాహ్య ఫైనాన్సింగ్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇంధన దిగుమతులకు బదులుగా స్థానిక వనరులు పెంచాలని ఆలోచిస్తోంది.

బాంగ్లాదేశ్ కూడా తీవ్రమైన చర్యలు తీసుకుంది. ఇంధన రేషనింగ్(పరిమిత పరిమాణంలో ఇంధన సరఫరా) అమలు చేసింది. కార్యాలయాల సమయాలు తగ్గించారు. వివాహాలు వంటి కార్యక్రమాల్లో అనవసరమైన లైటింగ్ నిషేధించారు. యూనివర్సిటీలకు ముందుగా సెలవులు ప్రకటించారు. ఇంధన వినియోగం తగ్గించడానికి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రోత్సహించారు. ఎయిర్ కండీషనర్ల ఉష్ణోగ్రతలు నియంత్రించారు. బాంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి ఉంది.

శ్రీలంకలో పబ్లిక్ ఈవెంట్లు తగ్గించడం వల్ల ఇంధనం ఆదా అవుతోంది. ఇంధన రేషనింగ్ వ్యవస్థ అమలవుతోంది. మోటార్ సైకిళ్లకు వారానికి ఐదు లీటర్లు, కార్లకు 15 లీటర్లు, బస్సులకు 60 లీటర్లు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా ఈ వ్యవస్థ నడుస్తోంది. విద్యా సంస్థలకు నాలుగు రోజుల పని వారం అమలు చేశాయి. ప్రభుత్వ కార్యకలాపాలు తగ్గించారు. శ్రీలంక ఇంధన దిగుమతులపై ఎక్కువ ఆధారపడి ఉంది కాబట్టి ఈ చర్యలు అవసరమయ్యాయి. ఇంధనం ఆదా

చేయాలని ప్రజలకు ప్రభుత్వం పిలుపునిచ్చింది.

ఫిలిప్పైన్స్ ప్రభుత్వం నాలుగు రోజుల పని వారం అమలు చేసింది. పబ్లిక్ సెక్టర్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రోత్సహించింది. ఎయిర్ కండీషనర్లు నాలుగు డిగ్రీల కంటే తక్కువగా ఉండకూడదని ఆదేశించింది. ఇంధన సబ్సిడీలు అందించి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రోత్సహించింది. ఫిలిప్పైన్స్ జాతీయ




అత్యవసర స్థితి ప్రకటించింది. ఇంధన సరఫరా సమస్యలు తీవ్రంగా ఉన్నాయి.

థాయ్‌లాండ్ ఇంధన ధరలను స్థిరంగా ఉంచ డానికి సబ్సిడీలు ఇస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశించింది. ఎయిర్ కండీషనర్ ఉష్ణోగ్రతలను 26, 27 డిగ్రీలుగా ఉంచాలని సూచించింది. బయో ఇంధన మిశ్రమాలు పెంచింది. థాయ్‌లాండ్ ఇంధన దిగుమతులపై ఆధారపడి ఉంది. ఎగుమతులు నియంత్రించింది.

వియత్నాం ఇంధన పన్నులు తగ్గించింది. వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రోత్సహించింది. బొగ్గు ద్వారా విద్యుదుత్పాదన పెంచింది. ఇంధన ధరలు పెరగడం వల్ల ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటోంది.

మయన్మార్ బేసి, సరి వాహన నియమం అమలు చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు బుధవారం వర్క్ ఫ్రమ్ హోమ్ తప్పనిసరి చేసింది. ఇంధన రేషనింగ్ కఠినంగా అమలు చేస్తోంది.

ఇండోనేషియా ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశించింది. ఇంధన వినియోగం తగ్గించడానికి ఈ చర్య సహాయపడుతుందని అంచనా వేసింది.

దక్షిణ కొరియా ఇంధన ధరలకు పరిమితి విధించింది. ప్రభుత్వ ఉద్యోగులకు వాహనాల వాడకంపై నియంత్రణలు విధించింది. బొగ్గు ఆధారిత, అణు శక్తి ఆధారిత విద్యుదుత్పాదనను పెంచింది. జపాన్ తన నిల్వల నుండి ఇంధనం విడుదల చేస్తోంది.

భారతదేశం ఈ సంక్షోభం నుండి రక్షణ కోసం చర్యలు తీసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు ఇంధన సామర్థ్యం పెంచాలని, వినియోగం తగ్గించాలని పిలుపునిచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరించాలని సూచించారు. భారత్ రష్యా నుండి ఎక్కువ చమురు దిగుమతి చేసుకుంటోంది. బొగ్గు ఉత్పత్తి పెంచుతోంది. రైతులకు సహాయం అందిస్తోంది. సౌర పంపులు ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సహిస్తోంది. భారతదేశం రిఫైనరీల ద్వారా ధరలను స్థిరంగా ఉంచుతోంది కానీ సబ్సిడీలు ఆర్థిక భారం పెంచుతున్నాయి. భారతదేశంలో రవాణా వ్యవసాయం ఇంధనంపై ఆధారపడి ఉన్నాయి. డీజిల్ ధరల పెరుగుదల వ్యవసాయ ఖర్చులు పెంచుతుంది. ప్రభుత్వం రైతులకు సబ్సిడీలు అందిస్తోంది. విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించింది. ఎల్‌పిజి ఉత్పత్తి పెంచాలని రిఫైనరీలకు ఆదేశాలు ఇచ్చింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగదారులకు ఎల్‌పిజి సిలిండర్లు రీఫిల్ చేయకూడదని ఆదేశించింది. ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ. 3.90 పెంచింది.

చైనా తన పెద్ద నిల్వలను ఉపయోగించి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇరాన్ నుండి ఇంధనం తీసుకుంటోంది. పునరుత్పాదక వనరులు పెంచు తోంది. ఇంధన ఎగుమతులపై నియంత్రణలు విధించింది.

ఈజిప్ట్ షాపులు రెస్టారెంట్లు రాత్రి తొమ్మిది గంటలకు మూసివేయాలని ఆదేశించింది. స్ట్రీట్ లైట్లు తగ్గించింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి ఒక రోజు వర్క్ ఫ్రమ్ హోమ్ తప్పనిసరి చేసింది. పెట్రోల్ ధరలు పెంచింది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పెంచింది. ప్రధాన మంత్రి ఇంధనం విద్యుత్ రేషన్ చేయాలని చెప్పారు. హోటళ్లు, టూరిస్ట్ స్థలాలకు మినహాయింపు ఇచ్చారు. ప్రభుత్వ భవనాలు సాయంత్రం ఆరు గంటలకు మూసివేస్తున్నారు. ఇల్యూమినేటెడ్ బిల్‌బోర్డులను (దీపాలతో వెలిగే ఉత్పత్తుల ప్రచార బోర్డులు) ఆఫ్ చేస్తున్నారు

యూరప్ దేశాలు కూడా చర్యలు తీసుకుంటు న్నాయి. స్లోవేనియా చర్యలు తీవ్రంగా ఉన్నాయి. స్లోవేనియా ఇంధన రేషనింగ్ అమలు చేసింది. ప్రైవేట్ డ్రైవర్లకు వారానికి 50 లీటర్లు, వ్యాపారాలకు 200 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తోంది. జర్మనీ



మహేష్ ధూళిపాళ్ల



ఇంధన పన్నులు తగ్గించింది. బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇటలీ బొగ్గును తవ్వి తీస్తోంది. ఫ్రాన్స్ అణు శక్తి ఆధారిత విద్యుత్తుపై ఆధారపడుతోంది. బెల్జియం పవన ఆధారిత విద్యుదాత్పదన పెంచుతోంది. ఇతర దేశాలు పన్నుల తగ్గింపు సబ్సిడీలపై ఆధారపడుతున్నాయి. ఆఫ్రికా దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జాంబియా అత్యవసర స్థితి ప్రకటించింది. మొజాంబిక్ ప్రజలకు వర్క్ ఫ్రమ్ హోమ్ సూచించింది. ఇథియోపియా ఇంధన సరఫరా సమస్యలు ఎదుర్కొంటోంది. అమెరికా తన వ్యూహాత్మక నిల్వలు విడుదల చేస్తోంది. కెనడా ఇంధన పన్నులు తగ్గించింది.

ఇంకా విస్తృతంగా చెప్పాలంటే ఆసియా దేశాల్లో కంబోడియా పెట్రోల్ బంకులు మూసివేసింది. లావోస్ వినియోగ నియంత్రణలు విధించింది. మలేషియా ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశించింది. ఎయిర్ కండీషనర్ ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు నియంత్రించింది. అధికారుల ప్రయాణాలు పరిమితం చేసింది. సోలార్ ప్యానెల్స్, ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించింది. మడగాస్కర్ జాతీయ అత్యవసర స్థితి ప్రకటించింది. జోర్డాన్ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎయిర్ కండీషనర్లు నిషేధించింది. అధికారుల విదేశీ ప్రయాణాలు నిషేధించింది. ప్రభుత్వ వాహనాల వినియోగం తగ్గించింది.

ఈ చర్యలన్నీ తాత్కాలికమైనవి. దీర్ఘకాలికంగా పునరుత్పాదక ఇంధనాల సామర్థ్యం పెంపు అవసరం. అనేక దేశాలు సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు వైపు మళ్లుతున్నాయి. ఈ చర్యలు ప్రజల జీవన విధానాన్ని మారుస్తున్నాయి. ప్రజలు చిన్న చిన్న మార్పులు చేసుకోవాలి. కార్లకు బదులు సైకిళ్లు, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలి. లైట్లు, ఫ్యాన్లు వినియోగాన్ని పరిమితం చేసుకోవాలి. ఎల్ఈడీ లైట్లు, ఇంధన వినియోగాన్ని తగ్గించే ఉపకరణాలు ఉపయోగించాలి. దీర్ఘకాలిక పరిష్కారాలుగా పునరుత్పాదక వనరులు కనిపిస్తున్నాయి. సౌర విద్యుత్, పవన విద్యుత్ ఉత్పాదన పెంచాలి. ఇంధన స్టోరేజ్ గ్రిడ్ మెరుగుపరచాలి. అంతర్జాతీయ సమావేశాల్లో ఈ చర్చలు జరుగుతున్నాయి. దీనిపై ప్రపంచ దేశాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది. ఈ సంక్షోభం మనకు గుణపాఠం. ఇంధనంపై ఆధారపడటం తగ్గించాలి. స్థానిక వనరులు అభివృద్ధి చేయాలి. ప్రతి వ్యక్తి బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వాలు పాలసీలు మార్చాలి. అప్పుడే భవిష్యత్ సురక్షితం అవుతుంది.

ఈ చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరపరచడానికి సహాయపడతాయి. కానీ రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఉండవచ్చు. శీతాకాలం సమీపిస్తుంటే యూరప్‌లో సమస్యలు పెరగవచ్చు. వేసవి కాలంలో ఆసియాలో డిమాండ్ పెరుగుతుంది. ప్రభుత్వాలు అవసరార్థులకు సహాయం అందించాలి. పేదలకు మాత్రమే సబ్సిడీలు ఇవ్వాలి. అంతర్జాతీయ సహకారం పెంచాలి. యావత్ మానవాళి ఈ సంక్షోభం నుండి బయటపడి బలమైన స్వతంత్ర ఇంధన వ్యవస్థను నిర్మించుకోవాలి.

ఈ విధంగా అనేక దేశాలు తమ తమ పరిస్థితుల ప్రకారం చర్యలు తీసుకుంటున్నాయి. పాకిస్తాన్, బాంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలు ఇంధన రేషనింగ్, నాలుగు రోజుల పని వారం, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటివి అమలు చేస్తున్నాయి. ఈజిప్ట్ షాపింగ్ మాల్స్, రెస్టారెంట్ల మూసివేత, లైటింగ్ తగ్గింపు వంటివి చేస్తోంది. భారతదేశం సబ్సిడీలు, దిగుమతుల పెంపు వంటి మార్గాలు అనుసరిస్తోంది. యూరప్, ఆఫ్రికా దేశాలు కూడా దాదాపుగా ఇలాంటి చర్యలు తీసుకుంటున్నాయి.

ఈ సంక్షోభం ప్రపంచానికి ఒక అతిపెద్ద గుణపాఠం. ఇంధనం అమూల్యమైన వనరు. దానిని ఆదా చేయాలి. తద్వారా స్థిరమైన అభివృద్ధి వైపు అడుగులు వేయాలి. ప్రతి దేశం తన వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. దీనికి ప్రజలు సహకరించాలి. అప్పుడే మనం ఈ సవాలును అధిగమించి మంచి భవిష్యత్తును నిర్మించుకోగలం

## ఢిల్లీలో వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్

ప్రధానమంత్రి ఇంధన పొదుపు పిలుపును అనుసరించి అనేక చర్యలు తీసుకుంటున్నట్టు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా తెలిపారు. ఈ మేరకు మే 14న ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనకు లోబడి ప్రభుత్వ ఉద్యోగులందరూ వారానికి రెండు రోజులు ఇంటి నుంచి పని (వర్క్ ఫ్రమ్ హోమ్) చేయాలి. ఈ చర్య ఇంధన వినియోగం తగ్గించి విదేశీ మారకాన్ని ఆదా చేయడానికి ఉద్దేశించినది. ప్రభుత్వ అధికారులు వారానికి ఒక రోజు కారు లేని రోజుగా గుర్తించి ప్రజా రవాణా సాధనాలు లేదా సంఘటిత వాహనాలను వాడాలి. అధికారిక సమావేశాలలో సగం ఆన్‌లైన్‌లో నిర్వహించాలి. ఇది ప్రయాణాలు తగ్గించి ఇంధనం ఆదా చేస్తుంది. ప్రతి సోమవారం మెట్రో రోజుగా జరుపుతారు. ఉద్యోగులు మెట్రోను ఉపయోగించాలని ప్రోత్సహిస్తారు. కొత్త ప్రభుత్వ




వాహనాల కొనుగోలును ఆరు నెలల పాటు నిలిపివేశారు. అధికారుల విదేశీ ప్రయాణాలను ఒక సంవత్సరం పాటు నిషేధించారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించి డీజిల్ పంపులను ఎలక్ట్రిక్ వ్యవస్థలతో భర్తీ చేస్తారు. అధికారులు అధికారిక కార్యక్రమాలకు సంఘటితంగా ప్రయాణించాలి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పని చేస్తాయి. వారానికి ఒక రోజు వాహనం లేని రోజుగా పాటించాలని ఢిల్లీ ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ చర్యల అమలును పర్యవేక్షిస్తుంది. ప్రైవేట్ సంస్థలకు కూడా ఇలాంటి చర్యలు అనుసరించాలని సూచించారు. ఉద్యోగులు, ప్రజలు ఈ చర్యల అమలుకు సహకరించాలని కోరారు.



## సైకిల్‌పై గుజరాత్ గవర్నర్

గుజరాత్ రాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ మే 14న రైలులో హర్యానాలోని కురుక్షేత్ర ప్రాంతానికి చేరుకున్నారు. ఆయన కురుక్షేత్ర రైల్వే స్టేషన్ నుండి గురుకుల్ వరకు సైకిల్‌పై ప్రయాణిస్తూ, ఇంధనాన్ని ఆదా చేయడం, స్వదేశీని అవలంబించడం వంటి సందేశాలను వ్యాప్తి చేశారు. ఆయన సైకిల్ తొక్కుతూ ప్రజలలో అవగాహన కల్పించారు. దేశం వేగవంతమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే, ఇంధన పొదుపు సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలని గవర్నర్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. వారానికి ఒక రోజును 'వాహన రహిత దినం'గా పాటించాలని, ప్రజా రవాణా, సైకిళ్లు లేదా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరుతూ గుజరాత్‌లోని అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసినట్లు ఆయన చెప్పారు.



## బైక్‌పై మహారాష్ట్ర సీఎం

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మే 14న ముంబైలో విధాన భవన్‌కు మోటార్ సైకిల్‌పై వచ్చారు. అనంతరం కేంద్రం పొదుపు చర్యలను సమర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను కేవలం "చిన్న త్యాగాలు చేసుకోమని మాత్రమే కోరారు" అని ఆయన అన్నారు. ఈ విషయంపై "అనవసరమైన వివాదాన్ని" సృష్టిస్తున్నందుకు ప్రతిపక్షాలను ఆయన విమర్శించారు. వ్యూహాత్మక పొత్తులు, ఆర్థిక ప్రయోజనాల కోసం చేసే ప్రధాని విదేశీ పర్యటనలను ప్రశ్నించడం "పచ్చి అవివేకం" అని ఆయన అన్నారు. శాసన మండలి కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు ఫడ్నవిస్ తన నివాసం 'వర్ష' నుండి బీజేపీ నాయకుడు, మంత్రి ఆశిష్ షెలార్‌తో కలిసి దక్షిణ ముంబైలోని విధాన భవన్‌కు మోటార్‌సైకిల్‌పై చేరుకున్నారు.

## ఆటోలో కేంద్ర మంత్రి అర్జున్



కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్‌వాల్ ఇంధన పొదుపు చర్యలో భాగంగా మే 14న రాజస్థాన్‌లోని బికనేర్‌లో ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలో ప్రయాణించారు. ఇంధనాన్ని పొదుపు చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ నుండి బికనేర్‌కు రైలులో వచ్చిన మంత్రి రైల్వే స్టేషన్‌లో దిగగానే వాహనాల కాన్వాయ్‌ను వద్దన్నారు. బదులుగా ఈ–రిక్షాలో ప్రయాణించాలని నిర్ణయించు కున్నారు. బికనేర్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తికి అనుగుణంగా ఇంధన పొదుపును ప్రోత్సహించడమే ఈ చర్య లక్ష్యమని అన్నారు.

## ఒకే కారులో ఒడిశా సీఎం ప్రయాణం





ఇంధన పొదుపునకు మద్దతుగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తన అధికారిక భద్రతా వాహన సముదాయంలోని వాహనాల సంఖ్యను సగానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన మే 14న ఒక కారులో ప్రయాణించారు. ప్రధానమంత్రి విజ్ఞప్తికి ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (OSRTC)కు చెందిన అన్ని బస్సులను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చనున్నట్లు రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా తెలిపారు.

## మెట్రో రైలులో కేంద్ర మంత్రి అథావలే



కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలే మే 12న ముంబైలో బీకేసీ నుంచి విధాన భవన్ స్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఇంధనాన్ని ఆదా చేసేందుకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన మెట్రో ప్రయాణం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, మధ్యప్రాచ్య సంఘర్షణ ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడాలన్న మోదీ విజ్ఞప్తిని రాజకీయం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. "పెట్రోల్, డీజిల్ ఆదా చేసే దృష్ట్యా మెట్రోలో ప్రయాణించడం అత్యవసరం అని నేను వ్యక్తిగతంగా నిర్ణయించుకున్నాను. చాలా మంది కూడా మెట్రోలో ప్రయాణించి ఇంధనాన్ని ఆదా చేయడంలో సహాయపడాలి" అని తెలిపారు.



# మోదీ ముందడుగు

పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవడానికి మన దేశం ముందుకు వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ ఉద్బోధించిన పొదుపు మంత్రాన్ని ఆచరణలోకి పెట్టడానికి ఉపక్రమించింది. ముఖ్యంగా ఇంధన వాడకం విషయంలో ఆదా మార్గాన్ని అనుసరిస్తోంది. సాక్షాత్తూ ప్రధానమంత్రే పొదుపు దిశగా ఇంతటి మహత్తరమైన పనికి నాంది పలికారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్నారు. మే 13న కేవలం రెండు వాహనాలతోనే మోదీ కాన్వాయ్ ముందుకు సాగింది. ఇదే బాటను పలువురు కేంద్ర మంత్రులు అనుసరించారు. మెట్రో రైలులో ప్రయాణించడం వంటి వినూత్న చర్యలతో జాతి జనులకు ఆదర్శంగా నిలిచారు. మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలూ మోదీ సూచించిన పొదుపు సూత్రం పిలుపును అందిపుచ్చుకున్నాయి. కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను కుదించడంతో పాటు, అధికారిక పర్యటనలో బైక్, కారు ర్యాలీలకు ముగింపు పలికాయి. ఆ దిశగా అధికార యంత్రాంగానికీ తగిన ఆదేశాలు జారీ చేశాయి. ప్రధాని, ముఖ్యమంత్రుల తరహాలో కొందరు అధికారులూ ఇంధన పొదుపు చర్యలను మొదలు పెట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు పోలీసు ఉన్నతాధి కారులు కార్లను పక్కనపెట్టి, కార్యాలయానికి సైకిళ్లపై వచ్చారు. ఇక ప్రధాని విషయానికి వస్తే సహజంగా ఆయన కాన్వాయ్‌లో సాయుధ మెర్సిడెస్-మేబ్యాక్ ఎస్-650 గార్డ్, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12 నుంచి 15 వాహనాల దాకా ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో 50 శాతం తగ్గించాలని ప్రధాని ఆదేశించినట్టు ప్రత్యేక భద్రతా బృందం-ఎస్‌పీజీ అధికారులు వెల్లడించారు. కేంద్ర మంత్రుల్లో అమిత్ షా, నితిన్‌గడ్కరీ, తదితరులు తమ కాన్వాయ్ పరిమాణాన్ని తగ్గించుకున్నారు. తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించినట్టు మే 13న విడుదల చేసిన ఒక ప్రకటనలో నితిన్ గడ్కరీ తెలిపారు. మంత్రులు కపిల్ మిశ్రా, రాందాస్ అథావలే, తదితర మంత్రులు దేశరాజధానిలో వారి కార్యాలయాలకు చేరుకోవడానికి మెట్రో రైలు లాంటి ప్రజారవాణా సౌకర్యాలను వినియోగించుకోవడం ద్వారా తోటి ప్రయాణికులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. అలాగే వీఐపీ సంస్కృతిని పక్కన పెట్టాలని ఢిల్లీ నుంచి మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ , యూపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయించారు. అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. అనవసర విమాన ప్రయాణాలు మానుకోవాలని మంత్రులకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి ఆశిష్ షెలార్ ఫ్రాన్సు దేశ పర్యటనను రద్దు చేసుకున్నారు. జపాన్‌లో అధ్యయన యాత్ర జరపాల్సిన 22 మంది శాసనసభ్యుల పర్యటన కూడా రద్దు అయ్యిందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. కుటుంబ సమేతంగా ఐరోపాలో చేపట్టాల్సిన పర్యటనను మహారాష్ట్ర పర్యాటక మంత్రి శంభురాజ్ దేశాయ్ విరమించుకున్నారు. మధ్యప్రదేశ్ సీఎం తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను 13 నుంచి 8కి తగ్గించుకున్నారు. వాహన ర్యాలీలకు దూరంగా ఉండాలని మంత్రులను ఆదేశించారు. గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్ మే 13న తన కాన్వాయ్‌లో 3 వాహనాలను మాత్రమే వినియోగించారు. మంత్రుల్లో కొందరు తమకు ఎస్కార్ట్ వాహనాలు అక్కర్లేదని తేల్చి చెప్పారు. హెలికాప్టర్ ప్రయాణాలకు దూరంగా ఉండాలని మంత్రులు, అధికారులను గుజరాత్ ప్రభుత్వం ఆదేశించింది. ఢిల్లీ, యూపీ సీఎంలు కూడా తాము పొదుపు చర్యలను మొదలు పెట్టినట్టు సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు.

## విదేశాలకు వద్దు.. యూపీ రండి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తిని రాష్ట్ర ప్రజలు తక్షణం పాటించాలని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, రాబోయే ఆరు నెలల పాటు అత్యవసరం కాని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి యోగి పౌరులను కోరారు. దానికి బదులుగా, విస్తృత శ్రేణి వారసత్వ, సాంస్కృతిక, పర్యావరణ పర్యాటక ప్రదేశాలను అందించే దేశీయ గమ్యస్థానాలను, ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌ను సందర్శించాలని ఆయన యావత్ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మే 12న జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. అనిశ్చిత ప్రపంచ పరిస్థితులలో ప్రభుత్వం, ప్రజలు ఇద్దరూ బాధ్యతాయుతంగా



వ్యవహరించాలని అన్నారు. కాన్వాయ్‌ల నుండి అనవసర వాహనాలను తొలగించి, పరిపాలనలో సామర్థ్యానికి ఒక ఉదాహరణగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేని ఉద్యోగాలలో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు యూపీ సీఎం యోగి మద్దతు తెలిపారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు దీనిని అనుసరించేలా ప్రోత్సహించాలని అధికారులను కోరారు. ప్రయాణాన్ని, ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు రాష్ట్ర సచివాలయం, డైరెక్టరేట్లలో జరిగే అంతర్గత సమావేశాల్లో కనీసం 50 శాతం ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశించారు. సైక్లింగ్, కార్ పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వాడకం వంటి పర్యావరణ అనుకూల మార్గాలను అవలంబించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇళ్లలో, ప్రభుత్వ భవనాల్లో, వాణిజ్య సంస్థల్లో అనవసర విద్యుత్ వినియోగాన్ని నివారించాలని కోరారు. రాత్రి 10 గంటల తర్వాత ప్రైవేట్ సంస్థలు, వాణిజ్య సముదాయాల్లో అలంకరణ దీపాలను తగ్గించాలని సీఎం ఆదేశించారు.

# మన చక్కెర మనకే.. ఎగుమతులపై నిషేధం



**ఎల్ నినో ప్రభావం కారణంగా ఉత్పత్తి తగ్గడం, దేశీయ ధరలు పెరగడం వంటి భయాల నేపథ్యంలో భారత ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 30 వరకు చక్కెర ఎగుమతులపై నిషేధం విధించింది. దీంతో ప్రపంచ మార్కెట్లో చక్కెర ధరలు 2-3% పెరిగాయి.**

ఇరాన్ యుద్ధం ప్రపంచ చమురు సరఫరాలకు తీవ్ర అంతరాయం కలిగించింది. కేంద్ర ప్రభుత్వం దీనిని ముందే ఊహించింది. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బంగారాన్ని కొనవద్దని, పెట్రోలియం, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీనికి ప్రతిస్పందనగా, ప్రభుత్వం ఇప్పుడు చక్కెర ఎగుమతులపై తక్షణ నిషేధాన్ని విధించింది.

ఈ నిషేధం సెప్టెంబర్ 30, 2026 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు అమలులో ఉంటుంది. ప్రపంచంలో చక్కెరను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాలలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది. దేశీయ మార్కెట్లో చక్కెర ధరలు పెరగకుండా నిరోధించడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశ్యం.

**నిర్ణయం వెనుక కారణం**

ఈ ఏడాది ఎల్ నినో రుతుపవనాలపై ప్రభావం చూపుతుందని అంచనా. దీనివల్ల వచ్చే సీజన్‌లో చక్కెర ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. ఉత్పత్తి తగ్గితే, ధరలు పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల, ప్రభుత్వం ఎగుమతులను నిలిపివేయాలని నిర్ణయించింది. వరుసగా రెండో ఏడాది కూడా దేశీయ వినియోగం కంటే ఉత్పత్తి తక్కువగా ఉంటుందని అంచనా. గతంలో, ప్రభుత్వం చక్కెర మిల్లులకు 15.9 లక్షల టన్నుల చక్కెరను ఎగుమతి చేయడానికి అనుమతి ఇచ్చింది. ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని ఆశించారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.

**నోటిఫికేషన్ వివరాలు**

ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం, ముడి చక్కెర, తెల్ల చక్కెర రెండింటి ఎగుమతి నిషేధించారు. కొన్ని షరతుల కింద మాత్రమే అనుమతి మంజూరు చేస్తారు. నోటిఫికేషన్ జారీ చేయడానికి ముందే లోడింగ్ జరిగి ఉంటే, రవాణా కొనసాగించడానికి అనుమతి ఉంటుంది. షిప్పింగ్ బిల్లు దాఖలు చేసి ఓడ ఇప్పటికే భారతీయ ఓడరేవుకు చేరుకున్నట్లయితే, ఎగుమతికి అనుమతి ఉంటుంది. చక్కెరను కస్టమ్స్ లేదా కస్టోడియన్‌కు అప్పగించినప్పటికీ రవాణాకు మార్గం సుగమం అవుతుంది.

**వ్యాపారులపై ప్రభావం**

ముంబైలోని ఒక ప్రధాన అంతర్జాతీయ వాణిజ్య కేంద్రంలోని డీలర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో ప్రభుత్వం స్వేచ్ఛా ఎగుమతులను నిషేధించిందని చెప్పారు. దీని ఆధారంగా వ్యాపారులు విదేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇప్పుడు ఆ ఆర్డర్లను నెరవేర్చడం కష్టంగా మారింది. వ్యాపారులు సుమారు 8 లక్షల టన్నుల చక్కెర కోసం ఎగుమతి ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇందులో 6 లక్షల టన్నులకు పైగా చక్కెర ఇప్పటికే విదేశాలకు రవాణా అయ్యింది. ఇప్పుడు విదేశాలకు కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి. రాయిటర్స్ నివేదిక ప్రకారం, భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ వ్యాప్తంగా తెల్ల చక్కెర, ముడి చక్కెర ధరలను పెంచగలదు. బ్రెజిల్, థాయ్‌లాండ్ వంటి దేశాలు ఆసియా, ఆఫ్రికాలోని కొనుగోలుదారుల నుండి మరిన్ని ఆర్డర్లను పొందవచ్చు. బ్రెజిల్ తర్వాత ప్రపంచంలోనే భారతదేశం రెండవ అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు. ఈ నిషేధం తరువాత, న్యూయార్క్‌లో ముడి చక్కెర ధర 2 శాతానికి పైగా, లండన్‌లో తెల్ల చక్కెర ధర దాదాపు 3 శాతానికి పెరిగింది. ★



# సనాతన ధర్మంపై విషం

రాజకీయ లబ్ది కోసం ప్రజల విశ్వాసాలు, మనోభావాలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం దేశ రాజకీయాల్లో పరిపాటిగా మారింది. దేశంలో సనాతనధర్మాన్ని కించపర్చడం, హిందూ దేవతలను దూషించడం, జాతీయవాదాన్ని విమర్శించడం లక్ష్యంగా పెట్టుకున్న తమిళనాడులో కొన్ని పార్టీలు హద్దుమీరి ప్రవర్తిస్తున్నాయి. ప్రధానంగా డీఎంకే పార్టీ రాష్ట్రంలో బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతూ హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఆ పార్టీ యువ నేత ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. భవిష్యత్తు ముఖ్యమంత్రిగా ఆశలు పెట్టుకున్న ఉదయనిధి అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీలో పట్టు కోసం సనాతన ధర్మంపై పిచ్చి కూతలు కూశారు. ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడంతో దిమ్మతిరిగిన యువరాజు ఉదయనిధి ఇప్పుడు తమిళనాడులో డీఎంకే ఉనికి కోసం సనాతన ధర్మంపై మళ్లీ అవే వ్యాఖ్యలు చేశారు. ద్రవిడ రాజకీయాల కోసం హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకోవాలనుకునే వారికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెబుతున్నా వీరి వక్రబుద్ధి మారకపోవడం శోచనీయం.

ఐదు దశాబ్దాల ద్రవిడ పార్టీల ఒంటెత్తు ఆధిపత్యానికి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళ ప్రజలు చరమగీతం పాడారు. పార్టీ స్థాపించి పట్టుమని మూడేళ్ల కాకమునుపే ద్రవిడ సిద్ధాంతాలతో సంబంధం లేని సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి పట్టంకట్టి ద్రవిడ పార్టీలైన డీఎంకే, ఏఐడీఎంకే పాలనలకు స్వస్తి పలికారు. సనాతన ధర్మంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే డీఎంకేని ప్రజలు తిరస్కరించడం స్వాగతించాల్సిన అంశం. ఉదయనిధి స్టాలిన్ ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడులోని హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అందుకే వారు డీఎంకే పార్టీని వ్యతిరేకిస్తూ వారిని ఓడించే పార్టీగా టీవీకేని గుర్తించి గెలిపించారనడం వాస్తవం.

"తమిళనాడు ప్రజలిచ్చిన తీర్పును మేం తలవంచి ఆమోదిస్తున్నాం..." అంటూ ఓటమి అనంతరం ప్రకటించిన ఉదయనిధి స్టాలిన్ తన పంథాను మార్చుకోకుండా తలపొగరుతో సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. "సనాతన ధర్మాన్ని నిర్మూలించాల్సిందే" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ వివాదంగా మాత్రమే కాకుండా, కోట్లాది హిందువుల విశ్వాసాలు, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వంపై జరిగిన దాడిగా చెప్పవచ్చు. గత కొన్నేళ్లుగా తమిళనాడులో ద్రవిడ రాజకీయాల పేరుతో హిందూ సంప్రదాయాలపై విమర్శలు జరుగుతున్నా, ఇప్పుడు పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. ఒకవైపు హిందూ ఆలయాలకు వెళ్లి పూజలు చేసే రాజకీయ నాయకులు, మరోవైపు సనాతన ధర్మాన్ని అవమానించే వ్యాఖ్యలు చేయడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనం. మే 12న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు సందర్భంగా సభలో ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ "ప్రజలను విభజించే సనాతన ధర్మాన్ని నిర్మూలించాల్సిందే" అంటూ అసందర్భంగా వ్యాఖ్యానించారు. ఇలా ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తొలిసారి కాదు. గతంలో 2023లో జరిగిన ఒక సమావేశంలో "సనాతన ధర్మం డెంగ్యూ, మలేరియా, కరోనా లాంటి వ్యాధుల మాదిరి.. దాన్ని నిర్మూలించాలి" అని వ్యాఖ్యానించి దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి కారణమయ్యారు. నాడు హిందూ సంస్థలు, ఆధ్యాత్మిక పీఠాలు, మతపరమైన సంఘాలు, పలు రాజకీయ పార్టీలు ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాయి. కోట్లాది హిందువులు విశ్వసించే సనాతన ధర్మాన్ని వ్యాధులతో పోల్చడం హిందూ సమాజాన్ని అవమానించడమేనని విమర్శలు వచ్చాయి. కుక్కతోక వంకరే అన్నట్టు ఆయన తన బుద్ధిని మార్చుకోకుండా మళ్లీ అలాంటి మాటలే మాట్లాడారు.

సనాతన ధర్మం అనేది కేవలం మతపరమైన భావన కాదు. అది భారతీయ నాగరికతకు వేల ఏళ్లుగా ఆధారంగా నిలిచిన జీవన విధానం. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి ఆధ్యాత్మిక సంపదల ఆధారంగా అభివృద్ధి చెందిన విశ్వమానవ తత్వం. కుటుంబ వ్యవస్థ, గురు–శిష్య పరంపర, ప్రకృతి పట్ల గౌరవం, సహనం, పరస్పర గౌరవం, భిన్నత్వంలో ఏకత్వం వంటి అనేక విలువలు సనాతన ధర్మానికి మూలస్థంభాలుగా ఉన్నాయి. అలాంటి సంప్రదాయాన్ని "నిర్మూలించాలి" అనడం సాధారణ రాజకీయ విమర్శ కాదు, అది కోట్లాది ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలపై ప్రత్యక్ష దాడిగా కనిపిస్తోంది.

ఉదయనిధి స్టాలిన్ గతంలో చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పలు కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారం సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "మీరు బాధ్యతగల మంత్రి. మీ మాటల ప్రభావం ఏమిటో తెలుసుకోవాలి. ఆర్టికల్ 19, 25 హక్కులను దుర్వినియోగం చేయకూడదు" అంటూ కోర్టు వ్యాఖ్యానించింది. వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రసంగాలు రాజ్యాంగ విలువలకు విరుద్ధమని కూడా సుప్రీంకోర్టు స్పష్టం



చేసింది. అలాగే మద్రాస్ హైకోర్టు కూడా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేసింది. "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" అనే వ్యాఖ్యలు హేట్ స్పీచ్‌లా కనిపిస్తున్నాయని అభిప్రాయపడింది. కోట్లాది ప్రజలు విశ్వసించే ధార్మిక సంప్రదాయాలపై ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను పెంచే ప్రమాదం ఉందని కోర్టు పేర్కొంది. ప్రజాప్రతినిధులు మరింత బాధ్యతతో మాట్లాడాలని కూడా న్యాయస్థానాలు పరోక్షంగా సూచించినా వీరిలో మార్పు రావడం లేదు.

ఉదయనిధి వ్యాఖ్యలను కోర్టు తప్పుపట్టినా ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోలేదు. తాను హిందూ ధర్మానికి వ్యతిరేకం కాదన్నారు. సామాజిక న్యాయం కోసం మాట్లాడానని సమర్థించుకున్నారు. దీనిపై తాను క్షమాపణ చెప్పబోనని దురుసుగా సమాధానం ఇచ్చారు. అయితే "సామాజిక న్యాయం"

# కక్కుతున్న డీఎంకే

పేరుతో హిందూ విశ్వాసాలను అవమానించడం ఒక సాకు మాత్రమే అనేది బహిరంగ రహస్యం. భారత దేశంలో ఇప్పటివరకూ ఎన్నో సంస్కరణోద్యమాలు జరిగినప్పటికీ, ఎవరూ సనాతన ధర్మాన్ని "నిర్మూ లించాలి" అనేలా విర్రవీగలేదు. ఇక్కడ మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, సనాతన ధర్మాన్ని బహిరంగంగా విమర్శించే డీఎంకే నేతలే ఎన్నికల సమయంలో, వ్యక్తిగత సందర్భాల్లో దేవాలయాలకు వెళ్లి పూజలు చేసిన విషయాలు మీడియాలో వెలుగుచూశాయి. ఉదయనిధి స్టాలిన్ తండ్రి ఎమ్.కే.స్టాలిన్ గతంలో తిరుకోష్టియూర్‌లోని వైష్ణవ



ఆలయాన్ని సందర్శించి ఆలయ మర్యాదలు స్వీకరించారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి ముందు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలోని సెంగేని అమ్మన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.. "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" అని వ్యాఖ్యా నించిన నాయకుడే ఎన్నికల ముందు ఆలయాలకు వెళ్లడం రాజకీయ అవసరాల కోసమా లేదా ఒక సామాజిక వర్గాన్ని వంచించి ఓట్లు పొందడానికా అనే వాటిపై వారు సమాధానం చెప్పాలి. సాధారణ హిందూ భక్తులు ఆలయాలను భక్తి కేంద్రాలుగా చూస్తారని, కానీ కొందరు రాజకీయ నాయకులు మాత్రం ఎన్నికల సమయంలో హిందూ ఓట్ల కోసం ఆలయాలకు వెళ్లి, తర్వాత అదే హిందూ సంప్ర దాయాలపై విమర్శలు చేస్తూ వారి ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నారు.

తమిళనాట డీఎంకే రాజకీయ చరిత్రలో హిందూ సంప్రదాయాలపై విమర్శలు కొత్త విషయం కాదు. ద్రావిడ రాజకీయాల ఆరంభం నుంచే హిందూ ఆచారాలపై విమర్శలు, మతపరమైన సంప్రదాయా లపై వ్యంగ్య వ్యాఖ్యలు వారి రాజకీయాల్లో భాగమయ్యాయి. పెరియార్ ప్రభావంతో ఏర్పడిన ఈ రాజకీయ ధోరణి ఇప్పటికీ డీఎంకే నేతల మాటల్లో కనిపిస్తోంది. తాము హిందూ ధర్మానికి వ్యతిరేకం కాదని, కుల వివక్షకు వ్యతిరేకమని చెబుతూ వారు సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. కుల, సామాజిక వర్గాల వివక్ష కేవలం హిందూ ధర్మంలోనే ఉన్నట్టు, మరే ఇతర మతంలోనూ లేనట్టు వారు వ్యవహరిస్తున్న తీరు బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనం. వీరి ఓట్ల రాజకీయాలు ఎక్కడి దాకా వెళ్లాయంటే లౌకికవాద మంటూ హిందువులను, వారి ఆలయాలను లక్ష్యంగా చేసుకొని కుట్రలు పన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల ఓడిపోయిన డీఎంకే ప్రభుత్వం తాము అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఆలయ సంప్రదాయాలకు సంబంధించి మరో వివాదానికి తెరదీసింది. తిరుప్పరంకుండ్రం ప్రాంతం లోని కార్తిగై జ్యోతి వెలిగించే సంప్రదాయం విషయంలో తమిళనాడు ప్రభుత్వ వైఖరి తీవ్ర వివాదాస్పదమైంది. అక్కడ శతాబ్దాలుగా కొనసాగు తున్న జ్యోతి వెలిగించే సంప్రదాయాలపై డీఎంకే ప్రభుత్వం పరిమితులు విధించడం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై "ఆచార వ్యవహారాల్లో ప్రభుత్వం అవసరానికి మించి జోక్యం చేసుకో కూడదు" అని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ధార్మిక సంప్రదాయాల నిర్వహణలో ఆలయ పరిపాలనకే ప్రధాన హక్కు ఉంటుందని కోర్టు పేర్కొంది. ఈ సంఘటనతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహానికి లోనై తమిళనాడులో ఆలయాలపై ప్రభుత్వ నియంత్రణ పెరుగుతోంది అని నిరసనలు చేపట్టాయి. రాష్ట్రంలోని వేలాది ఆలయాలు ప్రభుత్వ నియంత్రణలో ఉండటం, ఆలయ నిధుల వినియోగం, సంప్రదాయాల నిర్వహణ వంటి అంశాలపై తరచూ వివాదాలు చెలరేగుతున్నాయి. ఇతర మత సంస్థల విషయాలను పట్టించుకోని ప్రభుత్వాలు హిందూ ధర్మంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నాయని హిందువులు ప్రశ్నిస్తేనే వీరికి బుద్ధి వస్తుంది.

తమిళనాడులో ద్రవిడ పార్టీలు ఎంతగా హిందూ సంప్రదాయాలను విమర్శించినా, ప్రజలలో హిందూ ఆధ్యాత్మికత మాత్రం బలంగా కొనసాగుతోంది. తమిళనాడు ఆలయ సంస్కృతికి కేంద్ర బిందువుగా నిలిచిన రాష్ట్రం. చెన్నై నగరాని టెంపుల్ సిటీగా పిలుస్తారు. ఆ రాష్ట్రంలో మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం, చిదంబరం, శ్రీరంగం, పళని, తిరువణ్ణామలై వంటి మహాక్షేత్రాలు కోట్లాది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తున్నాయి.

భారతదేశం అనేది విభిన్న మతాలు, భాషలు, సంప్రదాయాలు కలిసిన దేశం. అలాంటి దేశంలో పరస్పర గౌరవం అత్యంత ముఖ్యమైన అంశం. రాజకీయ విభేదాలు ఉండొచ్చు, సామాజిక సంస్కరణలపై చర్చలు జరగొచ్చు. కానీ కోట్లాది ప్రజలు విశ్వసించే సంప్రదాయాలను అవమానిం చడం దురదృష్టకరం. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు మాట్లాడే ప్రతి మాటకు సామాజిక ప్రభావం ఉంటుందని, అందుకే వారు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ హక్కు కల్పించింది. అదే సమయంలో ఇతరుల మత విశ్వాసాలను గౌరవిం చడం కూడా ప్రజాస్వామ్య సమాజంలో కీలకమైన బాధ్యత. ఒక మతం లేదా సంప్రదాయంపై విమర్శలు చేయాలంటే అవి నిర్మాణాత్మకంగా ఉండాలి కానీ అవమానకరంగా కాకూడదు. "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" వంటి వ్యాఖ్యలు జాతీయ ఐక్యతకు మంచివి కావు. అవి దేశంలో విభజనాత్మక రాజకీయాలకు దారితీసే ప్రమాదం ఉంది.

ఒకవైపు డీఎంకే నేతలు తమ వ్యాఖ్యలను సామాజిక న్యాయం కోణంలో సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు కోట్లాది హిందువులు మాత్రం తమ విశ్వాసాలను అవమానించడాన్ని సహించబోరు. "సనాతన ధర్మం భారతీయ సంస్కృతికి వెన్నెముక" అని, దానిని కించపరచడం అంటే భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని అవమానించడమే. సహనానికి మారు పేరుగా ఉండే హిందువులను ఏమన్నా పట్టించుకోరని, వారిని ఎంత విమర్శిస్తే రాజకీయంగా అంత లబ్ధి చేకూరుతుందని విశ్వసించే రాజకీయాలు ఉన్నంత కాలం సనాతన ధర్మానికి ఇలాంటి నేతలచే అవమానాలు వస్తూనే ఉంటాయి. వీటికి ముగింపు పలకాలంటే హిందువుల్లో చైతన్యం రావాల్సిన ఆవశ్యకత ఉంది. ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పుడు పత్రికల్లో, టీవీలో చర్చలు, వీధుల్లో నిరసనలతో ఎలాంటి ఫలితాలుండవు. కొంత కాలం తర్వాత మర్చే పోతారు. అవసరమొచ్చినప్పుడు మళ్లీ రెచ్చగొడుతుంటారు. అందుకే సనాతన ధర్మాన్ని అనుసరించే ప్రజలు మేల్కొని ఇలాంటి నేతల రాజకీయ నేతలు, పార్టీల పునాదులను కూల్చివేసి వారి భవిష్యత్తును నాశనం చేసేలా సమయమొచ్చి నప్పుడు వారికి రాజకీయంగా బుద్ధి చెప్పాలి.

– **శ్రీపాద**

**రాష్ట్రం ఒకవైపు అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. మరోవైపు రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పునాదులు పటిష్టమవుతున్నాయి. ఈ రెండు అంశాలు పూర్తి విభిన్నంగా కనిపించినప్పటికీ.. మే 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు సాక్ష్యాలుగా నిలిచాయి. ఒకేరోజు..ఈ రెండు అంశాలు వెలుగు జిలుగుల సంకేతాలను ఇచ్చాయి.**



# కమల వికాసానికి అభివృ

రాష్ట్రం అధికారంలో ఉన్నది ఎవరు? అని కాకుండా ప్రగతే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా దూసుకు వెళుతుండడం, రూ. వేల కోట్ల విలువైన ప్రతిపాదనలను సాక్షాత్కారం చేస్తున్న తీరు.. అదే సమయంలో జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న పార్టీగా, రాష్ట్రంలో పునాదులను పటిష్టం చేసుకుంటున్న తీరు పార్టీ శ్రేణులకు ముచ్చటగొలుపుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 10వ తేదీ మధ్యాహ్నం కర్ణాటక పర్యటన ముగించుకొని హైదరాబాద్ రావడం బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. అధికారిక కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ. 9,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభ వేదిక నుంచి కేవలం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం సంబంధాలు, ప్రగతి గురించే మాట్లాడారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్తున్నామనే అంశాలనే ప్రస్తావించారు. మరోవైపు.. అదేరోజు సాయంత్రం పార్టీ తరపున సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ ప్రతినిధిగా పాల్గొన్నారు. అధికారిక, పార్టీ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్క రోజులో రెండు కార్యక్రమాలు అధికారిక వేడుకలు, పార్టీ బహిరంగ సభ. రెండింటికీ మోదీ సమాన ప్రాధాన్యత ఇచ్చారు. దేశ నాయకుడిగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అదే మోదీ, పార్టీ నాయకుడిగా వేలాది కార్యకర్తల మనసులు దోచుకున్నారు. ఇది కేవలం ఒక పర్యటన మాత్రమే కాదు.. ఇది ఒక సందేశం. ఎక్కడ చేయాల్సిన ప్రసంగం అక్కడ చేశారు. రాష్ట్రంలో బీజేపీకి మరింత ఉత్సాహం తీసుకొచ్చారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచే పార్టీ అసాధారణమైన ఉత్సాహం. రోడ్లు, పార్కులు, పందిళ్లు ఎక్కడ చూసినా పార్టీ పతాకాలు, జాతీయ జెండాలు. రాష్ట్రంలో బీజేపీ వేళ్లూనుకుంటోందని, ఆ వేళ్లకు నీరు పోసేవాడు నరేంద్ర మోదీ అన్న భావనను స్ఫురింప చేసింది. ముఖ్యంగా దక్షిణాదిన పాగా వేయడానికి ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ.. తెలంగాణను 'గేట్ వే'గా ఎంచుకుంది. పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరించే ప్రయత్నాలను చాపకింద నీరులా కొన్నేళ్లుగా చేపట్టింది. ప్రజలను అభివృద్ధితోనే ఆకట్టుకునే యత్నాలను ముమ్మరం చేసింది. ఇవి ప్రధాని తాజా పర్యటనతో మరింత ఊపు తెచ్చాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గచ్చిబౌలిలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా దాదాపు రూ. 9,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితాలు జరిగాయి. రోడ్లు, రైల్వే ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్లు, టెక్స్‌టైల్స్, ఎనర్జీ, ఆరోగ్యం.. ఇలా ఆరు కీలక రంగాల్లో ఒకే రోజున పెద్ద ఎత్తున పనులు మొదలుకావడం తెలంగాణ చరిత్రలో అపూర్వం. జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపైంది. రైల్వే పెట్టుబడి రూ. వెయ్యి కోట్ల నుంచి రూ. 5,500 కోట్లకు చేరింది. కేంద్రం పదకొండేళ్లలో రూ. 1.75 లక్షల కోట్లు జాతీయ రహదారుల కోసం ఖర్చు చేసింది. పారిశ్రామిక కారిడార్లు, టెక్స్‌టైల్ పార్కులు, ఎనర్జీ ప్రాజెక్టులు ఇవన్నీ 'వికసిత తెలంగాణ – వికసిత భారత్' అన్న మోదీ విజన్ అమలులో భాగం. రాష్ట్ర జనాభా 3 శాతమే అయినా జాతీయ జీడీపీలో 5 శాతం వాటా ఇస్తోంది. ఆ శక్తిని మరింత పెంచాలన్న ఉద్దేశంతోనే కేంద్రం తెలంగాణలో పెట్టుబడులను కొనసాగిస్తోంది.

**'167' విస్తరణకు రూ.3,175 కోట్లు**

గుడేబెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు జాతీయ రహదారి–167ని రూ. 3,175 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్–పనాజి ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా నిర్మించే ఈ రహదారి తెలంగాణ–కర్ణాటక మధ్య అనుసంధానతను బలోపేతం చేస్తుంది. ప్రయాణ సమయం దాదాపు గంటన్నర తగ్గనుంది. ఇంధన వినియోగం, వాహన నిర్వహణ వ్యయం కూడా తగ్గుతాయి. పారిశ్రామిక వికాసానికి ఈ రోడ్డు కీలక లింక్ అవుతుంది.

**జహీరాబాద్ పారిశ్రామికాభివృద్ధి**

సంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కింద జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతానికి శంకుస్థాపన జరిగింది. 3,245 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2,350 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఈ జోన్ పూర్తయితే దాదాపు రూ. 10,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలదని అంచనా. వాహన తయారీ, యంత్ర పరికరాలు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు ఇక్కడికి వస్తాయి. జాతీయరహదారి–65 వెంబడి ఉన్న ఈ ప్రాంతానికి జాతీయ రహదారులు, రైలు నెట్‌వర్క్, విమానాశ్రయాలు, ఓడరేవులతో నేరుగా అనుసంధానత



# ద్దే బ్రహ్మాస్త్రం

ఉంటుంది. రాష్ట్ర కార్మికులకు, రైతులకు ఈ ప్రాజెక్టు కొత్త జీవనాధారం అవుతుందని మోదీ స్వయంగా హామీ ఇచ్చారు.

**వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్**

వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరిట నిర్మించిన పీఎం మిత్ర పార్క్ ప్రారంభోత్సవం మోదీ పర్యటనలో అత్యంత చారిత్రాత్మక క్షణం. ఇది దేశంలోనే మొదటి పూర్తిస్థాయి పీఎం మిత్ర పార్క్. రూ.1,700 కోట్లతో 1,327 ఎకరాల్లో నిర్మితమైంది. అంతర్గత రోడ్ల నెట్‌వర్క్, విద్యుత్ సబ్‌స్టేషన్, నీటి సరఫరా వ్యవస్థ, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ సాంకేతికతతో కూడిన ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్.. ఇవన్నీ ప్రపంచస్థాయి సదుపాయాలు ఉన్నాయి. ముఖ్యంగా మహిళలకు, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని మోదీ స్పష్టం చేశారు. నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఉన్న ఈ పార్క్ అంతర్జాతీయ వాణిజ్యానికి కూడా అనువైన లోకేషన్.

**రూ.1,535 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు**

కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్ట్ (118 కి.మీ.), కాజీపేట రైల్ అండర్ రైల్ బైపాస్ ప్రాజెక్టులు జాతికి అంకితమయ్యాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే ఫ్రెయిట్ కారిడార్లలో ఒకటైన ఈ మార్గంలో రద్దీ తగ్గి సామర్థ్యం పెరుగుతుంది. 2014కి ముందు అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు ఏడాదికి రూ. వెయ్యి కోట్లకు మించి రైల్వే కేటాయింపు ఉండేవి కాదని, ఇప్పుడు ఒక్క తెలంగాణకు ఏటా దాదాపు రూ.5,500 కోట్లు కేటాయిస్తున్నట్లు మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం రూ.50,000 కోట్ల విలువైన రైల్వే పనులు ఒకేసారి అమలవుతున్నాయి. ఇప్పటికే ఐదు వందేభారత్, ఆరు అమృత్ భారత్ రైళ్లు తెలంగాణ మీదుగా నడుస్తున్నాయి.

**మల్కాపూర్ ఇండియన్ ఆయిల్ టెర్మినల్**

హైదరాబాద్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.600 కోట్లతో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ మల్కాపూర్ పెట్రోలియం టెర్మినల్‌ను జాతికి అంకితం చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ, సరఫరా సామర్థ్యాన్ని పెంచే ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ టెర్మినల్ ఎంత అవసరమో ఈ ప్రాజెక్ట్ ద్వారా మోదీ వివరించారు.

సింధు హాస్పిటల్‌ను జాతికి అంకితం చేశారు. కాన్సర్ చికిత్సపై దృష్టిపెట్టిన ఈ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 1,500 పడకలు, 29 ఆపరేషన్ థియేటర్లు, 33కి పైగా సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. ఇది కేవలం ఒక ఆసుపత్రి కాదు.. తెలంగాణలో ప్రపంచస్థాయి వైద్యం అందించాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి ప్రతీక.

**ఓట్లు కాదు...అభివృద్ధి ప్రధానం**

తెలంగాణలో బీజేపీ కేవలం ఓట్ల కోసం తిరగడం లేదు. అభివృద్ధి ద్వారా ప్రజల గుండెల్లోకి నేరుగా చేరడమే వ్యూహం. నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు, పథకాలు అందిస్తూ వస్తోంది. ఆ లెక్కలు పత్రికల్లో మాత్రమే కాదు, తెలంగాణ వీధుల్లో కూడా కనిపిస్తున్నాయి. రోడ్లు మారుతున్నాయి. రైళ్లు సకాలానికి నడుస్తున్నాయి. డిజిటల్ ఇండియా రాష్ట్రంలోని గ్రామాలకు చేరుతోంది. రాజకీయ ప్రత్యర్థులు ఏం చేసినా, ప్రజలు అభివృద్ధిని చూస్తారు. తాగునీళ్లు వచ్చాయా? పిల్లలకు స్కాలర్‌షిప్ వచ్చిందా? రైతుకు కిసాన్ నిధి అందిందా? ఇవే ప్రశ్నలు వేసుకునే వర్గాలకు మోదీ పాలన సమాధానంగా నిలుస్తోంది.

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి కార్యకర్తలు తరలి వచ్చిన దృశ్యం ఒక్కసారిగా రాజకీయ పరిశీలకులను ఆలోచింపజేసింది. ఇది కేవలం ఒక బహిరంగ సభ కాదు.. ఇది తెలంగాణ బీజేపీ తన బలాన్ని చాటుకున్న వేదిక. ఈ ప్రజలతో మాకు అనుబంధం ఉంది అని చెప్పిన క్షణం. మోదీ చేసిన ప్రసంగం సభికులను కదిలించింది. ఆయన మాటల్లో కేంద్రప్రభుత్వం చేసిన పని ఉంది, తెలంగాణ ప్రజల పట్ల అభిమానం ఉంది, రాష్ట్రానికి

తెలంగాణలో బీజేపీ కేవలం ఓట్ల కోసం తిరగడం లేదు. అభివృద్ధి ద్వారా ప్రజల గుండెల్లోకి నేరుగా చేరడమే వ్యూహం. నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు, పథకాలు అందిస్తూ వస్తోంది. ఆ లెక్కలు పత్రికల్లో మాత్రమే కాదు, తెలంగాణ వీధుల్లో కూడా కనిపిస్తున్నాయి. రోడ్లు మారుతున్నాయి. రైళ్లు సకాలానికి నడుస్తున్నాయి. డిజిటల్ ఇండియా రాష్ట్రంలోని గ్రామాలకు చేరుతోంది.

బీజేపీ ఇస్తున్న భరోసా ఉంది. ఆయన చెప్పిన ఒక్కో అంశం ఒక్కో నినాదమై ఆ గ్రౌండ్‌లో ప్రతిధ్వనించింది. తెలంగాణ బీజేపీలో మోదీ ప్రభావం మాటల్లో చెప్పడం కష్టం. కానీ ఆ రోజు సికింద్రాబాద్ గ్రౌండ్లో కనిపించింది. కార్యకర్తల కళ్లలో కొత్త వెలుగు. సంవత్సరాల కష్టాలు, ఎన్నికల్లో నష్టాలు, ప్రజలను చేరుకోవడంలో ఇబ్బందులు.. వాటన్నిటినీ మోదీ ఒక్క పర్యటనతో కడిగేసినట్టు అనిపించింది.

**తెలంగాణ - దక్షిణాదికి గేట్‌వే**

దక్షిణ భారతదేశంలో అడుగుపెట్టడం కోసం బీజేపీ మొదటి నుంచి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక.. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సవాలు. కానీ తెలంగాణ మాత్రం మినహాయింపు. ఇక్కడ బీజేపీకి ఒక సహజమైన పునాది ఉంది. హైందవ సంస్కృతి, చారిత్రక అనుబంధం, పట్టణ మధ్యతరగతి ఓటర్లు. వీళ్లంతా బీజేపీ వైపు మొగ్గు చూపుతారు. ఈ నేపథ్యంలో తెలంగాణను దక్షిణాదికి 'గేట్‌వే' గా బీజేపీ ఎంచుకోవడం కొన్నేళ్లుగా పార్టీ తెలంగాణలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. బూత్ స్థాయిలో కార్యకర్తల సంఖ్యను పెంచడం, స్థానిక నాయకులతో సంప్రదింపులు, మహిళలు, యువత, వ్యవసాయదారులతో సేవాకార్యక్రమాలు.. ఇవి మీడియాలో కనపడవు, కానీ మండలస్థాయిలో కనిపిస్తున్నాయి. నరేంద్రమోదీ పర్యటనతో బీజేపీ కొత్త ఉత్సాహంతో, కొత్త లక్ష్యాలతో ముందుకు కదులుతోంది. ఒక్కో మండలంలో పార్టీ బలపడుతోంది. ఒక్కో ఓటర్ పార్టీని నమ్ముతున్నాడు. ఒక్కో కార్యకర్త మరింత చురుకుగా పనిచేస్తున్నాడు. అభివృద్ధే ఆయుధంగా, ఐక్యతే శక్తిగా, మోదీయే మార్గదర్శకుడిగా.. తెలంగాణ బీజేపీ భవిష్యత్తువైపు.. నమ్మకంగా ముందుకు కదులుతోంది.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068




# యుద్ధవిమా

ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, వైమానిక రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా మే 15వ తేదీన భారీ ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దేశీయంగా ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం కానుంది. పౌరవిమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నావల్ సిస్టమ్స్ యూనిట్, కర్నూలులో ఏర్పాటు చేయనున్న డ్రోన్ సిటీ సహా మొత్తం రూ.4,145 కోట్ల విలువైన మరో 12 రక్షణ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. రక్షణ శాఖ ఏర్పాటు చేసిన పరిశోధనా పరికరాలను పరిశీలించారు.




దేశం రక్షణ రంగంలో స్వయం శక్తిగా ఎదుగుతోందని, గతంలో దేశ రక్షణ విషయంలో ఇతర దేశాలపై ఆధారపడేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆ దిశలో ముందుకెళుతున్నామని అన్నారు. ‘2014 వరకు దేశంలో రక్షణ ఉత్పత్తులు రూ.46 వేల కోట్లు మాత్రమే ఉండేవి. 2024 సంవత్సరానికి రూ.1.50 లక్షల కోట్లకు చేరాయి. వచ్చే నెలకు అవి రూ.1.75 లక్షల కోట్లకు చేరతాయి’ అని వివరించారు. దశాబ్దం కిందట రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు రూ.400 కోట్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు రూ.40 వేల కోట్లకు చేరాయని చెప్పారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ పరిశోధన సంస్థ ఐదోతరం యుద్ధ విమానాలకు రూపకల్పన చేస్తుందన్నారు. ‘ఏఎంసీఏ’ కార్యక్రమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15,000 కోట్లు కేటాయించింది. ఇందులో డీఆర్‌డీఓ అనుబంధ సంస్థ ‘ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ’ పరిధిలో రూ.2,000 కోట్లతో ఏర్పాటయ్యే ‘కోర్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్’ ఓ కీలక భాగంగా ఉంటుంది. గగనతలంలోకి ఐదో తరం యుద్ధ విమానాలను ప్రవేశపెట్టగల ప్రపంచం లోని అరుదైన ప్రదేశాల జాబితాలో పుట్టపర్తి కూడా స్థానం సంపాదిస్తుంది. శత్రువును రెప్పపాటులో మట్టుపెట్టే సామర్థ్యం కలిగిన అత్యాధునిక యుద్ధ విమానానికి ఇదొక జన్మభూమిగా మారుతుంది’ అని రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

విశాఖలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన సముద్ర రక్షణ వ్యవస్థను బలోపేతం చేసే అండర్ వాటర్ వెహికల్ రూపొందనున్నాయని రక్షణమంత్రి చెప్పారు.కర్నూలులో ఏర్పాటు చేయబోయే డ్రోన్ సిటీ రాబోయే సాంతికాభివృద్ధిలో ఎంతో కీలకం కానుందని తెలిపారు. సూరత్ వజ్రాల పరిశ్రమగా, బెంగళూరు సిలికన్ వ్యాలీగా పిలుస్తున్నట్లే కర్నూలును డ్రోన్ హబ్‌గా రాబోయే రోజుల్లో పిలుస్తామని చెప్పారు.

**దేశానికి రక్షణ కవచంగా ఏపీ: చంద్రబాబు**

రాయలసీమలో డిఫెన్స్ యూనిట్ ఏర్పాటుతో దేశానికి ఏపీ రక్షణ కవచంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఏఎంసీఏను రాష్ట్రానికి ఇవ్వాలని కోరగానే రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించి పుట్టపర్తికి వచ్చేలా కృషి చేశారని ధన్యవాదాలు తెలిపారు. ఏఎంసిఏ రాకతో పుట్టపర్తి దేశంలోనే గర్వించదగ్గ వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా గుర్తింపు పొందుతుందని చెప్పారు. దీనికోసం 600 ఎకరాలు కేటాయించినట్లు చెప్పారు. ఈ యూనిట్ ద్వారా 7,500 ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. వచ్చే నెలలో కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తామని, 2028 డిసెంబర్ నాటికి స్టీలు ప్లాంట్ పనులు పూర్తవుతాయని చేస్తామని వెల్లడించారు. రాయలసీమ ప్రాంతం పరిశ్రమలు, సోలార్ ద్వారా అభివృద్ధి అయ్యే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. కర్నూలు జిల్లా జీజీఎఫ్ (జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్)లో బంగారం తవ్వకాలు త్వరలో ప్రారంభం కానున్నాయని, మొదటి ఏడాది 600 కిలోల బంగారం వెలుగులోకి వస్తుందని చెప్పారు. రెండో ఏడాది నుంచి 1,500 కిలోలు ఉత్పత్తి చేసే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ఉత్తరాంధ్రలోని విశాఖలో ఐటి, డేటా కేంద్రం ఏర్పాటు కానున్నాయని, అమరావతి క్వాంటమ్ కంప్యూటరింగ్, విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందనుందని చెప్పారు. విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో మరిన్ని విమాన సర్వీసులకు కృషి చేస్తానని తెలిపారు.

**‘స్టెల్త్’ అద్భుత సాంకేతిక విజయం**

స్టెల్త్ అంటే శత్రువు రాడార్‌కు కనిపించకుండా ఉండే విశేష సామర్థ్యం. అంతేకాదు ఇవి బహుముఖ యోధులు. శత్రువుల ప్రాంతంలోకి ప్రవేశించి వైమానిక దాడులు చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధం నిర్వహించడం, అవసరమైతే గాల్లో శత్రు విమానాలను కూల్చడం ఇవన్నీ ఒకే విమానం చేయగలదు. ఈ విమానాలు పదునైన కోణాల ఆకృతి, రాడార్ తరంగాలను గ్రహించే ప్రత్యేక పూత, లోపలే దాచిన




# నాలకు కీలకం పుట్టపర్తి



ఆయుధాలు, ఇంజన్ వేడిని తగ్గించే వ్యవస్థ వంటి నాలుగు పద్ధతుల వల్ల శత్రుదేశపు రాడార్‌కు ఇవి కనిపించవు. ప్రపంచంలో ఇప్పుడు అమెరికా (ఎఫ్–22, ఎఫ్–35), రష్యా (సుఖోయ్ ఎస్‌యూ–57), చైనా (జే–20) మాత్రమే ఈ విమానాలు తయారు చేస్తున్నాయి. అమెరికా ఎఫ్ –35 ఒక్కో విమానం ధర దాదాపు 80 నుండి 110 మిలియన్ డాలర్లు. భారత్ గతంలో రష్యా నుండి సుఖోయ్–30 ఎంకెఐ, ఫ్రాన్స్ నుండి రఫేల్ విమానాలు కొనుగోలు చేసింది. కానీ ఇవి 4వ తరం విమానాలు మాత్రమే. 5వ తరం స్టెల్త్ విమానాలు ఏ దేశం అమ్మడానికి ముందుకు రాలేదు. మన రక్షణ రంగం బలోపేతం చేసేందుకు భారత్ స్వయంగా ఏఎంసిఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) అభివృద్ధి చేపట్టింది. ఈ కార్యక్రమం డీఆర్‌డీఓ, హెచ్‌ఏఎల్ నేతృత్వంలో జరుగుతోంది. 2034 నాటికి ఏఎంసీఏ భారత వాయుసేనలో చేరుతుందని అంచనా. 25 టన్నుల బరువుతో తయారుకానున్న ఈ యుద్ధ విమానంలో కృత్రిమ మేధతో నడిపే ఎలక్ట్రానిక్ పైలట్, ఆయుధ వ్యవస్థలు ఉంటాయి. ఈ విమానాల తయారీ వల్ల భారత్‌కు మూడు పెద్ద లాభాలు కలుగుతాయి. మొదట, చైనా జే–20 ముందు వ్యూహాత్మక సమానత్వం చేకూరుతుంది. రెండవది, విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గి వేల కోట్లు ఆదా అవుతాయి. మూడవది, ఏరోస్పేస్ రంగంలో వేలాది ఉద్యోగాలు వస్తాయి. భారత్ రక్షణ సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధిస్తుంది.

**స్టెల్త్ టెక్నాలజీ విశిష్టత**

1. ఆకృతి: స్టెల్త్ విమానం బాడీ డిజైన్ చేసే తీరే భిన్నంగా ఉంటుంది. సాధారణ విమానం గుండ్రటి ముక్కు, వేలాడే ఇంజన్ పాడ్లు, నిటారైన తోకతో ఉంటుంది. ఇవన్నీ రాడార్ తరంగాలను నేరుగా వెనక్కి పంపే అద్దాల్లా పని చేస్తాయి. స్టెల్త్ విమానం మాత్రం పదునైన వజ్రపు ఆకృతితో, అన్ని ఉపరితలాలూ రాడార్ సిగ్నల్‌ను పక్కగా చెదిరేలా వంచబడి ఉంటాయి. ఏఎంసీఏలోని సర్పెంటైన్ (వంకర) ఎయిర్ ఇన్‌టేక్ ఇందుకు అద్భుతమైన ఉదాహరణ. ఇంజన్ ఫ్యాన్ బ్లేడ్లు రాడార్‌కు నేరుగా కనిపించకుండా వంకర సొరంగంలో దాచబడతాయి.

**2. ఆర్ఏఎం (రాడార్ అబ్‌సార్బెంట్ మెటీరియల్స్)**

కార్బన్, ఫెరైట్ రేణువులతో తయారైన ప్రత్యేక పెయింట్, కాంపోజిట్ మెటీరియల్ విమానం పైన పూస్తారు. ఈ పదార్థాలు రాడార్ విద్యుదయస్కాంత శక్తిని వెనక్కి పంపించకుండా తనలోనే వేడిగా మార్చి శోషిస్తాయి. 70 నుండి 80 శాతం రాడార్ శక్తి ఇలా నిర్మూలమవుతుంది. ఎఫ్–117 నైట్‌హాక్ విమానం ఇదే పద్ధతి ద్వారా 1991 గల్ఫ్ యుద్ధంలో శత్రు రాడార్లకు చిక్కకుండా దాదాపు అదృశ్యంగా ఉంది.

**3. అంతర్గత ఆయుధ బేలు**

సాధారణ విమానం రెక్కల కింద క్షిపణులు, బాంబులు అమరుస్తారు. ఇవి అతిపెద్ద రాడార్ రిఫ్లెక్టర్లు. ఒక్కో క్షిపణి విమానం రాడార్ క్రాస్ సెక్షన్‌ను పది రెట్లు పెంచగలదు. స్టెల్త్ విమానం అన్ని ఆయుధాలనూ శరీరం లోపల దాచుకుంటుంది. దాడి చేసే క్షణంలో మాత్రమే బేల్ తలుపు కొన్ని సెకన్లు తెరుచుకుని క్షిపణి వదులుతుంది. ఆ సమయంలో మాత్రమే రాడార్‌కు కొంచెం కనిపిస్తుంది.

**4. ఉష్ణ నిర్వహణ**

రాడార్ మాత్రమే కాదు. ఆధునిక క్షిపణులు ఇంజన్ వేడిని ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్ల ద్వారా గుర్తిస్తాయి. స్టెల్త్ విమానాలు ఇంజన్ నాజిల్ నుండి వెలువడే 1600 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడి గాలిని చల్లటి వాతావరణ గాలితో కలిపి మిక్సింగ్ డక్ట్ ద్వారా 400 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువకు తగ్గిస్తాయి. నాజిల్ ఆకృతి కూడా వేడిని ఒక దిశలో కాకుండా విస్తరింపజేసేలా చదునుగా ఉంటుంది.

**5. ఎలక్ట్రానిక్ నిశ్శబ్దం**

సాధారణ రాడార్ బలమైన పల్స్ పంపుతుంది. శత్రువు దాన్ని పట్టుకుని "అక్కడ విమానం ఉంది" అని తెలుసుకుంటాడు. స్టెల్త్ విమానంలో ప్రాబబిలిటీ ఆఫ్ ఇంటర్‌సెప్ట్ రాడార్ ఉంటుంది. ఇది సిగ్నల్‌ను చాలా బలహీనంగా, వేర్వేరు ఫ్రీక్వెన్సీలలో చెల్లా చెదురుగా పంపుతుంది. శత్రువు దాన్ని నేపథ్య శబ్దం నుండి వేరు చేయలేడు. యుద్ధం మొదలయ్యే వరకు విమానం పూర్తి రేడియో నిశ్శబ్దం పాటిస్తుంది.

ఈ అయిదు పద్ధతులు ఒకేసారి పని చేస్తాయి. ఒక్కో పద్ధతి మాత్రమే ఉంటే ప్రభావం తక్కువ. అన్నీ కలిసినప్పుడే నిజమైన స్టెల్త్ సాధ్యమవుతుంది. ఏఎంసీఏ ఈ అన్ని అంశాలనూ స్వదేశీయంగా అభివృద్ధి చేయడమే భారత్‌కు అతి పెద్ద సాంకేతిక సవాలు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



# ఈ ఖరీఫ్‌లో పంట మార్పి

**వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో ఈ సంవత్సరంలో (2026) ఖరీఫ్ పంటకాలానికి రైతులందరు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ వేసవిలో పలు ప్రాంతాల్లో వేసవి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగి జన బాహుళ్యానికి ఎండ వేడిమి ఎక్కువై సతమతమవుచున్నారు. వేసవి తాపంతోపాటు ఈ పంట కాలం (ఖరీఫ్)లో రుతుపవనాల ద్వారా వర్షపాతం సాధారణ సగటు వర్షపాతం, సాధారణ సగటు వర్షపాతం, సాధారణ స్థాయి కన్నా మిన్నగా ఉండదని వాతావరణ శాఖ ప్రాథమిక అంచనా. సాధారణ వర్షపాతం కన్నా మించి వర్షాలు రాకపోవటంవల్ల సాగు నీటికి కూడా కటకట పడవలసి వస్తుందనే నేపథ్యానికి తోడు యూరప్– గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల కారణంగా యూరియా, ఇతరముల సరఫరాలో కొంతమేరకు ఇబ్బందులు ఉండవచ్చని తెలిసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగానే తగిన చర్యలను తీసుకుంటూ ఖరీఫ్ సాగుకు రైతాంగాన్ని సంసిద్ధం చేస్తున్నది.**

వ్యవసాయ రంగంలో సాగు క్రమంగా ముందుకు సాగుటకు ప్రధానమైనది పెట్టుబడి. ఆయా ప్రాంతాల్లో పంటల సాగుకు అనువైన నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక పరిజ్ఞానం సాగునీరు, ఎరువులు, పురుగుమందులు, కోత తర్వాత సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలుచేయటం, దిగుబడులు వచ్చిన తర్వాత పంట ఉత్పత్తులకు తగిన మద్దతు ధరతో, పూర్తిగా పంట ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసి రైతులకు వచ్చే రాబడిని అందజేయటం ముఖ్యమైనవి. రైతులకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రధానమంత్రి కిసాన్ నిధి ద్వారా పలు విడతలుగా రైతులకు అందజేయబడుతుంది. అదేవిధంగా 'కిసాన్ క్రెడిట్' కార్డుల ద్వారా రైతులందరకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతోను, వడ్డీ రాయితీలతోను రుణాలు ఇచ్చుటకు ఏర్పాటు జరిగాయి / జరుగుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు (పలు పంటల్లో), సేంద్రీయ ఎరువులు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు తదితర ఉపకారణాలన్నీ అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం పలు పథకాల ద్వారా చేపట్టడం జరిగింది. అదేవిధంగా రైతులందరికీ ప్రోత్సాహంగా, రాబోయే ఖరీఫ్ పంటల ఉత్పత్తులకు ముందుగానే కనీస మద్దతు ధరలను ప్రకటించి రైతులను ప్రోత్సహించటం జరుగుతుంది.

మారుతున్న పరిస్థితులను, యూరియా లాంటి ఎరువుల సరఫరా, మన అవసరాలకు అవసరమైన పంటల సాగును ఆయా వాతావరణం, నేలలను/ప్రాంతాలను దృష్టిలో ఉన్న భిన్న వాతావరణ పరిస్థితుల్లో అనువైన పంటల సాగును చేపట్టి తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి రాబోయే ఖరీఫ్ పంటకాలంలో సాగుకు తగిన జాగ్రత్తలతో రైతులు ముందుకు సాగాలి.

పలు ప్రాంతాల్లో ఉన్న నీటి సౌకర్యాలను, నేలలను వాతావరణ పరిస్థితులను, అందుబాటులో ఉన్న సాగుకు అవసరమైన ఉపకరణాలను దృష్టిలో ఉంచుకొని, మన ఆహార అవసరాలను ఆ తర్వాత ఎగుమతికి అవసరం మేరకు ఆయా పంటలను భిన్న వాతావరణ పరిస్థితుల్లో, ఆయా పంటలకు ప్రాంతాలకు తగిన వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి పంటల సాగును చేపట్టాలి.

**పంటల మార్పిడి**

ఆయా ప్రాంతాల్లో అనువైన పంటల సాగును మాత్రమే చేపట్టాలి. వరి, గోధుమ పంటల ప్రాధాన్యతే కాకుండా, మనకు సరిపడా అందుబాటు (ఉత్పత్తులు)లో లేనటువంటి, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు వాణిజ్య పంటలైన ప్రత్తి, చెరుకు ఇతరములను కూడా పరిగణించాలి. వరి సాగును నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయాలి. నీటి సౌకర్యాలు బాగా ఉండి వరి తప్ప, ఇతర పంటల సాగు ఇంత నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో సాగుకు వీలు లేకున్నపుడు మాత్రమే వరి సాగును చేపట్టాలి. అప్పుడే మనం తక్కువ పరిమాణంలో అందుబాటులో ఉన్న నీటిని ఇతరపంటలకు చిరుధాన్యాలు, అపరాలు (పప్పు ధాన్యాలు), నూనెగింజలు, సక్రమంగా వాడుకోవాలి.

చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల్లో ఉత్పత్తులు మన అవసరాలకన్న తక్కువగానే సాగుచేస్తున్నాం. ప్రధానంగా నూనెగింజలు, పప్పుధాన్యాలు కొంతమేర దిగుబడులు చేసుకుంటున్నందున విదేశీ మారకద్రవ్యం లక్ష కోట్లకు పైనే ఖర్చు పెడ్తున్నాము. మన ఆరోగ్య పరిరక్షణ, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయుటకు ఇతోధికంగా నూనె గింజలను, అపరాల సాగును గణనీయంగా పెంచవలసిన అవసరం ఉంది. అదేవిధంగా మన ఆరోగ్య పరిరక్షణకు, మంచి పోషక విలువలతో కూడిన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించి ఆ ఉత్పత్తులను మన ఆహారంలో భాగం చేస్తే, పోషక విలువలతో కూడిన తగినంత ఆహార లబ్ధితో మన ఆరోగ్యం చక్కగా, మెరుగ్గా ఉంటుంది. ఈ పంటల సాగుకు ముఖ్యంగా చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజల తక్కువ నీరు అవసరం. వర్షాధారపు పంటగానే పలు ప్రాంతాల్లో సాగవుతుంది. ఆ విధంగా అపరాలు, నూనెగింజలు చిరుధాన్యాలను రసాయనిక ఎరువులను వాడకుండానే, సహజ సేంద్రియ ఎరువులతోనే మంచి దిగుబడులను ఇవ్వగలము.

రసాయన రహిత ఉత్పత్తులు ముఖ్యంగా సేంద్రియపు ఎరువులను ఉపయోగించి పండించే పంట ఉత్పత్తులను ఆదరణ క్రమేపి పెరుగుతున్నప్పటికి, అవసరానికి చాలినంతగా ఉత్పత్తి జరగటం లేదు గనుక, రసాయన రహిత ఉత్పత్తులను ఇతోధికంగా సాగుచేయవలసిన అవసరం ఉంది.

ప్రభుత్వం కూడా సహజ ఉత్పత్తుల సాగుకు (రసాయన రహిత) ప్రోత్సాహమిస్తూ, 'ప్రకృతి వ్యవసాయాన్ని' ఇతోధికంగా ప్రోత్సహిస్తుంది. ఆ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ఆచరించుటకు తగిన సమయం ఇప్పుడు వచ్చింది. రసాయనిక ఎరువులైన (యూరియా లాంటివి) అందుబాటులో లేకపోయిన వాటి అవసరం చాలా పంటలవరకు ముఖ్యంగా చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు, ప్రత్తి, పసుపు, చెరకు, కూరగాయలు, పండ్లు (Spices & Cudiments) ఔషధ, సుగంధ ద్రవ్యాలు ఇచ్చే పంటలకు లేదు. వాటి అవసరాలు సేంద్రియ ఎరువులతోను, సహజ వ్యవసాయ



# సాగు..
# ...డితో మేలు

పద్ధతులతోనే సరిపోతాయి.

తక్కువ నీరు అందుబాటులో ఉండవచ్చని, యూరియా అందుబాటులో తక్కువగా ఉండవచ్చనే నేపథ్యంలో, ఇది మనకు అంది వచ్చిన అవకాశంగా భావించి తక్కువ నీటి వనరులతోను, (సహజ సేంద్రియ ఎరువులు) సహజ వ్యవసాయంతో మనం వైవిధ్య పరిస్థితుల్లో, ఆయా పరిస్థితుల్లో అనువైన పంటల సాగును ప్రోత్సహించి, ఇతోధికంగా సాగు చేసి, మంచి రసాయన రహిత ఉత్పత్తులను సాధించి, మన ఆరోగ్యసంరక్షణకు (ఆహారం ద్వారా) వీలు కల్పించాలి. ఈ విధంగా ఉత్పత్తులను ముఖ్యంగా నూనె గింజల్లో గనక సాధిస్తే, నూనెల దిగుబడి ఇతోధికంగా తగ్గి, తదనుగుణంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించవచ్చు. ఇంతవరకు మనం నూనెలను దిగుమతి చేసుకునే విదేశీ మారకద్రవ్యం విలువ లక్ష కోట్లకు పై మాటే. నూనె గింజల్లో ఉత్పత్తులను గణనీయంగా పెంచుటకు ప్రభుత్వం పలు పథకాల ద్వారా శ్రమిస్తూ ఉంది. ఇప్పుడు సదవకాశాన్ని అందిపుచ్చుకుని, వరి, గోధుమలే కాకుండా ఇతర పంటలు ముఖ్యంగా నూనెగింజలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు ఇతోధికంగా సాగుచేసి రైతాంగం లబ్ధి పొందాలి.

ఇలా పంట మార్పిడి వల్ల జరిగే ఇతర అనుకూలమైన అంశాలు నేల (భూమి) ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒకే పంట సాగువల్ల వచ్చే చీడపీడల ఉత్పత్తి బెడద తగ్గుతుంది, తద్వారా ఖర్చు తగ్గుతుంది. భూ ఆరోగ్య స్థితి మెరుగుపడటం, చీడపీడల ఉధృతి తగ్గటం, నేలలో భూసారాన్ని పంటలు సద్వినియోగం చేయుటవల్ల, పంటల (దిగుబడి) ఉత్పాదకత పెరుగుతుంది. కనుక రైతులందరు ఈ విషయాలను ఆకళింపుచేసుకుని, ఆయా పరిస్థితులకు అనువైన చిరుధాన్యాలు, నూనెగింజలు, అపరాలతో / ఇతర పంటలతో పంట మార్పిడి చేసి మంచి దిగుబడులను పొందగలరు / పొందాలి.

తక్కువ నీరు, తక్కువ ఎరువులు (అదీ సహజ ఎరువులు చాలు)తో హెచ్చు పోషక విలువలు గల మెట్ట పంటల సాగును ఇతోధికంగా ప్రోత్సహించాలి. మెట్ట ప్రాంతాల్లో తక్కువ వనరులతోనే పండే చిరుధాన్యాలను ఇతోధికంగా సాగు చేయాలి. వీటి ప్రాముఖ్యతను గుర్తించే మన ప్రధాని చిరుధాన్యాలను "శ్రీఅన్న" పేరుతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును తీసుకొనివచ్చారు. వీటి సాగుతో మన అవసరాలకు విదేశీ వ్యాపారాలకు అనుగుణంగా ఉత్పత్తులను పెంచే విధంగా సాగును ప్రోత్సహించాలి.

– వరి, గోధుమల్లో స్వయం సమృద్ధిని సాధించినప్పటికి, నూనెగింజలు, పప్పుధాన్యాల్లో మాత్రం స్వయం సమృద్ధిని ఇంకా సాధించలేక పోతున్నాము. ఇప్పటికీ మనం నూనెగింజలను, పప్పుధాన్యాలను దిగుమతి చేసుకుంటూ ఇతోధికంగా విదేశ మారకద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నాం. స్వయం సమృద్ధి దిశగా ప్రభుత్వం ఇతోథికంగా ఇంకనూ చేపట్టవలసి అవసరం ఉంది. నూనె గింజలకు, అపరాలకు, చిరుధాన్యాలకు తగిన మద్దతు ధరను నిర్ణయిస్తూ పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనే విధంగా (వరి, గోధుమలలో పటిష్టంగా అమలుచేసే విధంగా) చర్యలు ఇంకనూ పటిష్టం చేస్తే రైతులు తప్పక మొగ్గు చూపిస్తారు. ఇంకా అవసరమైతే (వరిలో సన్నబియ్యానికి ప్రోత్సహ మిచ్చినట్లు) వీటి సాగును ప్రోత్సహించడానికి క్వింటాలుకు వెయ్యి రూపాయలవరకు ప్రోత్సాహం కల్పిస్తే (కొంతకాలం) వీటి విస్తీర్ణం ఉత్పత్తులు ఇంకా పెరుగుతాయి.

అదేవిధంగా పలు ప్రభుత్వ పథకాల ద్వారా ఇతర పంటల సాగును ఈ ఖరీఫ్‌లో సాగు చేయుటకు చేయూతనివ్వాలి.

ఉద్యాన పంటల్లో కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలను, ఔషధమొక్కలను తగిన విధంగా ప్రోత్సహించి సాగు చేయించాలి.

ముఖ్యంగా కొబ్బరి, జీడిమామాడి, కోకా, శ్రీగంధం, పసుపు పంటలను ఇతోధికంగా సాగు చేయటం, వాటి ఉత్పత్తులను అమ్మటం ద్వారా రైతుల ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. వీటితోపాటు పోషక విలువలున్న గింజల సాగును ప్రోత్సహించి రైతుల ఆదాయాన్ని పెంచుటకు ప్రభుత్వం చిత్తశుద్ధితో తగిన బడ్జెట్ కేటాయింపులతో ముందుకు వెళ్తుంది.

ఈ పథకాలన్నింటితోపాటు రైతు సంక్షేమం కొరకు ప్రధానమంత్రి కిసాన్‌పథకం ద్వారా కేటాయింపులో మార్పులేదు. పశుగణాభివృద్ధి ఆసరా పథకం, పంటల భీమాపథకం, భూసార ఆరోగ్య కార్డుల జారీ, తుంపర్ల సాగునీటి పథకం మొదలగునవి కొనసాగుతాయి.

ఈ కార్యక్రమాల అమలులోను, పంటల సాగులోను అవసరమైన సాంకేతిక సహాయము / రైతులకు సంక్షేమ సహాయం అన్నియు రైతులకు వారి పొలాల్లో ఆచరించే విధంగా భారత్, విస్తార్ కార్యక్రమం ద్వారా వ్యవసాయ విషయాలపై, సాంకేతికతలపై రైతులందరకు వారి భాషల్లోనే విశదీకరించుటకు సమగ్ర సమాచార వ్యవస్థను పటిష్టపరచి, రైతుల వద్ద అందుబాటులోఉంచారు. రైతులు తక్కువ ఎరువుతోనే పంట మార్పిడి వైవిధ్యంతో, ఈ ఖరీఫ్‌లో కూడా పంటల సాగును చేపట్టి రసాయన రహిత పంటలఉత్పత్తులతో లబ్ధి పొందగలరని ఆశిస్తాము.



**ప్రొ. పి.రాఘవరెడ్డి**
**ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, మాజీ ఉపకులపతి**

# గణపతిదేవుడు

ఏకైక తెలుగు చక్రవర్తి

37

"బళ్లు ఓడలు అవుతాయోలేదో తెలియదు కాని ఓడలు బళ్లు అవుతాయి మహారాజా. అందుకు నా జీవితమే ఉదాహరణ. నేను ఈ స్థితికి రావడానికి కారణం కొందరు వణిజులు. ముఖ్యంగా అప్పరుసు శెట్టి."

"అంటే.. అవును అప్పుడెప్పుడో నలభై ఏళ్లనాడు డిండిమ..??" అన్నాడు గణపతిదేవుడు.

"అవును. ఆనాడు డిండిమ ఇతని కోష్ఠాగారాన్ని పగులగొట్టడం మీకు గుర్తుందన్నమాట. అది వాడికి కూడా గుర్తుంది. కాలం ఖర్మం కలసిరాని రోజున దేవుడు కూడా మనల్ని ఏమీ చేయలేడు మహారాజా! ఎప్పుడో ఖర్మ దొంగచూపు చూసిననాడు మనం కొంచం వంగితే చాలు.. అన్నిశక్తులు మనపై పిడిగుద్దులు కురిపించి అతఃపాతాళానికి తొక్కేస్తాయి. వాడు ఆ అప్పరసు అప్పటి నుంచి.. నలభై ఏళ్లుగా నన్ను వెంటాడుతూనే ఉన్నాడు. సమయం దొరికింది. వేటు వేశాడు.. సమస్త ఆస్తులు పోయెలా చేసి.. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చేశాడు. నావల్ల బాగు పడిన ఓ పెరికమిత్రుడు జాలిపడి ఇచ్చిన ఎడ్లబండిలో ఉప్పు అమ్ముకునే స్థాయికి తెచ్చాడు.."

గణపతిదేవునితోపాటు రుద్రమదేవి కూడా అతి జాగ్రత్తగా వింటోంది. ఇది కేవలం అంకాలశెట్టి అనే కాకతీయ వణిజుని సమస్యలా లేదు. మొత్తం రాజ్య వాణిజ్య వ్యవస్థ సమస్యలా కనిపిస్తోంది.. అనుకుందామే.

"ఇటీవల మన నౌకా వ్యాపారం దారుణంగా క్షీణించింది.. తెలుసుకదా.." అన్నాడు అంకాల మరేదో పెద్ద సంగతి చెప్పబోతున్నట్లుగా.

తండ్రీ కూతురు ముఖాముఖాలు చూసుకున్నారు. నౌకావాణిజ్య పన్నుల ఆదాయం బాగా తగ్గిందని యువరాజు మురారిదేవుడు కూడా అనేకసార్లు గోల పెడుతున్నాడు. ఇటీవల చాలామంది పరదేశీ వణిజులు కూడా వచ్చి ఏవేవో సమస్యలు చెబుతున్నారు. వాళ్ల ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. వాణిజ్య శ్రేణిసంస్థలు కూడా గతంలోలా బలిష్టంగా లేవు. ప్రాంతీయ భావాలు పెచ్చు మీరాయి.

"వణిజులు తమ వ్యక్తిగత కక్షల కోసం అవసరమైన అన్ని దుర్మార్గాలు, సన్మార్గాలు చేస్తున్నారు. అందులో పక్కవాని వాణిజ్యాన్ని నాశనం చేయడం చాలా నీచం. అందుకు నా బతుకే ఉదాహరణ."

వాణిజ్య వైరములు ఎంత దారుణంగా ఉంటాయో వివరిస్తున్నాడు అంకాల.

* * *

సాగర తీరం.. మోటుపల్లె రేవు..

నింగి నేలను ఏకంచేసిన మహాసముద్రం ఘూర్ణిల్లుతోంది. తరంగాలు బరువుగా నెమ్మదిగా పైకి లేచి ఆగి కిందికి జారుతున్నాయి కొన్ని. ఘళ్లున అరచి దబ్బున పడుతున్నాయి కొన్ని. సముద్రంలో దూరంగా ఒకటో రెండో మహానౌకలు.. వాటికి దగ్గరగా వందలాది చిన్నచిన్న పడవలు.. వాటిల్లో కదలాడుతూ నల్లచీమల్లా మనుష్యులు..

రేవు అంతా సందడి.. కిటకిటలాడుతోంది. జనాల అరుపులు.. కేకలు.. నవ్వులు.. తిట్లు.. మహామహా ధనవంతుల నుండి సాధారణ బానిసల వరకు.. సముద్రపు కార్యకలాపాలలో, వృత్తి వ్యాపారాలతో జీవనం గడుపుతున్నవారెందరో అక్కడున్నారు. అదొక భూగోళం..

ఎన్నో దేశాల మహావణిజులు, ఎన్నో రాజ్యాల అవదేశీలు, పరదేశీలు, స్థానిక నౌకా నిర్మాతలు.. వారి వారి ఉద్యోగులు, కూలీలు, సేవకులతో ఆ రేవు అంతా హడావిడిగా ఉంది. మోటుపల్లె రేవుకు రాత్రి పగలు లేవు. తెల్లవార్లూ సరుకులు ఎత్తడం, దించడం నిర్విరామంగా జరుగుతూనే ఉంటాయి.

ఆ రేవు దాదాపు నాలుగు యోజనాల పొడవునా తీరం వెంబడి ఉంటుంది లోపలికి పది యోజనాల లోని పాతిక గ్రామాల వరకు విస్తరించి ఉంటుంది. కాస్త అటూ ఇటుగా నౌకా నిర్మాణం, నౌకల మరమ్మతుల కేంద్రాలు ఉంటాయి. ఇక సరుకుల కోష్ఠాగారలైతే నదీ తీరం వెంబడి, కాలువల వెంబడి.. పాతికపైగా గ్రామాలలో ఒకటి రెండు పట్టణాలలో, పది పదిహేను కరగ్రహారాలలో విస్తరించి ఉన్నాయి. ఈ కోష్ఠాగారాలను ఎల్లప్పుడూ సరుకులతో నింపుతూనే ఉంటారు. నౌక వచ్చినప్పుడు వీటిల్లోని సరుకులు ఎత్తుతూ.. తెచ్చిన సరుకులు దించుతూ శ్రామికులు చమటలు కక్కుకుంటూ పని చేస్తూనే ఉంటారు.

ఈ రేవు తీరం వెంబడి దూరంగా రేవు కార్యకలాపాలకు ఆవలగా పోయి పోయి సుదూరంగా ఇసుకపర్రలతో దట్టమైన సర్వీ తోటలున్న నిర్జన ప్రదేశంలో కాస్త ఎత్తుగా ఉన్న బండపై కూర్చుని దూరంగా సముద్రం కేసి చూస్తున్నాడు గాలప్ప.

నలభై ఏళ్ల గాలప్ప బాగా నాచుపట్టిన సముద్రపు సొర చేపలా బలిష్టంగా పొడవుగా ఉంటాడు. రేవు దగ్గరలో. నున్న అనేక జాలరి గ్రామాలలో ఒకదానిలో పుట్టాడు. పెరిగాడు. అక్కడే.. సముద్రమే ఆలంబనగా జీవిస్తున్నాడు. కండలు తిరిగిన జబ్బలు, సముద్ర తీరంలా విశాలంగా విస్తరించిన చాతితో ఒడ్డుకు కొట్టుకొచ్చిన మహా తిమింగలంలా కనిపిస్తాడు.

గాలం లేకుండా కేవలం నీట్లోకి తొంగి చూస్తూ చటుక్కున చేయి గుచ్చి పెద్ద చేపను పట్టి తీయగల కొడుకు ప్రజ్ఞ చూసిన తండ్రి మురిపెంగా గాలప్ప అని పేరు పెట్టుకున్నాడు. సముద్రం తప్ప మరేమీ తెలియని గాలప్ప ఆ ఒడ్డునే తింటాడు. అక్కడే పడుకుంటాడు. అక్కడే పెళ్లి చేసుకున్నాడు. అక్కడే పిల్లల్నికన్నాడు. అక్కడే ఇల్లు లాంటిది కట్టుకున్నాడు.

సముద్ర రేవుల్లో రకరకాల వృత్తులు చేసి అనుభవం గడించిన గాలప్ప ప్రస్తుతం మహానౌకల్లో దోపిడీదారుగా.. సరుకులు దించిన పడవలను దోచుకునే సముద్రదొంగ వృత్తిని పవిత్రంగా నిర్వహిస్తున్నాడు.

అందులో భాగంగానే ఇప్పుడక్కడ కూర్చుని తదేకంగా దూరంగా రెప్ప వేయకుండా చూస్తున్నాడు.

రేవు హడావిడి వినిపించడం లేదు. ఉదయపు ఎండ చుర్రుమంటోంది. ఉండి ఉండి వీస్తున్న సముద్రపు గాలికి ఇసుక సర్రున లేచి గింగరాలు తిరిగి పడుతోంది. అప్పుడు కళ్లు మూసుకోకపోతే ఇసుక కళ్లనిండా చేరిపోతుంది. ఇక్కడున్న ఇసుక



మత్తి భానుమూర్తి

ప్రతి రేణువూ క్షుణ్ణంగా తెలిసిన గాలప్ప కన్నులు చెప్పకుండానే సహజంగా మూసుకుంటూ తెరచుకుంటూ దూరంగా చూస్తూనే ఉన్నాయి.

నాలుగు నెలల, పది రోజుల, పది గంటల నిరీక్షణ ఫలించింది.

ముందుగా నీటిపై సుదూరంలో చిన్న పిత్తపరికెలా కనిపించింది. లిప్తల కాలంలో అది కాస్త ఎగసిపడిన సొరచేప పిల్లలా అనిపించింది. ఆ తర్వాత కర్రలతో చేసిన త్రికోణంలా ఊగుతూ కనిపించింది.

అది నౌక.. పరదేశీ నౌక! కపోతం అంటారు అలాంటి పెద్ద నౌకలను. అది మహాకపోతం!!

మరి కొన్ని గంటలకు నీటి నుండి లేచిన మహామత్స్యంలా.. గండ భేరుండంలా.. కదలాడుతూ కనిపిస్తోంది.

రెక్కలు చాచిన గరుత్మంతుడిపై కూర్చున్న విష్ణువును చూస్తున్నట్లు తలెత్తి ఆ మహానౌకను అర్ధ నిమీలిత నేత్రుడై గాలప్ప రెప్పార్పకుండా చూడసాగాడు. పరదేశీ నౌకలంటే దేవుడంత మోజు గాలప్పకు. ఒక్క పరదేశీ నౌక చాలు పదేళ్లు సరిపడా సంపాదించుకోవడానికి..

సాధారణంగా పెద్ద విదేశీ నౌకలు రేవులకు చేరవు. సముద్రంలోనే చాలా దూరంలోనే ఆగిపోతాయి. అయితే వాటిని ఆపడానికి నౌక సరంగులు నానా యాతన పడాలి. ప్రాచీన కాలపు నౌకలు గాలివాటుకు ప్రయాణిస్తాయి. సింధు (భారత) దేశానికి సంబంధించిన తీరపు రేవులు తూర్పు పడమరలుగా చాలా ఉన్నాయి. అందులో దక్షిణావర్తంలోనే ఎక్కువ ఉన్నాయి. ప్రాచీన కాలంలో నౌకలు గాలివాటానికి వచ్చి వచ్చి ప్రతి తీరం దగ్గర రేవులు ఏర్పడ్డాయి.

ఏ మహారాజు దేవాలయాలు, కోటలు నిర్మించి నట్లు ఏ నౌకా రేవూ నిర్మించ లేదు. రేవు అద్భుతంగా నిర్మించినా ఇప్పటికీ ఏ నౌక కూడా కచ్చితంగా తీరం వద్ద ఆగడం జరగదు.

అదే సముద్రపు దొంగలకు వరంలా మారింది. అక్కడో కొన్ని క్రోసుల యోజనాల దూరంలోనే సముద్రంలో కదలాడే నౌకలను గాలప్పలాంటివాళ్లు గుర్తించగలరు. అక్కడి నుండి దానిని అనుసరించ గలరు. అది ఎక్కడ ఆగినా తన బృందంతో వెళ్లి దోచుకోగలరు. నౌకా ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా చంపేయగలరు.

ఒకప్పుడు నౌకల నుండి పడవల్లోకి సరుకులను మార్చే సమయంలో కిందపడిన వస్తువులను నౌక యజమానికి చెప్పకుండా వదిలేసి ఆనక సముద్రపు లోతుల్లో వాటిని వెదికి పట్టుకుని బయటకు తెచ్చి అమ్ముకునేవారు. అలా అలా నైపుణ్యం పెరిగినకొద్దీ నౌకను ఆసాంతం ముంచేసి సరుకులన్నీ ఎత్తుకు పోగల గుండెలు తీసిన బంటులుగా మారారు.

ఒకప్పుడు మోటుపల్లి రేవు దాపుల్లో ఒకటో రెండో ఇలాంటి బృందాలు ఉండేవి. ఇప్పుడు పాతిక బృందాలున్నాయని చెప్పుకుంటారు. అలాంటి బృందాల నాయకుల్లో గాలప్ప అరివీరభయంకరుడు. అంటే శత్రు బృందాలు కూడా గాలప్ప దృష్టి పడిన నౌక దగ్గరకు రావడానికి వెనుకంజ వేస్తాయి.

ఆ నౌకను చూసి గుర్తించిన గాలప్ప వెనుదిరిగి నోటితో ఈల వేశాడు. అది విన్న వాళ్లేవరో తిరిగి ఈల వేశారు.

అలా లిప్తల కాలంలో ఈలలు అనేకం వినపడు తున్నాయి. అప్పటికే తన మనుష్యులు కొందరు తన వైపు పరుగున రావడం చూసిన గాలప్ప ఒక్కసారిగా చిరుతపులిలా పరుగు లంకించుకున్నాడు. సముద్రపు ఇసుకలో నడకే కష్టం. కానీ గాలప్ప అతని బృందం నీటిలో సుదూరంగా కనిపిస్తున్న నౌకను చూస్తూ అనాయాసంగా తూనీగల్లా చిరుతపులుల్లా దూసుకు పోతున్నారు. గాలప్ప పోతున్నకొద్దీ.. అతని బృంద సభ్యులు అతని వెనకే పరుగు పరుగున వచ్చేస్తున్నారు. ఎవరో ఒకరు ఈల వేయడం.. మరికొందరు వచ్చి చేరడం.. అలా బృందం పెరిగిపోతూ అందరూ నౌక కదలికలను బట్టి పరుగులు పెడుతున్నారు.

మరి కాసేపటికి కింద నీటిలో కొన్ని పడవలు కూడా గాలప్పతో పాటు నీటిలో వేగంగా వస్తున్నాయి. తీరంపైన గాలప్ప బృందం పరుగులు.. నీటి అంచులో పడవల పరుగులు.. దూరంగా నౌక కదలికలు..

అంతా వేగంగా ఇసుక, గుట్టలు, గోతులు, చెట్లు, చేమలు, మహావృక్షాలు, దట్టంగా పెరిగిన పిచ్చిజెముడు మొక్కలు, కాకులు దూరని మడ అడవులు, అనేకానేక విషప్పురుగులు.. అన్నింటిని సునాయాసంగా ఒడుప్పుగా దాటుకుంటూ తప్పు కుంటూ నౌక వేగంతో సరిసమానంగా పరుగులు పెడుతున్నారు పడవలు, మనుష్యులు.

ఉన్నట్టుండి నౌక గమనం నెమ్మదించడం గుర్తించాడు గాలప్ప.

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

అప్పటికి చీకటి ఆవరించింది. చీకటి గాలప్ప బృందానికి మంచి సహాయ కురాలు. చీకట్లో ఏ దుర్మార్గం, దౌర్జన్యం, కిరాతకం కూడా నవ్వుతూ చేయవచ్చున్నది అతని అనుభవం నేర్పిన సిద్ధాంతం.

మరి కొద్ది సమయానికి దాదాపు వందమంది అనుచరులు గాలప్పకు కనిపించగా అందరిని చూసుకుని సంతోషించాడు. అంతా నీటిలోకి వెళ్లి పడవలు ఎక్కారు. పైన చంద్రుని మసక వెలుగే ఆ చీకటిలో వెయ్యి దివిటీల వెలుగులా భాసిస్తోంది.

పడవలు మౌనంగా కదిలాయి. వాటిలోని పరికరాల గురించి నడిపేవారిని అడిగి తెలుసుకుని.. చెప్పినవన్నీ సిద్ధం చేసినందుకు ఆమోదంగా తల ఊపాడు. అందరికి కేవలం నడుముకు వరకు



పలుచని పంచె.. కేవలం మర్మాంగాలు దాచుకోవ దానికే ఆ పంచే ముక్క. అదనపు బరువులు లేని మొప్పలున్న సొరచేపల్లా ఉన్నారంతా. అందరికి నడుముకు తోలు పటక ఉంది. అందులో చిన్నచిన్న ఇనుప వస్తువులున్నాయి. వాటిని సహాయ పరికరాలుగా వాడతారు. అవసరం అయితే ఆయుధాలుగా వాడతారు. గలప్ప పడవలన్నీ మెత్తగా కెరటాలపై తేలుతూ జారుతూ మహానౌకను చుట్టిముట్టి కాస్త ఆవలగా నిలిచాయి. అందరూ గాలప్ప సౌంజ్ఞల కోసం అతనినే చూస్తున్నారు. గాలప్ప ఉన్న పడవ మాత్రం కదిలి మొత్తం నౌక చుట్టూ తిరుగుతుండగా గాలప్ప అంత దూరం నుండే నౌకలో ఉన్నవారి కదలికలు గుర్తిస్తున్నాడు. లోపల అందరూ భోజనాలు చేసుండగా.. చేసినవారు నిద్రించడానికి ఉపక్రమించడం.. గాలప్ప కళ్లముందు తోలు బొమ్మలాట ఆడుతుంటే చూస్తు న్నట్లు ఊహించగలడు.

కాసేపు ఆగుదాం అన్నట్లు చేయెత్తి అందరికి ఆదేశ సౌంజ్ఞ చేశాడు.

అక్కడే మరో గంట కాలం.. అవకాశం కోసం ఎంతసేపైనా ఓపిగ్గా ఎదురు చూసే చిరుతపులుల్లా అలా నౌకను, గాలప్పను చూస్తూ ఉన్నారంతా. గంట అనంతరం గాలప్ప చేయి ఊపగా పడవలు కదిలి నౌకను దగ్గరగా చుట్టు ముట్టాయి.ప్రతి పడవలో ఒకడు నాయకుల్లా పడవలో ఉన్న పెద్ద పెద్ద మోకు తాళ్లను అందుకున్నాడు. తాళ్లతో పాటు ఉన్న ఉడుములను రెండు చేతులతో పట్టుకుని వాటి వీపు నిమిరి.. వాటి నోటికి పడవలో ఉన్న తోలుతిత్తులను వదులు చేసి.. అందున్న తేనెను ఉడుములకు తాగించి.. లిప్తకాలంలో ఆ మోకులను ఇతరులు చివర్లు పట్టుకోగా.. వొడుపుగా లాఘవంగా నౌక మీదికి విసిరి వేశారు. ఒక్కొక్కరుగా అందరూ అన్ని పడవలనుండి ఉడుములు, మోకులు పైకి ఎగరడం గాలప్ప చూశాడు. దాదాపు పాతిక పడవల నుండి మోకులు ఎగరగా ఒకటి రెండు విఫలమై క్రిందికి పడిపోయాయి. వాటిని మళ్లీ విసరగ ఈసారి విజయవంతంగా నౌక అంచులను పట్టుకున్నాయి.

అంతే.. అందరూ వాయువేగంతో ఆ మోకులు పట్టుకుని మోకు వెంట నల్లచీమ పాకినంత వేగంగా పాకుతూ నౌక అంచుకు చేరిపోయి అక్కడ ఆగి గాలప్ప వైపు చూడసాగారు. అతడు కూడా అక్కడికి చేరి ఆగి లోపల నుండి వినవస్తున్న శబ్దాలు ఏమైనా ఉన్నాయేమో మరోసారి విని ఏమీ వినరావడం లేదని నిర్ధారించుకున్నాక చివ్వున ఊగి పైకి ఎగిరి నౌకలోకి దూకాడు. శబ్దం రాకుండా ఉరకడంలో అందరూ నిష్ణాతులే. ఒకరొకరుగా అందరూ నౌకలోకి చేరిపోయారు. చిరుతలా అడుగులు వేస్తూ లోపల అంతా చుట్టి చూశారు. రెండు మూడు చోట్ల ఉన్న తలుపులు సరిగా మూసి లేవు. ఆ నడి సంద్రంలో ఎవరు వస్తారులే అనే ఉదాసీనత..

నౌక తలుపులు తోసి లోపలికి తొంగి చూసి సంతోషంతో పొంగిపోయాడు గాలప్ప.

పైన విశాల ఆకాశానికి, క్రింద అనంత సాగరానికి నమస్కరించాడు. ఊహాతీంగా అది మూడు అంతర్వుల మహానౌక. అంటే విలువైన మణిమాణిక్యాలు, రత్నరాసులు, బంగారు నాణేలు.. పైన అంతర్వులో మనుష్యులతో పాటు ఉంటాయి. రెండవ అంతర్వులో మత్తగజాలు, పారశీక గుర్రాలు ఉంటాయి. క్రింద మూడవ అంతర్వులో పడవ తెడ్డు వేసే కూలీలు.. మూడు అంచెల్లో పనిచేస్తూ దాదాపు వందమంది ఉంటారు. బృందం ముంగాళ్లపై పిల్లుల్లా కదులుతూ మొదటి అంతర్వులో అంతా పరిశీలిస్తున్నారు.

అంతా తాగి తిని మత్తుగా నిద్రపోవడం గాలప్ప బృందానికి ముచ్చట గొలి పింది.

నిజానికి నౌక యజమాని వేరు. నౌకలో ఉన్న సరుకు యజమాని వేరు. వీరిద్దరికీ నౌక వచ్చినట్లు తెలియదు.

ఉదయాన్నే నౌక సరంగు కొందరు సహాయకు లతో కలిసి అట్టడుగు అంతర్వులో ఉన్న పడవను బయటకు తీసి దానిపై ఒడ్డుకు వెళ్లి నౌక యజమా నికి, సరుకు హక్కుదారు అయిన అవదేసీ వణిజుని కలిసినప్పుడే వాళ్లకు నౌక వచ్చిందని తెలుస్తుంది.

గాలప్ప లిప్తల కాలంలో నౌక పరిస్థితిని ఆకళింపు చేసుకుని అందరికి సౌంజ్ఞ చేశాడు. అందరూ తమ నడుము కున్న తోలుపటకా నుండి పిడికిట్లో ఇమిడి పోయే చురక తీసి పట్టుకుని నిద్రిస్తున్నవారిపై కురికి ఓ చేత్తో నోరు మూస్తూ మరో చేత్తో మెడవద్ద చురకను అతివేగంగా దింపసాగారు. నిద్రలోనున్న వారు కళ్లు తెరచేసరికే వారి ప్రాణాలు గిలగిల కొట్టుకోవడం.. కళ్లు మళ్లీ పూర్తిగా మూసుకుపోవడం జరుగుతోంది.

దాదాపు అరవైమంది అవదేసీ ఉద్యోగులు, నౌక ఉద్యోగులు.. వేగంగా ప్రాణాలు కోల్పోసాగారు.

అప్పుడు జరిగింది గాలప్ప ఊహించని సంగతి..

ఓ బలిష్టమైన పారశీక కుక్క. భౌభౌమని అరుస్తూ ఇంతెత్తున ఎగిరి గాలప్ప మనుషుల్లో ఒకరి పైకి దూకింది. క్షణాల్లో వాడి పీకను కొరికేసింది. వాడు గిలగిల కొట్టుకుంటూ మంచాలపై నిద్రిస్తున్న వారిపై పడ్డాడు. వాళ్లు భయంతో పిచ్చి కేకలు వేశారు.

కుక్క యజమాని బహుశా నౌక సరంగు కావచ్చు. వేగంగా కదిలి మంచం పక్కనున్న చేతి గొడ్డలి తీసి ఒకడిపై వేటు వేశాడు. ఈ హఠాత్పరిణా మాలు గాలప్ప బృందానికి తెలుసు. గాలప్ప, మరి ఇద్దరు అంతే వేగంగా స్పందించి ఆ సరంగును వెనగ్గా నాలుగైదు కత్తిపోట్లు నిర్దాక్షిణ్యంగా పొడిచారు. సరంగు కిందికి జారిపోయాడు.

అయితే ముఖ్య నౌకా ఉద్యోగులు పైఅంతర్వులో ఉండగా కింది అంతర్వులో జంతువుల పక్కగా చిన్న గదిలాంటి దాంట్లో మరికొందరు ఉద్యోగులు నిద్రిస్తు న్నారు కాబోలు..వాళ్లంతా కుక్క అరుపుకు లేచారు. గొడ్డళ్లు, కత్తులతో పైకి వచ్చారు. ఒక్కసారిగా సంకుల సమరం. అతి దుర్మార్గులైన ఓడదొంగల్లా ఓడ ఉద్యోగులు పోరాడలేరు. ఒకరిద్దరు దొంగలకు గాయాలయ్యాయి కానీ ఓడ ఉద్యోగులంతా దారుణంగా హతమయ్యారు..

జరగబోయే పరిణామం ఊహించిన గాలప్ప కొందరిని రెండవ అంతర్వులో పని చూడమని చెప్పి కొందరితో వెళ్లి అట్టడుగు అంతర్వు తలుపులు బంధిం చేశాడు. అప్పటికే పైన జరుగుతున్న మారణకాండను ఊహించిన తెడ్డు బానిసలు కదిలారు. కానీ గాలప్ప తలుపులు బిడాయించేసరికి గొడ్డళ్లతో తలుపులను కొట్టసాగారు. అప్పటికి కొందరు గాలప్ప మనుష్యులు రెండవ అంతర్వు చెక్క గోడలను నిర్విరామంగా కొట్టికొట్టి పగుల కొట్టారు. ఏనుగులు, గుర్రాలు క్రిందికి జారి సముద్రంలోకి పడిపోయాయి. అవి ఈదుకుంటూ వెళతాయి కానీ మునిగి చనిపోవు. గాలప్ప బృందమంతా అప్పటికే పైఅంతర్వులో ఉండే గొడ్డళ్లు, తదితర ఆయుధాలను వెదికి పుచ్చుకున్నారు. పగిలిన


## డిజైనర్ కావలెను

జాగృతి వారపత్రికలో పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్ కావాలి. ఫొటో షాప్, పేజీ మేకర్‌లో పేజీలు డిజైన్ చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. తెలుగు టైపింగ్ వచ్చి ఉండాలి. డిగ్రీ/ఇంటర్మీడియట్ పాసైనవారు అర్హులు. ఎంపికైన అభ్యర్థి హైదరాబాద్‌లోని కాచిగూడలో గల మా కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుంది. జీతం: రూ.16,000/- నుంచి రూ.20,000/- (ప్రతిభను బట్టి). ఆసక్తి గల అభ్యర్థులు jagritiweekly@gmail.com కు పూర్తి బయోడేటాను పంపించండి. వివరాలకు: 9959991304

నౌక రెండవ అంతర్వు నుండి నిర్విరామంగా కింది అంతర్వును పగలగొట్ట సాగారు. వాళ్ల శక్తి ముందు తెడ్డు బానిసల శక్తి సరిపోలేదు.

నౌక అట్టడుగు అంతర్వు మొత్తంగా ఊడి నీటికి అడుక్కు వేగంగా వెళ్లిపోతోంది.

తెడ్డు బానిసలు హాహాకారాలు చేస్తుండగా.. గాలప్ప బృందం విజయ వికటాట్ట మహాసాలు చేయసాగారు.

ఆ మహానౌక గాలప్ప శక్తికి దాసోహమంది. వేల యోజనాలు ప్రయాణించి వచ్చిన ఆ మహానౌక పైభాగం మాత్రమే మిగిలి నీళ్లల్లో తేలియాడుతోంది.

చనిపోయినవారిని నిర్దాక్షిణ్యంగా నీటిలోకి తోసేస్తున్నారు దొంగలు.

గాలప్ప మరికొందరు అందున్న విలువైన వస్తువులను.. బంగారు నాణాలను.. వెదుకుతూ స్వాధీనపరుచుకుంటూ నౌకను సర్వం దోచుకుని.. ఆ నౌక చెక్క భాగాలనే పట్టుకుని బయటకు వచ్చి వికటాట్టహాసాలు చేస్తూ తమ పడవలను అధిరోహించారు. తేలియాడుతున్న శవాలను ప్రక్కకు తోస్తూ పడవల్ని ముందుకు నడిపిస్తున్నారు.

గాలప్ప మరికొందరు దోచుకున్న విలువైన వస్తువులతో ఐదు పడవల్లో దూరంగా పారిపోతున్నారు. మిగిలిన వారు ఏనుగులు, గుర్రాల కోసం అన్వేషించసాగారు. అవి నీటిలో మునిగిపోవు. ఈదుకుంటూ ఎటో వెళ్లిపోతాయి. వాటిని వెదికి పట్టుకోవడం మరో ముఖ్య కార్యక్రమం.

మరునాడు గాలప్ప వేషం మార్చి మంచి బట్టలు ధరించి కన్నడ వణిజుని రూపంలో వెళ్లి ఓ వణిజుని కోష్టాగారంలోకి ప్రవేశించాడు. అతన్ని చూసి ఆ వణిజుడు ముఖం ముందు సందేహంతో కళ్లు చికిలించి చూసి గాలప్ప ముఖంలో కదలాడే సంతోష చారికలు గుర్తించి ఆనందంతో వెలిగిపోయింది.

“ఓహో.. నీ వేషధారణ నీ ముఖంలో వెలుగు చెబుతున్నాయి. నువ్వు అనుకున్నది సాధించావని.. సేబ్బాష్..” లేచి వచ్చి గాలప్పను హత్తుకున్నాడు.

వినయంగా నమస్కరించిన గాలప్ప తన వెంట తెచ్చిన తోలు సంచులను ఆయన ముందు పెట్టాడు.

ఆ వణిజుడు నవ్వి, “చెప్పింది చెప్పినట్లు చేశావ్. చాలు. నా పగ చల్లారింది. అది చాలు నాకు. ఆ రత్నరాసులు, మణిమాణిక్యాలు నీవే. నువ్వూ నీ మనుషులు పంచుకోండి. పొండి..”

ఆ వణిజుడు అప్పరుసుశెట్టి.

ఇంతవరకు చెప్పిన అంకాలశెట్టి అప్పుడన్నాడు.

“ఆ నౌక.. దాంట్లో ఉన్న సరుకూ అంతా నాదే మహారాజా!. కేవలం కొన్ని చెక్కముక్కలు మాత్రమే నాకు మిగిలాయి. గాలప్ప అనే సముద్రపు దొంగతో నా నౌకను నాశనం చేయించాడు అప్పరుసు. గాలప్ప అనేవాడు కాకుండా మరో నలుగురుని చేరదీశాడు అప్పరుసు. కేవలం ఏడాది కాలంలో నా నౌకలు

గాలప్ప మరికొందరు దోచుకున్న విలువైన వస్తువులతో ఐదు పడవల్లో దూరంగా పారిపోతున్నారు. మిగిలిన వారు ఏనుగులు, గుర్రాల కోసం అన్వేషించ సాగారు. అవి నీటిలో మునిగిపోవు. ఈదుకుంటూ ఎటో వెళ్లిపోతాయి. వాటిని వెదికి పట్టుకోవడం మరో ముఖ్య కార్యక్రమం.
మరునాడు గాలప్ప వేషం మార్చి మంచి బట్టలు ధరించి కన్నడ వణిజుని రూపంలో వెళ్లి ఓ వణిజుని కోష్టాగారంలోకి ప్రవేశించాడు. అతన్ని చూసి ఆ వణిజుడు ముఖం ముందు సందేహంతో కళ్లు చికిలించి చూసి గాలప్ప ముఖంలో కదలాడే సంతోష చారికలు గుర్తించి ఆనందంతో వెలిగిపోయింది.
“ఓహో.. నీ వేషధారణ నీ ముఖంలో వెలుగు చెబుతున్నాయి. నువ్వు అనుకున్నది సాధించావని.. సేబ్బాష్..” లేచి వచ్చి గాలప్పను హత్తుకున్నాడు.

సరుకులతో వెళ్లి సరుకులు అమ్మి కోట్లాది రత్నరాసులతో వస్తున్నప్పుడు వాటిని సర్వనాశనం చేయించాడు. నాకు సరుకులు అందించిన సరఫరాదారులకు సొమ్ము చెల్లించలేకపోయాను. వాళ్లందరిని నాపై ఉసిగొల్పాడు. వాళ్లు నన్ను నానా దుర్భాషలాడి నా కోష్టాగారాలను కొల్లగొట్టారు. ఇళ్లు, వాకిళ్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. నాకు ఎవ్వరి దగ్గరా అప్పు పుట్టకుండా చేశాడు. సర్వం నాశనం. కట్టుగుడ్డలతో మిగిలాను. నేను నాశనమైనా పర్వాలేదు మిత్రమా. కాని చిన్ననాటినుండి బంగారు ఊయలలో పుట్టి పెరిగిన నా కొడుకు ఇవ్వాళ కేవలం ఉప్పుశెట్టిగా మిగిలాడు. వాడు ముఖం చూడాలంటేనే బాధగా ఉంది. వాడు నన్నొక్క మాట అనలేదు. అదే మరీ దుఃఖ భాజనం.. ఏట్లో దూకి చనిపోవాలనుంది గణా..”

తండ్రీకొడుకులు ఒకరినొకరు హత్తుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నారు.

సింహాసనం నుండి లేచి వారిద్దరిని దగ్గరకు తీసుకున్నాడు గణపతిదేవుడు.

* * *

“ఇది నేను ఎప్పటినుండో మీకు చెబుతూనే ఉన్నాను. మీరు కాపులకు వ్యవసాయంపై చాలా పన్నులు తొలగించారు. ఉన్నవి కూడా కరవు కాలం నుండి వసూలు కావడంలేదు. మీకు చెబితే పోన్లే పాపం పంట పండటం లేదు కాబోలు.. వచ్చే వర్షాల నుండి వసూలు చెయ్యి అంటారు. అలాంటప్పుడు మనకు రాజ్య నిర్వహణకు కావాల్సిన ఆదాయం అందించేవి పరదేశీ వర్తక సుంకాలు మాత్రమే. వాటిని కూడా రాకుండా చేస్తోన్న వణిజులు, సముద్రపు దొంగలు. అంతా కలిసికట్టుగా నౌకలను దోస్తూ మనకు పన్నులు కట్టడంలేదు. ఇక విదేశీ వణిజులు మన రేవులకు రావడానికే సుముఖంగా లేరు. కింద తమిళదేశానికి, లేదా పైన కళింగానికి పోతున్నారు. ఇలా అయితే మన ఆదాయం సున్నకు పడిపోతుంది తండ్రీ..”

ఇది మురారిదేవుడు తండ్రితో తెగించి చెప్పిన వైనం.

(సశేషం)



# చర్చలను బట్టే ఇరాన్

**పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం అనివార్యమని స్పష్టమవుతోంది. శాంతి చర్చలు ఫలించకపోతే ఇరాన్ మీద గతంలో కన్నా భీకర దాడులు చేసే అవకాశం ఉందని స్వయంగా డొనాల్డ్ ట్రంప్ చెప్పేశారు. ఇరు దేశాలు కూడా తమ షరతులపై గట్టి పట్టుదలతో ఉన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో త్వరలో చేపట్టే ఎపిక్ ఫ్యూరీ 2.0 ఆపరేషన్ మరింత భీకరంగా ఉండబోతోంది. అయితే అమెరికా దాడులకు దిగితే అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయికి యురేనియంను తీసుకెళతామని హెచ్చరించడం కలకలం రేపుతోంది. అయితే ఇరాన్ అణు సామర్థ్యం అంతగా లేదంటున్నారు నిపుణులు.**




పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి తుఫాన్ ముందు ప్రశాంతతలా ఉంది. తమతో అణు నియంత్రణ ఒప్పందానికి రాని ఇరాన్ విషయంలో అమెరికా మరింత తీవ్రంగా స్పందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయం చైనా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఇరాన్ ఒకవేళ శాంతి ఒప్పందానికి అంగీకరించకుండా, హర్మూజ్ జలసంధి విషయంలో తన దూకుడు వైఖరిని కొనసాగిస్తే, చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పుడు నడుస్తున్న శాంతికాలం తుపానుకు ముందు ప్రశాంతతగా గుర్తుంచుకోవాలని అన్నారు. ఇరాన్ పంపిన తాజా శాంతి ప్రతిపాదనలను తాను తిరస్కరించినట్లు చెప్పారు. తనకు ఆ ప్రతి పాదనలోని మొదటి పంక్తే నచ్చలేదని అందుకే దాన్ని పక్కన పెట్టేశానని తెలిపారు ట్రంప్. ప్రస్తుతం ఇరాన్–అమెరికా మధ్య కాల్పుల విరమణ నడుస్తోంది. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం ఆగినా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.



**షరతుల మీద షరతులు**

తాజాగా ఇరాన్ ముందు అమెరికా ఐదు అత్యంత కఠినమైన షరతులను పెట్టింది. అవి. 1.ఇరాన్ వద్ద ఉన్న 400 కిలోల శుద్ధి చేసిన యురేనియంను తక్షణమే అమెరికాకు అప్పగించాలి. 2. ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్క కేంద్రం మాత్రమే పనిచేసేలా పరిమితం చేయాలి. 3. గతంలో అమెరికా విధించిన ఆంక్షలు, విధానపరమైన నిర్ణయాల వల్ల ఇరాన్‌కు జరిగిన నష్టానికి ఎలాంటి ఆర్థిక పరిహారం చెల్లించేది లేదు. 4 విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25% నిధులను కూడా విడుదల చేసేది లేదు. 5. దాడుల ముగింపు అనేది పూర్తిగా ఈ చర్చల కొనసాగింపు, ముగింపు పైనే ఆధారపడి ఉంటుంది. ఈ షరతులన్నీ అంగీకరించినప్పటికీ అమెరికా, ఇజ్రాయెల్ దాడుల ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుందని అమెరికా పరోక్షంగా ఇరాన్‌ను హెచ్చరించినట్లు తెలుస్తోంది. కాగా ఇరాన్ కూడా శాంతి చర్చలు ముందుకు సాగాలంటే అమెరికా కూడా తమ ఐదు డిమాండ్లను అంగీకరించాలని స్పష్టం చేసింది.

దీనికి ప్రతిగా శాంతి చర్చల కోసం అమెరికాకు ఇరాన్ ఐదు ప్రధాన షరతులను విధించింది:యుద్ధ విరమణ: 1. లెబనాన్ సహా అన్ని ప్రాంతాలలో యుద్ధాన్ని పూర్తిగా ముగించాలి. 2. ఇరాన్‌పై విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలను, దిగ్బంధనాన్ని తొలగించాలి. 3. విదేశీ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు, నిధులను పూర్తిగా విడుదల చేయాలి. 4.యుద్ధం కారణంగా ఇరాన్‌కు జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలకు పరిహారం చెల్లించాలి. 5. హార్మూజ్ జలసంధిపై ఇరాన్‌కున్న సార్వభౌమాధికారాన్ని అమెరికా అధికారికంగా గుర్తించాలి.

**‘ఎపిక్ ఫ్యూరీ 2.0’ సిద్ధం**

ఈ క్రమంలో ఏప్రిల్ నెలలో నిలిపేసిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీని ఇప్పుడు ఎపిక్ ఫ్యూరీ 2.0 పేరుతో మళ్లీ చేపట్టాలని చూస్తోంది అమెరికా. ఈసారి కేవలం గగనతల దాడులకే పరిమితం కాకుండా, నేరుగా ఇరాన్ గడ్డ పైకి తమ ప్రత్యేక సైనిక బలగాలను మోహరించాలని అమెరికా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా జర్మనీలోని స్థావరాలనుంచి అమెరికాకు చెందిన పదుల కొద్దీ కార్గో విమానాలు మందుగుండు సామగ్రితో ఇజ్రాయెల్‌లోకి దిగినట్లు తెలుస్తోంది. దీంతో ఇరాన్‌పై మరోసారి దాడులు ప్రారంభించే ఉద్దేశంతోనే వాషింగ్టన్ చర్యలు కొనసాగుతున్నాయన్న అనుమానాలు పెరిగాయి. మరోవైపు ఇరాన్ పోర్టులు, సముద్ర వాణిజ్యంపై అమెరికా విస్తృత నౌకాదళ దిగ్బంధంతో ఒత్తిడి పెంచింది.

తాజాగా డొనాల్డ్ తన ట్రూత్ సోషల్ యాప్‌లో విచిత్రమైన ఫొటో షేర్ చేశారు. ఇరాన్, దాని పొరుగు దేశాలపై అమెరికా జాతీయ

# వ్యూహం?




జెండాను విస్తరించి ఉన్నట్లు చూపారు. అందులో ఇరాన్ మీద బాణం గుర్తులు పెట్టారు. అయితే దీనికి ఎలాంటి వ్యాఖ్య లేదు. ఈ పోస్ట్ చూస్తుంటే ఇరాన్ పై అమెరికా దాడులు పక్కా అని తెలిసిపోతోంది. అయితే అమెరికా దాడులు చేస్తే ఎదుర్కోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని ఏ దాడికైనా గట్టిగా ప్రతిస్పంది స్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఇదివరకే తేల్చిచెప్పారు. అమెరికా దౌత్య విశ్వసనీయతపై ఆయన విమర్శలు గుప్పిస్తూ. పశ్చిమాసియాలో శాంతికి డొనాల్డ్ ప్రధాన అడ్డంకిగా ఉందని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారాయన. ఇలాంటి పరిస్థితిలో మరోసారి యుద్ధమే మొదలైతే తీవ్ర వినాశనం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**అణు దాడికి మేమూ సిద్ధం**

అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడి చేస్తే మరింత తీవ్రంగా ఎదురు తిరగాలని, గట్టిగానే స్పందించాలని ఇరాన్ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా అణుదాడి తప్పదని హెచ్చరించింది. తమ దగ్గర ఉన్న యురేనియం నిల్వలను ఆయుధ తయారీకి అవసరమైన స్థాయిలో 90 శాతం స్వచ్ఛతతో శుద్ధి చేస్తామని ఇరాన్ పార్లమెంటరీ కమిషన్ ప్రతినిధి ఇబ్రహీం రెజాయ్ చెప్పారు. ఇలా శుద్ధి చేయటం ద్వారా అణుబాంబు తయారీకి సిద్ధమని సంకేతాలు ఇచ్చేశారాయన. 6 రోజుల్లో యురేనియాన్ని 90 శాతానికి శుద్ధి చేయవచ్చు. కానీ పూర్తి స్థాయి అణుబాంబు తయారు చేయడానికి 6 నుంచి 12 నెలలు పట్టవచ్చు అంటున్నారు. ఇరాన్ దగ్గర ఉన్న 440.9 కిలోగ్రాముల యురేనియం నిల్వను 60 శాతం శుద్ధి చేశారని అంతర్జాతీయ అణుసంస్థ భావిస్తోంది. దీనిని 90 శాతానికి పెంచడం అంటే అది అణ్వాయుధ తయారీకి కేవలం అడుగు దూరంలో ఉన్నట్లే. ఈ హెచ్చరిక ఇప్పుడు ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేస్తోంది. యురేనియం సాంద్రత పెరిగేకొద్దీ, దానిని శుద్ధి మరింత సులభం అవుతుంది.

2006లో యురేనియం శుద్ధి ప్రక్రియను ప్రారంభించిన ఇరాన్.. తమ లక్ష్యం శాంతియుత మైనదని నొక్కి చెప్పింది. అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (IAEA) నివేదికల ప్రకారం.. సంవత్సరాలు గడిచేకొద్దీ ఈ నిల్వలు పెరుగుతూనే ఉన్నాయి. 2010లో టెహ్రాన్ ఒక పరిశోధన రియాక్టర్‌కు ఇంధనాన్ని తయారు చేసే నెపంతో, 20 శాతం వరకు యురేనియం శుద్ధి చేయడం ప్రారంభిస్తామని ప్రకటించింది. ట్రంప్ మొదటి పదవీ కాలంలో అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలగిన తర్వాత గత ఎనిమిదేళ్లలో ఇరాన్ 22 వేల పౌండ్లు లేదా 11 టన్నుల యురేనియంను శుద్ధి చేసినట్టు న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఇరాన్ ఈ యురేనియాన్ని ఇస్ఫహాన్ టన్నెల్ కాంప్లెక్స్‌లో దాచి ఉంచొచ్చు అనే అనుమానాలున్నాయి.ఇరాన్ అణుబాంబు తయారుచేస్తే, దాన్ని తమపై వెయ్యగలదు అని ఇజ్రాయెల్ భయపడుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా మీద ఇరాన్ అణుబాంబుతో దాడి చేసే అవకాశం లేదు. ఇరాన్ వద్ద పూర్తిస్థాయి అణ్వాయుధం, అమెరికాను నేరుగా తాకగల ఖండాంతర క్షిపణులు కూడా వాటి వద్ద అందుబాటులో లేవు. ఇరాన్ నుంచి అమెరికా దాదాపు 10,000 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంత దూరం పయనించి తాకే అవకాశం లేదంటున్నారు. కాగా ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండటానికి వీల్లేదు. అమెరికా దీనిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. వారి ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కానివ్వబోం అంటూ డొనాల్డ్ ట్రంప్ హుంకరిస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధానికి, శుద్ధి చేసిన యురేనియం ముఖ్య కారణమని ట్రంప్ పదేపదే చెబుతోన్న సంగతి తెలిసిందే. వారిని అణ్వాయుధాలు అభివృద్ధి చేసుకోనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. కాగా ఇరాన్ ప్రతిపాదనలో తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంలో కొంత భాగాన్ని నిర్వీర్యం చేసి, మిగిలిన దానిని మూడో దేశానికి బదిలీ చేసే అవకాశం ఉందని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.



**క్రాంతిదేవ్ మిత్ర**
**సీనియర్ జర్నలిస్ట్**



**మన ఇతిహాసాలైన రామాయణ, మహాభారతాల్లోని పాత్రలు ఎదుర్కొన్న సవాళ్లు, వారు పాటించిన ధర్మం నేటి ఆధునిక కాలంలో ఎదుర్కొనే మానసిక ఒత్తిడికి అద్భుతమైన పరిష్కారాలను చూపిస్తాయి. మనం చేసే పని కంటే, దాని వల్ల వచ్చే ఫలితం ఎలా ఉంటుందోనని ఊహించుకుని ఎక్కువ భయపడతాం (కురుక్షేత్ర యుద్ధం – అర్జునుడు). రేపటి గురించి చింతించకుండా, నేటి బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తే సగం ఒత్తిడి మాయమవుతుంది.**

# ఆత్మవిశ్వాసానికి ఇతి



శ్రీరాముడు తన పట్టాభిషేక వార్త విన్నప్పుడు ఎంత ప్రశాంతంగా ఉన్నాడో, అడవికి వెళ్లాలన్నప్పుడు కూడా అంతే ప్రశాంతంగా ఉన్నాడు. జీవితంలో అనూహ్యమైన మార్పులు వచ్చినప్పుడు కుంగి పోకూడదు. పరిస్థితిని అంగీకరించి, ప్రశాంతంగా నిర్ణయం తీసుకోవడమే 'స్థితప్రజ్ఞత'. పని భారం పెరిగినప్పుడు మనం చేయలేమేమో అని భయపడతాం. మనలోని అంతర్గత శక్తిని తెలుసుకుని ఏ పనైనా పూర్తి చేయాలనే సంకల్పం ఉంటే విజయం తథ్యం. హనుమంతుని విషయంలోనూ ఇది కనిపిస్తుంది.

రాజ్యాన్ని, సర్వస్వాన్ని కోల్పోయి 13 ఏళ్ల పాటు అడవుల్లో ఉండటం పాండవులకు ఎంతో ఒత్తిడి కలిగించే విషయం. కానీ వారు ఆ కాలాన్ని వృథా చేయలేదు. అర్జునుడు దివ్యాస్త్రాలను సంపాదించాడు. మిగతా నలుగురూ వారి వారి నైపుణ్యాలను మెరుగు పర్చుకున్నారు. కష్టకాలం వచ్చినప్పుడు ఆవేశపడ కుండా సహనం వహించాలి. కష్టాలు శాశ్వతం కావు. క్లిష్ట పరిస్థితుల్లో మనల్ని మనం మరింత మెరుగు పరుచుకోవడానికి ప్రయత్నించాలి. పురాణాల్లోని పాత్రలు మనలాగే రక్త మాంసం ఉన్న మనుషులుగా కాకుండా, భావోద్వేగాలను జయించిన మహోన్నత వ్యక్తులుగా కనిపిస్తాయి. వారు ఎదుర్కొన్న ఒత్తిడి సామాన్యమైనది కాదు, కానీ వారు దానిని అధిగమించిన తీరు అద్భుతం.

ఇతిహాసాల్లోని మహర్షులు, మహారాజులు ఒత్తిడిని ఎలా జయించారో తెలుసుకోవడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్యపాలనలో రాజులకు బాధ్యతల ఒత్తిడి ఉంటే, తపస్సు చేసే రుషులకు ఇంద్రియాలను జయించాలనే అంతర్మథనం ఉంటుంది. సంసారంలో ఉంటూనే నిర్లిప్తత. మిథిలా నగర చక్రవర్తి జనక మహారాజు 'రాజర్షి'గా పేరుపొందాడు. అంటే రాజుగా ఉంటూనే రుషి జ్ఞానం కలిగి ఉండటం. ఒకసారి జనకుడు తన గురువు అష్టావక్రుడితో మాట్లాడుతున్నప్పుడు, భవనం తగలబడుతోందని వార్త వస్తుంది. మిగతా వారంతా కంగారు పడితే, జనకుడు మాత్రం నిశ్చలంగా ఉంటాడు. 'నేను కేవలం ఒక నిమిత్త మాత్రుడినే'నే భావన ఆయనకు ఉండేది. అధికారం, ఆస్తులు, హోదా..ఇవన్నీ శాశ్వతం కాదని గ్రహిస్తే, వాటిని కోల్పోతామనే భయం ఉండదు. పనులు చేస్తున్నా, మానసికంగా వాటికి అంటుకోకుండా ఉండటమే (Detachment) ఆయన విజయ రహస్యం.

విశ్వామిత్రుడు సృష్టించిన అనేక అడ్డంకులు, తన కుమారుల మరణం వంటి ఘోరమైన విపత్తులు ఎదురైనా వశిష్ఠుడు తన ప్రశాంతతను,అపారమైన సహనం కోల్పోలేదు. కోపం, అసూయ ఒత్తిడిని పెంచుతాయి. విశ్వామిత్రుడు అహంకారంతో పోరాడితే, వశిష్ఠుడు శాంతంతో గెలిచాడు. ఎదుటి వారు మనపై ఒత్తిడి తెచ్చినా, విమర్శించినా మనలోని క్షమాగుణం మనల్ని ప్రశాంతంగా ఉంచుతుంది.

శ్రీరాముడు అడవికి వెళ్లినప్పుడు, భరతుడు అయోధ్య రాజ్యబాధ్యతను భారంగా కాక ఆరాధనగా పాలించాడు. ఆయన రాజుగా కాక, రాముడి పాదుకలను సింహాసనంపై ఉంచి ఒక సేవకుడిగా పాలన చేశాడు. 'నేను యజమానిని' అనుకున్నప్పుడు పని భారం (Burden) అనిపిస్తుంది. కానీ 'నేను సేవ చేస్తున్నాను' అని భావించినప్పుడు అదే పని ఒక ఆరాధన అవుతుంది. మన ఉద్యోగాన్ని లేదా పనిని 'భారం'గా కాకుండా, సమాజానికి లేదా భగవంతునికి చేసే 'సేవ'గా భావిస్తే ఒత్తిడి దరిచేరదు. రాజులకు యుద్ధాలు, రాజ్యరక్షణ వంటి తీవ్ర ఒత్తిళ్లు ఉండేవి. కానీ వారు 'ధర్మం' వైపు నిలబడటం వల్ల వారి మనసు ఎప్పుడూ దృఢంగా ఉండేది. మనం కూడా మన పనిలో ధర్మబద్ధంగా ఉంటే, అనవసరమైన ఆందోళనలు మనల్ని ఏమీ చేయలేవు.

భర్త మరణం, ఐదుగురు కొడుకులతో అడవుల పాలు కావడం, ఇలా ఎన్నో. నిరంతర అభద్రతా భావం, జీవితాంతం కష్టాలను అనుభవించిన కుంతి సానుకూల దృక్పథం (Optimism) అందరికీ ఆదర్శం. కష్టాన్ని ఒక పరీక్షగా, ఎదుగుదలకు ఒక మెట్టుగా భావిస్తే ఒత్తిడి అనేది ఉండదు.

**నీలకంధరుడు**

సముద్ర మథనంలో పుట్టిన భయంకరమైన విషాన్ని శివుడు స్వీకరించి, దానిని మింగకుండా లేదా బయటకు విసిరెయ్యకుండా కంఠంలోనే నిలిపివేసి 'నీలకంఠుడు' అయ్యాడు. మన జీవితంలో ఎదురయ్యే విమర్శలు, అవమానాలు., ప్రతికూలతలు 'విషం' వంటివి. వాటిని లోపలికి తీసుకుంటే ఆరోగ్యం పాడవుతుంది. బయటకు.. అంటే ఇతరుల మీద కోపం చూపిస్తే సంబంధాలు దెబ్బ తింటాయి. శివుడిలా వాటిని నియంత్రించి (గొంతులోనే నిలిపి), ప్రశాంతంగా ఉండటం నేర్చుకోవాలి. తపస్సులో ఉన్న శివుడిని ఇబ్బంది పెట్టాలని చూసిన మన్మథుడిని, శివుడు తన మూడవ కంటిని తెరిచి భస్మం చేశాడు. మనసును పక్కదారి పట్టించే కోరికలు, వ్యామోహాలు, పరధ్యానాలపై విజయం సాధించడమే నిజమైన నిగ్రహం. మనలోని అనవసరమైన ఆలోచనలను జ్ఞానమనే మూడవ కంటితో భస్మం చేయాలి. శివుడు శరీరంలో సగభాగాన్ని

# హాసాలే ఆధారం

పార్వతీదేవికి ఇచ్చి అర్ధనారీశ్వరుడిగా దర్శనమిస్తాడు. ఇది పురుష ప్రకృతి శక్తుల సమతుల్యతను సూచిస్తుంది. ఒత్తిడిని అధిగమించాలంటే కఠినత్వం, మృదుత్వం మధ్య సమతుల్యత ఉండాలి. అతిగా ఆలోచించడం లేదా అతిగా స్పందించడం కాకుండా, మధ్యేమార్గంలో ఉండటమే నిగ్రహం.

**శివుని రూపంలో దాగి ఉన్న నిగ్రహ సూత్రాలు**

నెత్తిన గంగ ప్రవాహంలాంటి ఆలోచనలు ఉన్నా, తల (మనసు) ఎప్పుడూ చల్లగా ఉండాలి. భౌతికంగా కళ చూసేదాని కంటే, వివేకంతో (మూడవ కన్ను)లోతుగా ఆలోచించడం., కలిగించే పరిస్థితులు చుట్టూ ఉన్నా, వాటిని







అలంకారం(మెడలో పాము)గా మార్చుకుని నిర్భయంగా ఉండటం, జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే శ్మశాన (వాసం) వైరాగ్య భావం శివుడు మనకు నేర్పే అతిపెద్ద పాఠ్యాంశాలు. చుట్టూ ఎంత కో(హో)లాహలం ఉన్నా, మదిలో హిమాలయ మంత నిశ్శబ్దం ఉండాలి. అదే నిజమైన నిగ్రహం.

**భీష్ముడు**

మనసు గందరగోళంగా ఉన్నప్పుడు, ఆందోళన మనల్ని చుట్టుముట్టినప్పుడు.. మనల్ని మళ్లీ నిలబెట్టి, సరైన మార్గంలో నడిపించే 'నిశ్చలమైన సంకల్పమే' ధృతి.లేదా అంపశయ్యపై ఉన్నా, తన ప్రతిజ్ఞకు కట్టుబడి మరణాన్ని కూడా తన నియంత్రణలో ఉంచుకున్న నిశ్చలమైన సంకల్పం భీష్ముని 'ధృతి'.

**ప్రహ్లాదుడు**

చిన్న వయసులోనే తండ్రి హిరణ్యకశిపుడు పెట్టిన అనేక కష్టాలను (పాములతో కరిపించడం, కొండపై నుండి తోయడం, విషం ఇవ్వడం) ప్రహ్లాదుడు అనుభవించాడు. తన దృష్టిని తనపై జరుగుతున్న హింస మీద కాకుండా, తాను నమ్మిన నారాయణుడి మీద నిలిపాడు. మనసు ఒకే లక్ష్యం మీద (ఏకాగ్రత) కేంద్రీకృతమైతే బయటి భయాలు ఒత్తిడిని కలిగించలేవని ప్రహ్లాదుడి కథ నిరూపిస్తుంది.

**సావిత్రి**

కాలంతో పోరాటం తన భర్త ప్రాణాలు ఏడాదిలో పోతాయని తెలిసినా సావిత్రి కుంగిపోలేదు. యముడితో వాదించి తన భర్త ప్రాణాలను దక్కించుకుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు సాధారణంగా మనుషులు తెలివితేటలు కోల్పోతారు. కానీ సావిత్రి అత్యంత ప్రశాంతంగా, యుక్తితో యముడిని మెప్పించింది. చిక్కుముడులను ప్రశాంతంగా ఆలోచిస్తేనే విప్పగలమని సావిత్రి చెబుతుంది.

**నల మహారాజు**

శని ప్రభావంతో రాజ్యాన్ని, సంపదను, చివరకు వస్త్రాన్ని కూడా కోల్పోయి అడవులపాలైన నలుడు, భార్యకు దూరమై, వికృతరూపాన్ని పొందాల్సి వచ్చింది. 'పాకశాస్త్రం' (వంట) 'అశ్వహృదయం' (కర్కోటకుడు అనే సర్పం ఇచ్చిన విద్యలలో గుర్రాలను నడపడం ఒకటి.) అనే నైపుణ్యాలను నమ్ముకుని జీవించాడు. కాలం కలిసి రానప్పుడు నైపుణ్యాలే (Skills) మనల్ని ఒత్తిడి నుండి కాపాడి మళ్లీ నిలబెడతా యని నలుని జీవిత సందేశంగా భావించాలి. పురాణ పాత్రలన్నీ ఒత్తిడిని అధిగమించ డానికి ప్రధానంగా 'మౌనం', 'ప్రార్థన', 'స్థితప్రజ్ఞత' (సుఖదుఃఖాలను సమానంగా చూడటం) అనే సాధనాలను వాడాయి. ఆధునిక కాలంలో ఎదుర్కొనే ఒత్తిడి లేదా వ్యక్తిగత సమస్యలకు ఈ పురాణ పాత్రల మనోధైర్యం ఒక గొప్ప మార్గదర్శి.

సాధారణంగా రాక్షసులు అంటే కేవలం కోపం, ఆవేశం అనుకుంటాం. కానీ పురాణాల్లోని కొందరు రాక్షసులు, దేవతలు అత్యంత క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని ఎదుర్కొని తమ లక్ష్యాలను సాధించారు. రాక్షసులు తమకు ఎదురయ్యే అవమానాలను, అడ్డంకులను ఘోర తపస్సు ద్వారా అధిగమించేవారు. ఇది నేటి కాలంలో 'తీవ్రమైన ఏకాగ్రత' (Deep Focus)కు ప్రతీక.

**బలి చక్రవర్తి**

వామనావతారంలో సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు దానం అడిగినప్పుడు, తన గురువు శుక్రాచార్యుడు వారించినా బలి చలించలేదు. మాట తప్పడం వల్ల వచ్చే ఒత్తిడి కంటే, ధర్మానికి కట్టుబడి ఉండటమే మిన్న అని భావించాడు. తన రాజ్యాన్ని కోల్పోతున్నా సరే, చిరునవ్వుతో తన తలనే దానంగా ఇచ్చాడు. పరిస్థితులు మనకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు,మన విలువలకు కట్టుబడి ఉంటే మనశ్శాంతి లభిస్తుంది.

**విభీషణుడు**

రావణుడి సభలో అందరూ రాముడిని ఎదిరించాలని ఒత్తిడి తెస్తున్నా, విభీషణుడు ఒక్కడే ధర్మం వైపు నిలబడ్డాడు. సొంత అన్నను, ఇంటిని వదిలి పెట్టడం అనేది సామాన్యమైన మానసిక ఒత్తిడి కాదు. సమూహం తప్పు దారిలో వెళ్తున్నప్పుడు, ఒంటరిగానైనా సరే సరైన మార్గంలో వెళ్లే ధైర్యం ఒత్తిడిని తగ్గిస్తుంది.

**దేవతలు**

దేవతలు తరచూ రాక్షసుల చేతిలో ఓడిపోయి, రాజ్యాలను కోల్పోయి తీవ్ర ఒత్తిడికి లోనయ్యే వారు.వారు దానిని అధిగమించిన తీరు విభిన్నంగా ఉంటుంది. దేవేంద్రుడు అనేకసార్లు తన సింహాసనాన్ని కోల్పోయాడు. కానీ ఆయన ఎప్పుడూ నిరాశతో ఆగిపోలేదు. బృహస్పతి వంటి గురువుల సలహాతో, ఇతర దేవతల సహకారంతో మళ్లీ రాజ్యాన్ని సాధించేవాడు. ఓటమి ఎదురైనప్పుడు ఒత్తిడికి లోనవ్వకుండా, నిపుణుల సలహాలు తీసుకోవడం., జట్టుగా పని చేయడం(Teamwork) ముఖ్యం. రాక్షసుల వద్ద ఉన్న పట్టుదల, దేవతల వద్ద ఉన్న విజ్ఞత ఈ రెండింటినీ సమపాళ్లలో ఉపయోగిస్తే ఎలాంటి ఒత్తిడినైనా చిత్తు చేయవచ్చు.

**ఇతిహాసాలు ఇచ్చే సందేశం**

ఒత్తిడి అనేది బయట ఉండే పరిస్థితుల వల్ల రాదు, ఆ పరిస్థితులను మనం ఎలా స్వీకరిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది. చేతుల్లో లేని దాని గురించి ఆందోళన చెందడం మానేయాలి. బాధ్యతను నీతిగా నిర్వహించాలి. రోజులో కొంత సమయం ధ్యానం లేదా మౌనం పాటించాలి.

మన ఇతిహాసాల్లోని ఇప్పటికీ మనం గుర్తుంచు కున్న పాత్రలు ఏవీ కష్టాలను చూసి భయపడలేదు, వాటిని ఎదుర్కొని చరిత్ర సృష్టించాయి. ఆ స్ఫూర్తే మన ఒత్తిడిని చిత్తు చేసే ఆయుధం!



**తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**
**8008577834**

# సాంకేతికత నుంచి

**సంస్కృతి అనేది ఒక సమాజపు జీవన విధానం అయితే, ఆ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించే జీవనవాహిని మహిళ. నాలుగు గోడల ఆంక్షలను దాటి, కార్పొరేట్ రంగాల నుంచి అంతరిక్షం వరకు జైత్రయాత్ర సాగించిన ఆధునిక మహిళ… నేడు యాంత్రిక జీవన ఒత్తిడిని జయించడానికి మళ్లీ అమ్మమ్మల కాలం నాటి ఆరోగ్య సూత్రాలను, మన ప్రాచీన సంస్కృతీ విలువలను ఆయుధంగా మార్చుకుంటోంది. ఆధునికతను అనుభవిస్తూనే, సంప్రదాయాన్ని ఆత్మగౌరవంగా భావిస్తూ సమతుల్య ప్రయాణాన్ని సాగిస్తోంది.**

నేటి ప్రపంచంలో ఆధునికత, సంప్రదాయం ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలని నిరూపిస్తున్నారు మహిళలు. సాంకేతిక విప్లవంతో ఆర్థిక స్వాతంత్ర్యం సాధించి, యాంత్రిక జీవన లోపాలను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నారు. మళ్లీ ఆయుర్వేదం, సిరిధాన్యాలు, ప్రాచీన కళలు, నైతిక విలువలవైపు మొగ్గుచూపుతున్నారు.

ఒకప్పుడు మహిళల జీవితం నాలుగు గోడలకే పరిమితమై ఉండేది. సంప్రదాయాల సంకెళ్ల నుంచి బయటపడి, ఆధునిక విద్యను అభ్యసించి, ఐటీ, అంతరిక్షం, వ్యాపారం వంటి సాంకేతిక రంగాలలో మహిళలు నేడు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. అయితే, సాంకేతికత అందించిన ఆర్థిక స్వాతంత్ర్యం, ఆధునికతను అనుభవించిన తర్వాత, నేటి తరం మహిళలు మళ్లీ మన ప్రాచీన సంప్రదాయాలు, మూలాలవైపు సాగుతున్నారు. ఒకప్పుడు ఆధునికత అంటే పాశ్చాత్య సంస్కృతిని అనుకరించడం, సాంప్రదాయాలను పక్కన పెట్టడం అనే భావన ఉండేది. కానీ నేటి మహిళలు ఆ నిర్వచనాన్ని పూర్తిగా మార్చేస్తున్నారు. వారు ఆధునికతను, సాంప్రదాయాన్ని ఎదురెదురు ధ్రువాలుగా కాకుండా, ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలుగా చూస్తున్నారు.

మహిళలను సంస్కృతి సంరక్షకులుగా అనేక సందర్భాలలో పరిగణిస్తారు. భాష, ఆచారాలు, పండుగలు, వంటకాలు, నైతిక విలువలను కుటుంబం ద్వారా పిల్లలకు అందించడంలో మహిళలే ప్రధాన భూమిక పోషిస్తారు. సంస్కృతి ఉనికిలో ఉండటానికి మహిళల భాగస్వామ్యం అత్యంత ప్రధానమైనది. కొన్నిసార్లు సంస్కృతి, సంప్రదాయం పేరుతో మహిళలపై కొన్ని ఆంక్షలు విధిస్తుంటారు. ఒక నిర్దిష్ట శైలిలో మాత్రమే దుస్తులు ధరించాలని, కుటుంబ లేదా సామాజిక విషయాల్లో మహిళల అభిప్రాయాలకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, కొన్ని సంప్రదాయ కుటుంబాలలో మహిళలు ఇంటికే పరిమితం కావాలని ఆశించడం వంటివి ఆధునిక సమాజంలోనూ మనకు కనిపిస్తుంటాయి.

సాంకేతిక విప్లవం వల్ల మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఇంటి నుంచి పని చెయ్యగలిగే సదుపాయాలు వచ్చాయి. కానీ, దీనితో పాటే విపరీతమైన పని ఒత్తిడి, యాంత్రిక జీవనం, కుటుంబానికి సమయం కేటాయించలేకపోవడం, మానసిక ప్రశాంతత కరవవ్వడం వంటి సవాళ్లు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే మహిళలు తమ ఆరోగ్యకరమైన జీవనం, మనశ్శాంతి కోసం సంప్రదాయ మార్గాల వైపు చూడటం ప్రారంభించారు.

క్రమంగా తమ జీవన శైలిలో మార్పులు చేసుకొనేందుకు మార్గాలను వెతుకుతున్నారు. అమ్మమ్మలు, నానమ్మలు పాటించిన విధానాలను తిరిగి అలవాటు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాచీన సంప్రదాయాలు, సంస్కృతిలో ఉండే ఆరోగ్య పద్ధతులను అలవరచుకొంటున్నారు. ఇందులో భాగంగా యోగా, ఆయుర్వేదంవైపు అడుగులు వేస్తున్నారు. కార్పొరేట్ జీవితంలో ఎదురయ్యే హార్మోనల్ సమస్యలను,ఒత్తిడిని జయించడానికి జిమ్‌లు,అలోపతి చికిత్సల కంటే మన సంప్రదాయ యోగా, ధ్యానం, ఆయుర్వేద చికిత్సల వైపు మొగ్గు చూపుతున్నారు. గర్భధారణ సమయంలో కూడా ప్రాచీన గర్భ సంస్కార్ పద్ధతులను పాటిస్తున్నారు.

పరుగుల జీవితంలో చిక్కుకున్న పడతులు క్రమంగా ప్రాచీన పద్ధతులను అనుసరించేందుకు పయనం ప్రారంభిస్తున్నారు. ఆధునిక పద్ధతుల్లో విద్యుత్ పరికరాల్లో తయారయిన ఆహారాన్ని, వసతులను పక్కన పెట్టి, సాంప్రదాయ భోజనం, ఆరోగ్య పరిరక్షణ వైపు ఆలోచన చేస్తున్నారు. సాంకేతిక వసతులకు స్వస్తి చెప్పి మళ్లీ మట్టి పాత్రలలో వండటం, రోటి పచ్చళ్లు, గానుగ నూనెలు, సిరిధాన్యాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. కుటుంబ ఆరోగ్యమే దేశ ప్రగతికి సోపానంగా భావించి..సాంప్రదాయ జీవనశైలిని అలవరచుకొంటున్నారు.

ఆధునిక సాంకేతిక యుగంలోనూ మహిళలు ప్రాచీన సంప్రదాయాలకు సాధ్యమయినంత చేరువయ్యేందుకు ఇష్ట పడుతున్నారు. గతంలో మన సంప్రదాయాలు, కళలు, భాషలు మౌఖికంగా లేదా తాళపత్ర గ్రంథాల ద్వారా మాత్రమే నిక్షిప్తమై ఉండేవి. కానీ నేడు అంతరించిపోతున్న పురాతన గ్రంథాలను, కళారూపాలను డిజిటల్ రూపంలో భద్రపరుస్తున్నారు. దీంతో సోషల్ మీడియా, యూట్యూబ్ ద్వారా




ఆధునిక సాంకేతిక యుగంలోనూ మహిళలు ప్రాచీన సంప్రదాయాలకు సాధ్యమయినంత చేరువయ్యేందుకు ఇష్ట పడుతున్నారు. గతంలో మన సంప్రదాయాలు, కళలు, భాషలు మౌఖికంగా లేదా తాళపత్ర గ్రంథాల ద్వారా మాత్రమే నిక్షిప్తమై ఉండేవి. కానీ నేడు అంతరించిపోతున్న పురాతన గ్రంథాలను, కళారూపాలను డిజిటల్ రూపంలో భద్రపరుస్తున్నారు.

కూచిపూడి, భరతనాట్యం వంటి సాంప్రదాయ నృత్యాలు జానపద గీతాలు నేడు ప్రపంచవ్యాప్తంగా లక్షల కోట్ల మందికి చేరువవుతున్నాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలను లేదా చారిత్రక కట్టడాలను ఇంటి నుండే చూసే వీలు కలుగుతోంది. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకుంటున్నారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రాచీన పద్ధతుల్లో ధ్యాన సాధన వంటివి అలవర్చుకుంటున్నారు.

నేటి ప్రపంచంలో మహిళలు సంస్కృతిని గౌరవిస్తూనే, తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంటున్నారు. ఉన్నత చదువుల ద్వారా

# సంప్రదాయానికి...

సంస్కృతిని మరింత హేతుబద్ధంగా అర్థం చేసుకుంటు న్నారు. వృత్తిపరంగా రాణిస్తూ, సమాజంలో తమ గొంతును బలంగా వినిపిస్తున్నారు. మూఢాచారాలను తిరస్కరించి, సంస్కృతిని సంస్కరించడంలో ముందు న్నారు. కార్పొరేట్ రంగంలో, రాజకీయాల్లో, శాస్త్ర సాంకేతిక రంగాలలో





పురుషులతో సమానంగా రాణిస్తు న్నారు. అయితే, ఎంత ఎదిగినా తన మూలాలను, సంస్కృతిని మర్చిపోవడం లేదు.

ఆఫీసులో ల్యాప్‌టాప్ ముందు కూర్చునే ఐటీ ఉద్యోగిని, పండగ వస్తే ఇంటి ముందు ముగ్గు పెట్టి, సాంప్రదాయబద్ధంగా పూజలు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. విద్య, విజ్ఞానంతో అవకాశాలు అందిపుచ్చుకుంటూనే విదేశాల్లోనూ మన సంప్రదాయాలకు ప్రాధాన్యతను పెంచుతున్నారు. మన పండుగలు వేడుకల్లో సాధ్యమైనంత వరకు దేశ సంప్రదాయాలను ప్రతిబింబింప చేస్తున్నారు. చేనేత, పట్టు వస్త్రాలను ధరించడం, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించడం, మన వంటకాలు, రుచులతో ఆకట్టుకోవడం పరిపాటిగా మార్చుకున్నారు. దేశం కాని దేశంలో ఉన్నా, సంక్రాంతి, దీపావళి వంటి వేడుకల్లో కుటుంబ సభ్యులతో అనుభూతిని వీడియో కాల్స్ ద్వారా పంచుకుంటున్నారు. ఆన్లైన్ ద్వారా అన్నీ అందుబాటులోకి వస్తుండటంతో, ప్రతి సంప్రదాయ పండుగనూ శాస్త్రోక్తంగా జరుపుకొని భారత సంస్కృతిని ఇనుమడింప చేస్తున్నారు. సంప్రదాయ జ్ఞానాన్ని నేర్చుకోవడం సులభతరం కావడంతో కంప్యూటర్ లోనే శ్లోకాలు, యోగా వంటి వాటిని గురువుల నుండి నేర్చుకోగలుగుతున్నారు.

చదువుకున్న మహిళలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకే పరిమితం కాకుండా, సాంప్రదాయ జీవనశైలిని అలవర్చుకొంటున్నారు. కళలపై ఆసక్తి చూపుతున్నారు. కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం వంటి కళా రంగాలలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కళాత్మక రంగవల్లులు నేర్చుకోవడానికి, తమ పిల్లలకు నేర్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. స్వయం ఉపాధి కోసం సోషల్ మీడియా సాంకేతికతను వాడుకుంటూనే మన చేనేత వస్త్రాలను, సంప్రదాయ దుస్తులను ప్రోత్సహిస్తున్నారు.

ఆధునిక తెలుగు మహిళల వస్త్రధారణలో సాంప్రదాయానికి పెద్ద పీట వేస్తున్నారు. జీన్స్, టాప్స్ వేసుకునే అమ్మాయిలు కూడా పండగలు, పెళ్లిళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కాంచీపురం పట్టుచీరలు, లంగా-ఓణీలు ధరించడానికి మక్కువ చూపుతున్నారు. ప్రపంచవ్యాప్త పోకడలను మార్చేందుకు సైతం పూనుకుం టున్నారు. మన కళలు సంస్కృతి పరిరక్షణకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ ఒత్తిడి ఎంత ఉన్నప్పటికీ, తమ పిల్లలకు తెలుగు భాషను, పండగల విశిష్టతను, నైతిక విలువలను నేర్పించడంలో మహిళలే ముందుంటున్నారు. విదేశాల్లో స్థిరపడిన ఆధునిక తెలుగు మహిళలు సైతం అక్కడ తెలుగు సంఘాలు ఏర్పాటు చేసి, బతుకమ్మ, సంక్రాంతి వంటి పండగలను ఘనంగా నిర్వహిస్తూ మన సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేస్తున్నారు.

పిల్లల పెంపకంలోను ఆధునిక మహిళల ఆలోచన విధానంలో ప్రత్యేక మార్పు కనిపిస్తోంది. చిన్న కుటుంబాలు, మొబైల్ ఫోన్ల సంస్కృతి వల్ల పిల్లలు ఒంటరి వారవుతున్నారని గమనించిన తల్లులు, మళ్లీ ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను గుర్తిస్తున్నారు. పిల్లలకు పంచతంత్ర కథలు, రామాయణ, మహా భారతాలలోని నైతిక విలువలను నేర్పుతూ, సాంకేతికతకు దూరంగా, సంస్కృతికి దగ్గరగా పెంచే ప్రయత్నం చేస్తున్నారు. సంప్రదాయాలు, సంస్కృతికి సంబంధించిన విలువలను బోధిస్తున్నారు.

మహిళ కుటుంబానికి కేంద్రబిందువు. ఆమె మారితే కుటుంబం మారుతుంది, కుటుంబం మారితే సమాజం మారుతుంది. సాంకేతికత అందించిన ప్రగతిని అందుకుంటూనే, సంప్రదాయం అందించిన సంస్కృతీ విలువలను కాపాడుకుంటూ నేటి మహిళ సాగిస్తున్న ప్రయాణం సమతుల్య సమాజ స్థాపనకు మైలురాయి.

సాంకేతికత నుంచి సంప్రదాయానికి మహిళలు సాగిస్తున్న ఈ పయనాన్ని కొందరు వెనకడుగుగా భావించవచ్చు. కానీ, ఇది వెనకడుగు కాదు. ఆధునికతలోని లోపాలను సరిదిద్దుకుంటూ సంప్రదాయంలోని గొప్పదనాన్ని స్వీకరించే వివేకవంతమైన ముందడుగుగా భావించాలి. ఆధునిక విజ్ఞానం ఇచ్చిన ఆలోచనా శక్తితో, సంప్రదాయంలోని మూఢనమ్మకాలను పక్కనబెట్టి, కేవలం అందమైన, ఆరోగ్యకరమైన విలువలను మాత్రమే మహిళలు స్వీకరిస్తున్నారు. కాలానికి అనుగుణంగా సంస్కృతిలో మార్పులు రావడం సహజం. అయితే మహిళల స్వేచ్ఛను, ఎదుగుదలను గౌరవించే మన సంస్కృతి భవిష్యత్‌లోనూ బలంగా నిలుస్తుంది అనడం అతిశయోక్తి కాదు.



**జయశ్రీ ఆచంట**
సీనియర్ జర్నలిస్ట్







**శ్రీ వెన్నెల కంటి రాఘవయ్య గారు తమ "యానాదీస్" అను గ్రంథమున తెలుగువారైన యానాదులను గూర్చి వారి వాఙ్మయ సారస్వతములను గూర్చి ఇలా రాశారు. (పేజీ 418-420) పతంగి భైరయ్య యను యానాది పాడిన చెంచు నాటక మందలి చెంచిత నరసింహస్వామి సంవాదమును పొందు పరిచియున్నారు. మెల్లగా సాగు ఎత్తైన వరి గడ్డి బండిపై పండుకొని గొంతులిచ్చెడి యువకుడు, చెరువు నీట నీదు బఱ్ఱెపై సవారు చేయు గోపబాలుడు, గుడ్డ యూయల కట్టి బిడ్డ నూపు తల్లి, కపిలపై నదిప్టించి వాలు వెంబడి దిగు తోట మాలి, ఏకాకిగా నేతము దొక్కు రైతు, అల్ల గల పాటలు తొలిసారికే పరిణతములుగా రాజాలవు. ఎన్ని మారులో తిరిగి తిరిగి రూపుదిద్దుకున్న పాట మాత్రమే సహజముగా జానపదులలో ప్రవేశింపగలదు.**

ఆదిమ మానవుడు ప్రకృతిలోని లయాన్విత మైన శబ్దానికి అనుకరణగా తన గొంతు విప్పి రాగమాలపించినప్పుడు ఆ రాగంలో ఇమిడే పదాలను పొదగ నేర్చినప్పుడు ఆనందం పొందినా, ఆవేదన చెందినా ఆ ఆదేశాన్ని తనకు తెలిసిన భాషలో భావయుక్తంగా పాడ నేర్చినప్పుడు జానపద కవిత ఆవిర్భవించింది.

ప్రతీ జాతి కవితా సంపదకు జానపద కవిత మూలకందం. జానపద కవితకు మౌలిక స్వరూపం. అందుకే "జానపద గీతిక జాతి జీవనాళిక" అన్నారు పెద్దలు. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు పండితులచే ననాదరింపబడినందున నా వాఙ్మయ మును అనాదృత వాఙ్మయం అన్నట్లే శిష్ట వాఙ్మయ భిన్నమని కూడా చెప్పవచ్చును.

అపారమైన కవితా సంపద కలిగిన తెలుగు జాతికి అతి ప్రాచీనమూ అజ్ఞాత కర్తృకమూ ఐన జానపద కవితా ఖనులు అనేకం ఉన్నాయి. విద్వాంసులైన కొందరు ఈ గనులను తొలిచి బంగారు కణికల వంటి జానపద గేయాలను సాహితీ లోకానికి అందించారు. పండిత, పామర జనరంజక మైన జానపదుల పాటలను ఏర్చి అక్షరాకృతిలో కూర్చి పెట్టారు.

మన బాలికలు పువ్వు లేరుట - దండలు గుచ్చుట - దైవభక్తి గల్గి యుండుట - ఈ గేయము ద్వారా ద్యోతకమౌతుంది.

*"ప్రొద్దున్నే ప్రొద్దున్నే లేద్దామా:*
*అందుగల పువ్వులు కోద్దామా*
*కోసినవి రాసులుగా పోద్దామా*
*సాలింటి కాడ సన్నదారము తెద్దామా*
*దాసరింటి కాడ సన్నసూది కొందామా*
*అన్నిటిని దండలుగ గుచ్చుదామా*
*దేవుడూ గుళ్లోకి పోదామా*
*కిరకిర తలుపులు తీద్దామా*
*దేవుడు మెడలో వేద్దామా"*

కవిత్వము నంతటిని రెండు పెద్ద విభాగములుగా విడదీయవచ్చును. మొదటిది చేతనాకృతము. రెండవది తద్భిన్నము. మొదటిది భావకుడైన కళాకారుని ప్రయత్నమున తీర్చి దిద్దబడినది. రెండవది పామరుడైన జానపదుని సృష్టి అప్రయత్నముగా ఒక నోటి నుండి వెడలి తనకు తానే రూపుదిద్దుకొనునట్టిది. జానపదులు పాడుకొను గేయములే జానపదగేయములు. జానపదులనగా పల్లెటూరి వారు. ఈ పల్లెటూరి మోటు మనుషుల పాటలందేమి కలదని పెదవి విరిచినచో మన బాల్యము మనము మరచినట్లు ఈ గేయముల మాధుర్య మనుభవైక వేద్యము. చెట్టు మీదనే మాగబండిన సీతాఫలము రుచిని, గ్రీష్మాతపమున కెండిబీటలు వారిన పుడమి తల్లి తొలకరి నాడు జలధరించునప్పటి సువాసనను, కొండ కోనలందు పుట్టి ఎత్తులెక్కి పల్లములు పారి పల్లెటూళ్ల పక్కపక్కగా గలగల పరుగులెత్తెడు సెలయేటి నాదమును, నడి యేడారిలో వలవల మని విరిసెడి పండు వెన్నెల సలువను - ఇన్నిటి నొకచో జేర్చిన జానపద గేయమగును. ఒక్కొక్క జానపద గేయ మొక్కొక్క రసగుళిక వలెనుండును. ఈ రసాస్వాద మునకు సహృదయముతో పాటు సానుభూతియును మిక్కిలి అవసరము. దశావతారాలు క్రమంగా వర్ణించబడ్డ విధము చూడుము.

*మరు జనమక మమ్మేలు మత్స్యావతార*
*గురుతుగా కృపజూడు కూర్మావతార*
*వరదుడవు కావయ్య వరహావతార*
*సిరులు కరుణించు నరసింహావతార*
*వక్షమున సిరిగల్గు వామనావతార*
*రక్షించు మము పరశు రామావతార*
*రాక్షసాంతక రఘురామావతార*
*పక్షి వాహన బలభద్రావతార*
*బ్రోవ నేర్చిన యట్టి బుద్ధావతారా*
*కావవేమము వేద్క కలికావతారా*
*భాషావతి స్తోత్ర భాను ప్రకాశా*
*శేషాచలాధీశ శ్రీవేంకటేశా.*

ఏ తల్లీ తన కుమారుని కంట నీరుండుట సహింపనేరదు. ఏడవకు ఏడవకు వెర్రి అబ్బాయి - ఏడిస్తే నీ కండ్లు నీలాలు గారు అని హృదయ తాపమును వెలార్చును తన పాపకు అంగరక్ష. ఆది రక్ష దివ్య రక్ష దీపరక్ష చిన్ని నా అబ్బాయికి శ్రీరామ రక్ష" అని వేడుకొనును. ఇతర బాలురకన్న తన కుమారుడే గొప్పవాడని, మంచివాడని తల్లి అభిప్రాయము.

బాలికల ఆటలందు "చెమ్మ చెక్క" ప్రసిద్ధి గన్నది. అలాగే "ఒప్పుల కుప్పా ఒయ్యారి భామా" "కాళ్ల గజ్జ కంకాలమ్మ" "చేతిలో వెన్న ముద్ద", "తారంగం, తారంగం", "చందమామ రావే" తప్పట్లోయ్, తాళాలోయ్" చెప్పుకుంటూపోతే ఎన్నో బాలల గేయాలున్నాయి.

జానపద గేయ లక్షణములు 1. అజ్ఞాత కర్తృత్వము 2. స్థిరరూప రాహిత్యము 3. రచనా కాలము తెలియకపోవుట 4. మౌఖిక ప్రచారము 5. ఆకృతక శైలి 6.గేయత్వము 7. ఆశు రచన 8. పునరావృత్తి (పల్లవి వంటిది) 9. జనసామాన్య పరిచిత వస్తువు. ప్రతీ జానపద గేయానికీ ఈ లక్షణాలన్నీ ఉండాల్సిన అవసరం లేదు. కానీ సార్వజనీనతలున్న చాలును.

శిష్ట సాహిత్యానికి, జానపద సాహిత్యానికి లక్షణములు వేరైనను ప్రయోజనము మాత్రం ఒక్కటే.



# గీతిక-జాతి జీవనాళిక

శిష్టుల రచనలు చదువరులైన కొద్ది మందికి మాత్ర ముద్దిష్ట ప్రయోజనము సాధించిన జానపద సాహిత్యము నూటికి తొంబది యైదు మంది కుపకరించినది. జానపద గేయముల వైశిష్ట్య మేమన వీటికి మన నిత్య జీవితము నలముకొను శక్తి అధికము.

తిండి పోతుల గురించి ఓ పాట బాగా ప్రాచుర్యంలో ఉంది. తంజావూరు సత్రము బాపతు. కోస్తాలో సుమారుగా ఇలాంటి పాటే ఉంది. "నీళ్ల తోడర శివ – ఒల్లు వంగదు అవ్వ" అనునది . కన్నడంలోనూ ఉంది "నీరు తారో మల్ల బావిగెబిద్దే నల్ల... ఊటకే బారో మల్లి– తయారిద్దే నల్లి" అనే పాట ఉన్నది. ***నీళ్లకు బోర తిమ్మ / నిద్దరొస్తా దమ్మ / కట్టెలు తేరా తిమ్మ / కడుపు నస్తాదమ్మ / నట్టుకు (గడ్డి పీకడానికి) బోరతిమ్మా / నడుము నస్తాదమ్మ / విన్నె (గిన్నె) తీసుకోరాతిరమ్మ /ఇంతే చాలు మాయమ్మ / చేనికి బోరతిమ్మ /చినుకులొస్తాయమ్మ / ఇంట్లో పండుకోరతిమ్మ / ఇంతే చాలు మాయమ్మ.***

స్త్రీకి అయిదవతనం అతి ముఖ్యం అంటారు, అంటే భర్త బ్రతికుండడమన్న మాట దానికి గుర్తే పసుపు. కుంకుమలు, దాని గొప్పదనమును తెలిపేపాట.

***నీలమ్మ నీ మగడు నిన్నేలదమ్మ / ఏలకుంటే మానె ఎదురుంటె చాలు / సాకకుంటె మానెసల్లగుంటె చాలు / కంసాలి వారి మట్టెలు కాలి నుంటె చాలు/ సెట్టి గారి గాజులు సేత నున్న చాలు/ పరమేశు డిచ్చిన పసుపు కుంకుమలు నొష్ట కుంకుమలంటె యిష్టాలు దీరు / పసుపు ఒంటి నుంటె భయమేమి నాకు.***

పాశ్చాత్య దేశములందీ విషయమున కృషి చేసిన పండితులు చైల్డ్, హెండర సన్, సీగర్, లామ్సన్, గమ్మేర్, మిల్లర్, గ్రిమ్, భారతదేశమున ఈవిషయమై పరిశ్రమ మొనర్చిన టెంపుల్, గోవర్, ఎల్విన్‌కూఫ్రే, బోయల్, హెమెండార్ఫ్, మున్నగు పాశ్చాత్యులు, దేవేంద్ర సత్యార్థి వంటి భారతీయులు ఫోక్‌లోర్, పాక్‌సాంగ్ శబ్దములనే వాడిరి. ఫోక్ శబ్దమునకు జానపద శబ్దము బాషాంతరీ కరణముగా గ్రహించిరి, ఒక పాశ్చాత్య పండితుడభిప్రాయ పడినట్లు మనము కూడా అత్యంత ప్రాచీనమగు జనపద సంఘముల నూహించుకొననక్కర లేదు. ఏలన ఒకనాడు తెలుగు నాటి జనపదము లండిట్టివారే నివసించుచుండిరి.

శ్రీకృష్ణ దేవరాయల కాలమునకు సంబంధించి నది, ప్రజలు పాడుకొందురు. దానిలోని రెండు చరణములు మాత్రమే శిష్టులకు పరిచయం ఈ రెండు చరణములను ప్రతాప రెడ్డి గారు ప్రకటించి ఉన్నారు.

"కొండవీడు మనదేరా కొండపల్లి మనదేరా
కాదని వాదుకు (ఎవడైనా) వస్తే కటకం దాకమనదేరా!

పూర్వము రాజులు యుద్ధయాత్రకు బయలు దేరినపుడు "ఉపశ్రుతి" శకునమును చూసుకొనెడి వారు. శ్రీకృష్ణ దేవరాయల వారు కటకముపై దండెత్తి పోవుటకు పూర్వము తిమ్మరుసు మంత్రి ఉపశ్రుతి సంచారము నొక చాకివాని యింటి పైనించి పొంచి చూచుచుండెనట, ఆ ఇంట ఆ రజకుడు తన కొడుకును వారించుటకు నీ వీరగీత మాలపించెనట, అది శుభశకునముగా గొని మంత్రి శ్రీ కృష్ణదేవరాయలకు ఎరిగించెనట. అంతట జైత్ర యాత్రకు బయలుదేరిరని కథ చెప్పుకొందురు. ఇది రాయలసీమలో పుట్టిన గేయము.

18వ శతాబ్ది ప్రారంభమున అటు ఓరుగల్లు నుండి ఇటు గోల్కొండ వరకున్న భాగము నట్టుడికించినట్టి ఒక పాళెగాని చారిత్రక గాథ "సర్వాయి పాపని కథ" దీనిని ఆంధ్ర జానపద గేయములను సేకరించవలెనని ఉద్దేశము గలిగిన జె.ఎ. బోయలే సేకరించిన ప్రథమ గేయమిది.

***వస్తాదె తాను సర్వయె పాపడు / తల్లి కొలువుకు వడిగా వెళ్లేను / తల్లికి దండముగా నిలిచేను / యేరకట్టి వ్యవసాయము అమ్మ / ఎంగిలి ముంత ఎత్తలేను / కొట్టుదును గోల్కొండ పట్టణము / ఢిల్లీకి మోజూరు నేదును / మూడు గడియల బందరు కొట్టుదును / మూల కోట కందనూరు సూచి / బంగారు కడియాలు పెట్టుదును / మనకంతా బంట్రోతు తన మేలు మన కులకాయి మానవద్దురా సర్వాయి పాప....*** .... ఇలా నడుస్తుంది.

భాగవత సంబంధ గాథలందు, శ్రీకృష్ణుని పేరుతో పెరిగిన శృంగార సాహిత్యమున తదాశ్రితమైన సున్నితమగు హాస్యము కలదు. రుక్మిణీ దేవి సీమంతమను పాటలో శ్రీకృష్ణుడు సత్యభామతో తానక్రూరు నింటికి భోజనమునకు పోవుచున్నానని బొంకి రుక్మిణి ఇంటికిపోయెను. ఇది తెలిసిన సత్యభామ కృష్ణుని ఎగతాళి చేయును.

"ఈశ్వర భృంగి సంవాదము" పాటల యందు శివుని తలపై నున్న పడతిని జూచి పార్వతి నడుగనాతడు".

**"నిండు వేసవి కాలమున జలముండునో లేకుండునో యని / దండిగా నది దెచ్చి జడలో దాచియుంచినాను గాని ఎరుగనే పార్వతి యెరుగనే"** అని బొంకును.

మృదువైన, సభ్యమైన హాస్యమే స్త్రీల పాటలందుండును. ఇట్టి హాస్యము జానపదుల నిత్య జీవితమును సుఖమయ మొనర్చుటకు దోహద మొసంగును. జీవితమందలి స్తబ్దతను పోద్రోలి ఉల్లాసమును చేకూర్చి హాస్యము మానవుని జీవితమును సరసమొనరుననుటలో సందియము లేదు.

బిరుదురాజు రామరాజు : (1) త్రివేణి పేజి.3,31 సంపాదకీయం, (2) తెలుగుజానపద గేయ సాహిత్యం / బిరుదురాజు రామరాజు



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు



# విద్యారంగంలో విప్లవా

దేశంలో విద్యారంగాన్ని, విద్యాబోధనను సమూలంగా సంస్కరించడానికి కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ సంవత్సరానికి కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించిన విద్యా విధానం అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలకు సరితూగే కొత్త విద్యా వ్యవస్థను ఆవిష్కరించే దిశగా సాగబోతోంది. వాస్తవానికి, 2020లో ప్రకటించిన జాతీయ విద్యావిధానం మరింత పటిష్ఠంగా, మరింత పకడ్బందీగా అమలుపరిచే ఉద్దేశంతో ఈ విద్యావిధానాన్ని కొద్ది సవరణలతో ప్రకటించడం జరిగింది. ఈ విద్యావిధానం విద్యారంగంలో సమూలమైన సంస్కరణలు తీసుకు వచ్చే దిశగా సాగుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా, భవిష్యత్తుకు సరికొత్త బాటను నిర్మించడమే ధ్యేయంగా, సమగ్రంగా, దేశంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా దీన్ని రూపొందించడం జరిగింది.

ఇందులో ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, విద్యా సంస్థల నిర్వహణ కమిటీలకు భావి విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా సరైన బాటలో పురోగతి చెందించడానికి మార్గ దర్శకాలను అందజేయడం జరిగింది. జాతీయ విద్యావిధానానికి సంబంధించిన లక్ష్యాలను, ఆశయాలను కార్యాచరణలో పెట్టి, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 15 లక్షల పాఠశాలలను ప్రగతి బాటలో నడిపించడానికి ఈ మార్గదర్శకాలు తోడ్పడతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. విద్యా రంగ సమగ్ర, సంపూర్ణ పురోగతిలో సమాజాన్ని భాగస్వామిగా చేయడంతో పాటు, విద్యారంగంలో జవాబుదారీతనాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాక, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, వ్యవస్థలకు, ప్రభుత్వానికి మధ్య ఈ విద్యాసంస్థల నిర్వహణ కమిటీలు వారధిలా పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తోంది.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్

**విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి**

విద్యాబోధనతో పాటు ఆరోగ్య సంరక్షణ, శ్రేయస్సు, సంక్షేమం, మానసిక ఆరోగ్యం, విద్యార్థులకు ఆలంబన వంటివి ఈ విద్యా సంస్థల నిర్వహణ కమిటీల ప్రథమ ప్రాధాన్యాలు కావాలని, యావత్ సమాజం ఇందులో భాగస్వామి కావాలని, విద్యార్థులకు అడుగడుగునా చేయూతనందివ్వాలని, విద్యా సంస్థలను పటిష్ఠం చేయడానికి కూడా ముందుకు రావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్వహణ కమిటీలు కాలక్రమేణా ప్రజా ఉద్యమాలుగా రూపాంతరం చెందాలని, సంస్కృతికి బలమైన ఊతమివ్వాలని కూడా ఈ మార్గదర్శక సూత్రాలు సూచిస్తున్నాయి. భారతదేశంలో కొన్ని వేల సంవత్సరాల నుంచి బ్రిటిష్ వారు దేశంలో అడుగు పెట్టే వరకు ఒక సామాజిక నాయకత్వం కిందే వర్ధిల్లాయని, ఇటువంటి చరిత్ర మరే దేశంలోనూ లేదని ప్రధాన్ ఇటీవల ఢిల్లీలో ఈ మార్గదర్శకాలను విడుదల చేస్తూ గుర్తు చేశారు. విద్యావ్యవస్థలో మళ్లీ సామాజిక నాయకత్వాన్ని, భాగస్వామ్యాన్ని పెంచి దీన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ అభిమతంగా కనిపిస్తోంది. భారతదేశ విద్యా సంస్కృతికి పూర్వ వైభవాన్ని, ఉన్నతిని తీసుకు వచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది.

మార్గదర్శకాలను విడుదల చేయడంతోనే ప్రభుత్వ బాధ్యత తీరిపోలేదు. విద్యా వ్యవస్థను మరింత లోతుగా సంస్కరించి, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా పరివర్తన చెందించడానికి కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. భారతదేశం 2047 నాటికి ఒక అగ్రరాజ్యంగా ఎదగాలన్నా, ఆర్థిక వ్యవస్థ మొదటి స్థానంలో ఉండాలన్నా దానికి దేశంలోని తరగతి గదుల తోడ్పాటు చాలా అవసరం అని ప్రధాన్ ఈ సందర్భంగా అన్నారు. ఈ సంస్కరణలు, పరివర్తనల్లో ఈ మార్గదర్శకాలే కీలకమని కేంద్రం భావిస్తోంది. గతంలో విద్యాహక్కు చట్టాన్ని ప్రవేశపెట్టిన తర్వాత విద్యా సంస్థల నిర్వహణ కమిటీలకు రూపకల్పన చేయడం జరిగింది. అయితే, అవి కేవలం పర్యవేక్షణ, ప్రాథమిక సదుపాయాలు, సమర్థవంతమైన పాలనా వ్యవహారాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అయితే, ఆ తర్వాత కొత్త సవాళ్లు, కొత్త లక్ష్యాలు, కొత్త ఆశయాలు ప్రవేశించాయి. అప్పటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

**ఆధునిక విద్యా ప్రమాణాలు**

ఆధునిక విద్యా ప్రమాణాలకు తగ్గట్టుగా పాఠశాలల్లో ఇక నుంచి డిజిటల్ విద్యను కూడా బోధించడం జరుగుతుంది. నగరాలు, పట్టణాల్లోనే కాక, గ్రామస్థాయి పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం డిజిటల్ విద్య అందుబాటులోకి వస్తుంది. గ్రామ స్థాయి పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం డిజిటల్ విద్య చేరే విధంగా 200 టీవీ చానల్స్‌ను, స్మార్ట్ తరగతులను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. డిజిటల్ విద్యను బోధించడంతో పాటే ఆధునిక నైపుణ్యాలలో విద్యార్థులకు శిక్షణనిచ్చి ఉద్యోగాలకు తీర్చిదిద్దడం జరుగుతుంది. ప్రభుత్వం పిల్లలను అత్యధిక సంఖ్యలో పాఠశాలల్లో చేర్పించడం మీద కూడా దృష్టి పెడుతోంది. ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు నూరు శాతం పాఠశాలల్లో చేరాలని ప్రభుత్వం

భావిస్తోంది. అంతేకాక, కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్య, పరిశోధన మండలి (ఎన్.సి.ఇ.ఆర్.టి)కి చెందిన పాఠ్య పుస్తకాలను పటిష్టం చేసే కార్యక్రమంలో ఇప్పటికే నిమగ్నం అయింది. ఇందులో ఆధునిక నైపుణ్యాలను చేర్చడంతో పాటు, భారతీయ భాషలకు కూడా ప్రాధాన్యం పెంచుతోంది.

కేంద్ర ప్రభుత్వం విద్యా సంస్థలను పరిపుష్టం చేయడానికి, విద్యావ్యవస్థను ఆధునీకరించడానికి మరికొన్ని చర్యలను కూడా ఇప్పటికే చేపట్టింది. విద్యారంగాన్ని సరైన దారిలో నడిపించడానికి ఉద్దేశించిన ఎన్.ఎ.ఎ.సి, ఎన్.ఐ.ఆర్.ఎఫ్ వంటి సంస్థలకు స్వయం నిర్ణయాధికారాన్ని అప్పగించింది. ఇవి మరింత బాధ్యతగా, జవాబుదారీతనంగా, పారదర్శకంగా, ఉన్నత ప్రమాణాలతో వ్యవహరించడానికి వీటికి స్వయంప్రతిపత్తిని కల్పించింది. విద్యాబోధనను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంచడం, విద్యారంగాన్ని సంస్కరించడం వంటివన్నీ సమష్టి బాధ్యతలని, చైతన్యవంతమైన, జాగృతమైన విద్యావ్యవస్థను రూపొందించాలన్న పక్షంలో ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలందరి చేయూత అవసరమని ప్రధాన్ అన్నారు.

# త్మక సంస్కరణలు

**అంతర్జాతీయ విలువలు**

విద్యా వ్యవస్థలో క్రమంగా విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యం, ప్రాథమిక స్థాయి అక్షరాస్యత, డిజిటల్ పారదర్శకత, సరికొత్త విద్యా బోధన పరికరాలు, సామాజిక భాగస్వామ్యం వంటివి క్రమంగా ప్రాధాన్యం సంతరించుకోవడం ప్రారంభించాయి. వీటిని దృష్టిలో ఉంచుకునే కొత్త మార్గదర్శక సూత్రాలను రూపొందించడం జరిగింది. ఈ మార్గదర్శకాల వల్ల ఈ విద్యా సంస్థల నిర్వహణ కమిటీలు కేవలం పర్యవేక్షణ సంస్థలుగా ఉండిపోయే అవకాశం ఉండదు. అవి విద్యా సమాజ పాలనా సంస్థలుగా రూపాంతరం చెందడం జరుగుతుంది. విద్యార్థుల సర్వతోముఖాభి వృద్ధి మీద ఇవి దృష్టి పెట్టడం ప్రారంభం అవుతుంది. ఒక పక్క విద్యారంగ ప్రమాణాలను పెంచుతూనే మరొకపక్క విద్యార్థుల సంక్షేమాన్ని, భద్రతను, భాగస్వామ్యాన్ని, డిజిటల్ నిర్వహణను, పారదర్శకతను పెంపొందించడానికి కృషి జరుగుతోంది. విద్యా వ్యవస్థలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా రూపొందించిన ఈ మార్గదర్శకాల వల్ల విద్యా ప్రమాణాలు, నాణ్యత, విలువలు పెరగడంతో పాటు, విద్యావిషయకంగా, వైజ్ఞానికంగా భారత దేశాన్ని అగ్ర రాజ్యంగా మారడానికి కూడా అవకాశం ఉంటుంది.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నా, విద్యాబోధన ఉత్తమ ప్రమాణాలు పాటించాలన్నా సామాజిక భాగస్వామ్యం తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త మార్గదర్శకాల వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు మధ్య ఉన్న అంతరాలు, అవాంతరాలు తొలగిపోతాయని, విద్యా వ్యవస్థ ప్రపంచ స్థాయికి ఎదిగే అవకాశం కలుగుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ విద్యా సంస్థల నిర్వహణ కమిటీలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతినిధులను ఎంపిక చేయడం జరుగుతుంది. ఉదాహరణకు వంద మంది విద్యార్థులున్న పాఠశాలలో పది నుంచి పదిహేనుమంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటవుతుంది. ఈ కమిటీలో టీచర్లు, తల్లితండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆశా వర్కర్లు, స్థానిక విద్యావేత్తలు, నిపుణులు, పాత విద్యార్థులు కూడా సభ్యులుగా ఉంటారు. ప్రాథమిక స్థాయి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన చేసే పాఠశాలల్లో ఈ కమిటీలు ఏర్పడతాయి. ఇవి నెలకొకసారి సమావేశమై మార్గదర్శకాల అమలును సమీక్షించడం జరుగుతుంది. ★

**పుస్తక సమీక్ష**

# భావదాస్యానికి భంగపాటు

భారతదేశపు రాజకీయ చారిత్రక కథనాల (Narratives)పై ఇటీవల కాలంలో చాలా లోతైన చర్చ జరుగుతున్నది. స్వాతంత్రం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు దాటుతున్నా భావదాస్య రాజకీయాల నుంచి, భావదాస్య భావజాలం నుంచి ఇంకా మనకు విముక్తి లభించకపోవడం విచారకరమే కాకుండా ఈ సామాజిక స్తబ్దత నుంచి బయటపడి ఆత్మనిర్భరమైన దేశంగా భారతదేశం సాంస్కృతికంగా ఆర్థికంగా నిలబడడానికి ఎన్నో చిక్కులు ఎదురవుతూనే ఉన్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఆనాటి పరతంత్ర భావజాల ప్రేరణతో ఎదిగిన 2,3 తరాల నాయకులే రాజకీయాలను శాసిస్తుండటం వల్ల స్వాతంత్రం వచ్చినా, మన దేశపు చారిత్రక, సాంస్కృతిక మూలాలతో నిండిన రాజకీయ, సామాజిక విలువలు వెలికితీసి సమాజాన్ని చైతన్యవంతం చేయడం ఇప్పుడే మొదలైంది.

ఎనిమిది శతాబ్దాలుగా ముస్లిం సామ్రాజ్యవాదుల, మూడు శతాబ్దాలుగా, యూరోప్ సామ్రాజ్యవాదుల పరిపాలనలో అలసిపోయిన జాతిని మేల్కొల్పటం అంత సులభం కాదు. ఎలిమెంటరీస్థాయిలో విద్యార్థులలోని జ్ఞానపరమైన అమాయకత్వాన్ని (epistemic innocence) ఆసరా చేసుకొని వలసవాద భావజాలాన్ని ప్రేరేపించే విధంగా వివిధ స్థాయిలలో, రీసెర్చ్ స్థాయి వరకు, జ్ఞాన శాస్త్ర హింస (epistemic violence) ఈ దేశంలో సాగింది.

దాదాభాయి నౌరోజీ వంటివారు అప్పట్లో బ్రిటిష్‌వారి ఆకృత్యాలను ఎండగడుతూ పుస్తకాలు రాసినా అవి సామ్రాజ్యవాద భావజాలాన్ని మూలాలతో సహా పెకిలించడానికి ఏమాత్రం సహాయం చేయలేదు.

మన దేశ ప్రాచీన సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, సాంఘిక వారసత్వాన్ని అటు సామ్రాజ్యవాద భావజాలంతో గాని ఇటు మార్క్సిస్టు భావజాలంతో గాని చిత్రించి కథనం నడిపినప్పుడు, ఆ కథనాన్ని జీర్ణించుకున్న భారతీయులకు తమ చరిత్ర మూలాలు, సంస్కృతి పట్ల ఏ మాత్రం అభిమానం కలగకపోగా నిర్వేదం, నిర్లిప్తత కలుగుతాయి. కొన్నిసార్లు ఏవగింపు కూడా కలగవచ్చు. మూలాలను మర్చిపోవడం అంటే జాతి విచ్ఛిన్నతను కోరుకోవడమే.

ముస్లిం యూరోపియన్ల పరిపాలనకు ముందు మనకు చరిత్ర ఏమీ లేదని, మన సంస్కృతిలో ఏ విధమైన పురోగామి భావజాలం లేదని, నిరంతరం బోధించే చరిత్ర పుస్తకాలను పక్కన పెట్టి, ఈ దేశపు చరిత్ర, సంస్కృతి, మూలాలను అవగతం చేసుకుంటేనే భారతీయత ఒక సంస్కారంగాను, ఒక జాతి గుర్తింపుగాను పరిఢవిల్లుతుంది.

మెహంజదారో, నలందా, తక్షశిల వంటి ప్రదేశాలలో పురావస్తు పరిశోధనలను, కోణార్క, అజంతా, ఎల్లోరా వంటి కళాఖండాలను, తంజావూరు, గంగై కొండచోళపురం వంటి కట్టడాలను విపులంగా పరిశీలించినప్పుడు, వేద విజ్ఞానంలోని తర్క సమన్వయాన్ని, మహాభారతం, రామాయణాల్లోని సాహిత్య విలువల్ని, విశదంగా పఠించినప్పుడు, ఆయా కళా ఖండాలు, కట్టడాలు, కావ్యాలు ఏదో ఒక గాలివాటుగా సృజించినవి కావని వాటి వెనుక ఎంతో శాస్త్ర పరిశోధన, ఉన్నత సాంకేతిక సాధన లేకుండా అవి సాధ్యమయ్యేవి కావని తెలుస్తోంది.

కోణార్క వంటిదో, తంజావూర్ వంటిదో నిర్మించాలంటే దాని వెనుక ఎంతో శ్రమ, దార్శనికత, ప్రణాళిక, రేఖాచిత్రాలు, నిర్మాణ సంబంధమైన నియమాలు, సామాగ్రి, రచనా సంబంధమైన నియమాలు, సాధనాలు అన్నీ డాక్యుమెంట్ చేయకుండా అలాంటి నిర్మాణాలు జరిగి ఉండే అవకాశం లేదని తెలుస్తోంది.

ఈ జాతి దురదృష్టం కొద్దీ 'ఫైనల్ ప్రొడక్ట్' మిగిలి ఉన్నాయికానీ, ఆ డాక్యుమెంటేషన్ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం వల్ల, ఆయా సంబంధిత శాస్త్రాలలో మన పూర్వీకులు ఎంత గొప్ప సాధన పరిశోధన చేశారో అంచనా వేయలేకపోతున్నాం. శాస్త్ర నిర్మాణం కొనసాగించలేక పోతున్నాం.

ఈ ఫైనల్ ప్రొడక్ట్ కూడా చాలా రంగాల్లో లభించకపోవడం వల్ల మన చరిత్ర సంస్కృతులను అర్థం చేసుకోవడం ఇంకా కష్టతరం అవుతుంది.

ఎందుకిలా జరిగింది?ఈ భావజాలం 2,3 శతాబ్దాలుగా ఎందుకిలా పేరుకుపోయింది? ఈ భావ దాస్యానికి మూలాలేమిటి?

ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తే కానీ మన అధ్యయనం సమగ్రంగా సాగదు.

ఈ మధ్య కాలంలో...శశిథరూర్, విలియం




**"భావదాస్య మూలాలు"**
**రచన:** డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి, మైలవరపు సుధామోహన్.
**పే.:** 288, **వెల:** రూ.270
**ప్రచురణ:** నవయుగ భారతి.

డాల్రింపుల్ వంటి వారు భారతీయ మూలాలను స్పృశిస్తూ పుస్తకాలు రాసినా, ఈ భావదాస్యాన్ని ఒక ఉద్యమంలాగా బ్రిటిష్ పాలకులు, బ్రిటిష్ చరిత్రకారులు ఎలా మొదలుపెట్టి, భారతీయుల మనో వేదికలపై ఎలా చూపించారో తెలిపే పుస్తకాలు మన దేశంలో ముఖ్యంగా తెలుగులో రాలేదు.

క్రీస్తు శకం 15వ శతాబ్దంలో కొలంబస్‌కీ. భారతదేశం సందర్శించాలని కోరిక కలిగిందంటే ఈ దేశంలో సంస్కృతి, సంపదలు అప్పుడే ప్రపంచ ప్రఖ్యాతంగా ఉన్నాయనే కదా.

యూరోపియన్లు సామ్రాజ్య కాంక్షతోనైనా, వ్యాపార నిమిత్తమైనా గుంపులు గుంపులుగా ఈ దేశం మీదకు ఎందుకు ఎగబడ్డారు?

పద్దెనిమిదో శతాబ్దం మొదట్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 23% సింహభాగాన్ని భారతదేశంలో ఆక్రమించింది. అప్పట్లో అన్ని యూరోప్ దేశాలను కలిపినా భారతదేశపు ఆర్థిక వ్యవస్థకు సరితూగే పరిస్థితి లేదు. ఇక్కడికి నౌకల్లో వ్యాపారానికి వచ్చిన వారికి, ఈ దేశ సంస్కృతి సౌభాగ్యాలు ఆశ్చర్యాన్ని, అసూయను కలిగించాయి. ఈ దేశంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమ్మేళనమైన జీవన విధానం మన సౌభాగ్యానికి మూలమని వారు గుర్తించారు. ఈ వారసత్వాన్ని తమ అధికారం ద్వారా ముక్కలు ముక్కలు చేసి పాశ్చాత్య భావజాలాన్ని గుప్పిస్తే గానీ వారి నిరంతర దోపిడీ కొనసాగదని గుర్తించారు.

అందుకు ఒక సైద్ధాంతిక భూమికను ఏర్పాటు చేయడానికి ముందుగా కంకణం కట్టుకున్న వాడు జేమ్స్ మిల్.

ఆయన భారతదేశానికి ఒక్కసారి కూడా రాకుండానే, భారతదేశ చరిత్ర (The history of British India) అంటూ భాగాలు భాగాలుగా మన చారిత్రక మూలాలను వెక్కిరిస్తూ పాశ్చాత్య భావజాలపు ఔన్నత్యాన్ని కీర్తిస్తూ పుస్తకం రాసి ఒక భూమికను ఏర్పాటు చేశాడు. అది అక్కడ బ్రిటిష్ పాలకులకు, అక్కడ నుండి దేశానికి వచ్చిన బ్రిటిష్ అధికారులకు, చివరికి ఇంగ్లిష్ చదువుకున్న భారతీయులకు కూడా ఆధారంగా మారింది. భారతదేశం ఎంతో వెనుకబడ్డ జాతియని, ఈ జాతిని ఉద్ధరించాల్సిన బాధ్యత తెల్లవారిపై ఉందని (White manµs burden) ప్రచారం జరిగింది.

జేమ్స్ మిల్ తయారు చేసిన భూమిక పైనే మెకాలే వంటివారు పాశ్చాత్య అధ్యయన విధానాల్ని ఈ దేశంపై రుద్ది భారతీయ మూలాలను పూర్తిగా నాశనం చేయడానికి ప్రయత్నించారు. మిల్ చేసిన వికృత ప్రతిపాదనను ఒక్కొక్కటిగా అధ్యయనం చేసి ఆధారాలతో సహా వాటి వెనుక ఉన్న వెనుక ఉన్న కుటిలనీతిని, ప్రలోభాన్ని పటాపంచలు చేసే విధంగా సారంగపాణి గారు రచన సాగించారు. ఈ భావదాస్య మూలాలను భారతీయుల మెదళ్లలో కూడా ఎలా చూపించారో వివరించారు.

సామ్రాజ్యవాద దేశాలు, ఆసియా, ఆఫ్రికా, దక్షిణమెరికా ఖండాల్లో అక్కడి ప్రాంతీయ సాంస్కృతిక భావజాలాన్ని తొక్కిపెట్టి, పాశ్చ్యాత్య భావజాలాన్ని ఎలా ప్రవేశపెట్టారో, ఆయా దేశాల్లో స్వతంత్రం వచ్చిన తరువాత, అక్కడి మేధావులు. ఆ భావ జాలాన్ని తిప్పికొట్టడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశారో కూడా సారంగపాణి గారు వివరించారు.

కొన్ని చోట్ల. మరి టామ్. academicగా అనిపించినా, భారతీయ విజ్ఞాన సాంస్కృతిక మూలాలు ఎలా కనుమరుగుచేసి భావదాస్యాన్ని జొప్పించారో తెలుసుకోవాలంటే సారంగపాణి, సుధామోహన్ గార్లు రాసిన ''భావదాస్య మూలాలు'' పుస్తకం చదవాల్సిందే.

**సమీక్ష: డా. సంకా ప్రసాద్**



**రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్‌కి అట్లీ ప్రధానమంత్రి అయ్యారు. యుద్ధకాలంలో ప్రధానమంత్రిగా ఉన్న చర్చిల్ ప్రతిపక్ష నాయకుడయ్యాడు. యుద్ధంలో బ్రిటన్ విజయం సాధించిన తర్వాత 'భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాల'న్న తీర్మానాన్ని బ్రిటన్ పార్లమెంటులో ప్రవేశపెట్టాలని నిర్ణయం జరిగింది. నిజమైన చరిత్ర ఏమిటీ? ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా అహింసాత్మక పోరాటం చాలదని నమ్మినవాడు సావర్కార్. అంతిమంగా, సాయుధ పోరాటం చేసి తీరాలనే భావనకు, దాని ఆచరణకు, సాఫల్యానికీ సావర్కార్ వ్యూహమే కారణమైంది. ఇది ఎలా జరిగిందో చూద్దాం!**

**భా**రతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడం చర్చిల్‌కి ఇష్టంలేదు. దాంతో అతడు అట్లీని కలిసి "భారత్‌కి స్వాతంత్ర్యం ఇవ్వాలంటూ తీర్మానం చేయాల్సిన అవసరం ఇప్పుడు ఏం వచ్చింది? ఇది చేయక తప్పదా?' అని నిలదీశాడు. అట్లీ ఆయనకు రెండు కారణాలు చెప్పాడు. 1.భారతీయ సైన్యానికి మన దేశం పట్ల విధేయత, విశ్వాసాలు ఇదివరకు ఉన్నట్లుగా ఇప్పుడు లేవు. మనం ఏం చేసినా ఊరుకునే పరిస్థితి ఇదివరకటిలా లేదు. 2.వాళ్లు మన మీద ఏ కాస్త తిరుగుబాటు చేసినా మన సైనికబలంతో అణచివేయగల శక్తి ఇదివరకటిలాగా ఇప్పుడు మన సైన్యానికి లేదు. అందుకే, ఇప్పుడు భారతదేశానికి మనం స్వాతంత్ర్యం ఇవ్వక తప్పదు.

దేశానికి స్వాతంత్ర్యం రావడానికి దారితీసిన కీలకమైన కారణాలు ఈ రెండే అన్నది చారిత్రక సత్యం. అట్లీ, చర్చిల్ సంభాషణలు దీనికి నిరూపణ అయితే. ఈ సంగతిని ఉన్నది ఉన్నట్లుగా బయటి ప్రపంచానికి ఎవరు చెబుతారు? గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెస్ జరిపిన అహింసాత్మక పోరాటాలతోనే ఆంగ్లేయులకు హృదయ పరివర్తన కలిగి, భారత ప్రజలకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించారని ప్రచారం చేయడం ద్వారా మొత్తం ఖ్యాతిని గాంధీకి, కాంగ్రెస్‌కు ఇవ్వడం చరిత్రను వక్రీకరించడమవుతుంది.

మొదటి స్వాతంత్ర్య సమరం (1857లో) తర్వాత ఆంగ్లేయులు ముందస్తు జాగ్రత్తగా హిందువులను, ముస్లింలను విభజించి పాలించే నీతిని అవలంబించారు. ముస్లింలను బుజ్జగిస్తూ, వారిని హిందువులకు వ్యతిరేకంగా, తమకు అనుకూలంగా ఉండేలా చేసుకున్నారు. తర్వాత భారతీయ సైన్యంలో ముస్లింలను అధిక సంఖ్యలో చేర్చుకుని, హిందువులు అల్పసంఖ్యాకులుగా ఉండేటట్లుగా చూసుకున్నారు. తద్వారా ఇక

# సావర్కార్ వ్యూహం – స్వాతంత్ర్యఫలం

ముందెప్పుడూ సైనికులు తమపై తిరుగుబాటు చేయకుండా ఉండాలని తలపోశారు.

కానీ, రెండో ప్రపంచ యుద్ధం మొదలు కావడంతో సైనికుల సంఖ్యను బాగా పెంచుకో వలసిన అవసరం బ్రిటిష్ పాలకులకు ఏర్పడింది. దాంతో, హిందువులు సైన్యంలో అధిక సంఖ్యలో చేరాలనీ, భవిష్యత్తులో ఎప్పుడైనా ఆంగ్లేయులపై తిరుగుబాటుచేసి, విజయం సాధించాలంటే ఇది తప్పనిసరి అనీ సావర్కార్ వ్యూహరచన చేశాడు. దీనికి భిన్నంగా, సైన్యంలో భారతీయులెవరూ



చేరరాదనీ, ఆంగ్ల ప్రభుత్వానికి సహకరించరాదనీ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పిలుపు ఇచ్చింది. గాంధీజీ సహాయ నిరాకరణ పిలుపు దేశానికి స్వాతంత్ర్యం ఎలా తేగలదనే దానిపై కాంగ్రెస్ వద్ద జవాబులేదు.

సాయుధ పోరాటం లేకుండా స్వాతంత్ర్యం ఎప్పటికీ రాదనీ, అయితే పరాయి పాలకుల సైన్యంలో ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ఉన్నంత కాలం సాయుధ పోరాటాలు తలెత్తలేవనీ సావర్కార్ స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. సైన్యంలో హిందువులు అత్యధిక సంఖ్యలో ఉండాలని అంటూ దేశమంతా తిరిగి సైన్యంలో చేరేలా హిందువులను ప్రోత్సహించారు సావర్కార్.

“ముందు తుపాకీ పేల్చడం, యుద్ధం చేయడం నేర్చుకోండి! అవసరాన్నిబట్టి, సందర్భాన్నిబట్టి, దానిని ఎవరిమీద పేల్చాలి? ఎవరితో యుద్ధం చేయాలి అనే విషయాలను తర్వాత నిర్ణయించుకోవచ్చు” అని ఆయన ప్రచారం చేశారు. హిందువులలో సావర్కార్ వ్యూహాన్ని అర్థం చేసుకోగలిగినవారు సైన్యంలో పెద్ద సంఖ్యలో చేరారు.

ఒక లెక్క ప్రకారం రెండో ప్రపంచ యుద్ధానికి ముందు సైన్యంలో 40 శాతం మాత్రమే ఉన్న హిందువులు, కొత్త సమీకరణలతో 60 శాతానికి పెరిగారు. హిందువులకు దీటుగా ముస్లింలు సైన్యంలో చేరకపోవడంతో, ముందుకు వచ్చిన హిందువులనే సైన్యంలోకి తీసుకోవడం తప్ప, బ్రిటిష్ పాలకులకు గత్యంతరం లేకపోయింది.

ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి సైనికపరంగా బ్రిటిష్ ప్రభుత్వం చాలా బలహీనపడింది. ఇదే అదనుగా, హిందువులు అధిక సంఖ్యాకులుగా కలిగిన బొంబాయి నావికాదళం ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు సిద్ధమైంది. అహింస...అహింస అంటున్న గాంధీజీ ప్రభావం నావికాదళ సైనికుల మీద సున్నా. వీరి ఉత్సాహం వైమానిక, పదాతి దళాలకు వ్యాపించే సూచనలు కూడా కనిపించాయి. శాంతి, అహింస ఉద్యమాలను వదలి, భారతీయులు సాయుధ పోరాట మార్గం పడుతున్నారని బ్రిటిష్ పాలకులకు కూడా అర్థమైంది. కాంగ్రెస్ సత్యాగ్రహులను అణచివేసినట్లుగా సైనికుల కొత్త తిరుగుబాట్లను అణచివేసే సైనిక శక్తి తమకు లేదని ఆంగ్లేయులకు బాగా అర్థమైపోయింది.

ఫలితంగా, భారత్‌కు స్వాతంత్ర్యం ఇచ్చి తప్పుకోవాలని తెల్లదొరలు నిర్ణయించుకోవలసి వచ్చింది. అట్లీ, చర్చిల్‌ల సంభాషణ ఈ సారాంశాన్ని తేటతెల్లం చేస్తుంది. చారిత్రకంగా గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమైన ఉద్యమాలు మూడు. 1.సహాయ నిరాకరణోద్యమం, 2.ఉప్పు సత్యాగ్రహం, 3. క్విట్ ఇండియా ఉద్యమం. ఈ మూడింటినీ ఆంగ్ల ప్రభుత్వం తన సైనికబలంతో చాలా సులభంగా అణచివేసింది. ఆంగ్లేయులకు అవి పెద్ద సమస్యలే కావు. అందుకనే అట్లీ, చర్చిల్‌ల మధ్య జరిగిన సంభాషణలలో ఆ ఉద్యమాల గురించిగానీ, వాటికి నాయకత్వం వహించిన గాంధీజీ ప్రభావాన్ని గురించి గానీ ప్రస్తావనే లేదు. సాయుధ పోరాటానికి గల గొప్ప శక్తినీ అవసరాన్ని దేశంలోని హిందువులకు విరివిగా ప్రచారం చేసినవాడు, అందుకుగాను బ్రిటిష్‌వారి క్రౌర్యానికి గురై నరమానవుడు కూడా తలచుకోలేని దుర్భర శిక్షలను అనుభవించిన త్యాగధనుడు, అకుంఠిత దేశభక్తుడు వీరసావర్కార్. ఆయన 1966 ఫిబ్రవరి 26న తుదిశ్వాస విడిచారు.

కాంగ్రెస్ పుణ్యమా అని అందరూ అహింస, బాపూజీ సత్యాగ్రహాల గురించే మాట్లాడేవారు. అదే సమయంలో “జాతిని హైందవీకరించాలి’, హిందువులను సైనికీకరించాలి” అని వీరసావర్కార్ ఇచ్చిన పిలుపు హిందూ జాతికి నిశ్శబ్ద మార్గదర్శి అయింది. స్వాతంత్ర్య ప్రియులకు నిరంతర మార్గదర్శకమయింది.

సావర్కార్ వ్యూహరచన సమగ్రమైనదని అనడానికి గృహనిర్బంధంలో ఉన్న సుభాస్ చంద్రబోస్‌కు ఆయన చేసిన బోధే నిదర్శనం.“ఈ విధంగా గృహనిర్బంధంలో మగ్గుతూ జీవితాన్ని వృథా చేసుకోకు. మారువేషంలో విదేశాలకు వెళ్లు! ఆంగ్ల వ్యతిరేక రాజ్యాలైన జర్మనీ, జపాన్‌లతో కలసి, భారత్‌లోని ఆంగ్ల ప్రభుత్వంపై సాయుధ పోరాటం చేయి” అని సలహా ఇచ్చాడు.

సావర్కార్ ప్రేరణతోనే సుభాష్‌చంద్రబోస్ మారువేషంలో జర్మనీ, జపాన్‌లకు వెళ్లాడు. ‘ఆజాద్ హింద్ ఫౌజ్’కు నాయకత్వం వహించాడు. ఆంగ్లేయ భారత్‌పై సాయుధ పోరాటంచేసి, ఆంగ్లేయుల మనో ధైర్యాన్ని కుంగదీశాడు. ‘భారతదేశానికి బ్రిటిష్‌వారు స్వాతంత్ర్యం ఇవ్వడానికి వెనుక గాంధీ ప్రభావం ఎంత?’ అని ఒక మాజీ హైకోర్టు న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు చాలా స్వల్పం అంటూ అట్లీ పెదవి విరిచారు. అదే సమయంలో తమను అందుకు లొంగదీసినది సుభాస్ చంద్రబోస్ ప్రభావం అని కూడా అట్లీ స్పష్టం చేశారు.

సావర్కార్ చేసిన వ్యూహరచన పుణ్యంగానే మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందనడానికి అట్లీ మాటలు సాధికారికమైన నిరూపణ. ఈ చారిత్రక వాస్తవాలను ప్రతి భారతీయుడు ఇప్పటికైనా తెలుసుకోవడం న్యాయం.



కె. శ్యాంప్రకాశ రావు

# సీపీఎం హింస ఆర్ఎస్ఎస్




తరచుగా "రాజకీయ ఘర్షణలు" అనే కోణంలో వర్ణించినప్పటికీ, కన్నూర్‌లోని సుదీర్ఘ హింసా చరిత్ర చాలా సంక్లిష్టమైన, తీవ్రంగా ధ్రువీకృతమైన వాస్తవికతను ఆవిష్కరిస్తుంది. దశాబ్దాలుగా, కేరళలోని ఈ ఉత్తర జిల్లా రాజకీయ హత్యలు, భావజాల ఘర్షణలు, ప్రతీకార దాడుల పునరావృత చక్రాలకు సాక్ష్యంగా నిలిచాయి. ఇవి దాని సామాజిక-రాజకీయ స్వరూపాన్ని తీర్చిదిద్దాయి.

రాజకీయంగా ఒక వర్గానికి చెందిన మీడియా వ్యక్తులు, అజ్ఞానులు అసహనం, వాక్ స్వాతంత్ర్యం గురించి పదేపదే ప్రస్తావిస్తూ, సీపీఎం-ఆర్ఎస్ఎస్ ఘర్షణల కారణంగా కేరళ తన శాంతియుత వాతావరణాన్ని కోల్పోవడానికి కారణాన్ని వివరించ డానికి ప్రయత్నిస్తారు. అసలు వాస్తవ ప్రదర్శన అసంపూర్ణంగా లేదా వక్రీకరించి ఉంటుంది. అయితే, వాస్తవం ఏమిటి? నిజంగా సీపీఎం-ఆర్ఎస్ఎస్ ఘర్షణలు ఉన్నాయా? లేక అవి తమ 'రాజకీయ శత్రువుల'పై సీపీఎం ప్రదర్శిస్తున్న భయోత్పాతం, హింసాకాండనా? కమ్యూనిస్టులు, అంటే ఆధునిక పరిభాషలో మార్క్సిస్టులు, ఇతర సిద్ధాంతాలకు ఎల్లప్పుడూ తీవ్ర వ్యతిరేకులు. ఇది అందరికీ తెలిసిన విషయమే. గత శతాబ్దపు రెండవ దశాబ్దంలో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం నుండి ప్రపంచవ్యాప్తంగా ఇదే అనుభవం కొనసాగుతోంది. మార్క్సిజం మూల సూత్రమైన 'శ్రామికవర్గ నియంతృత్వం', కమ్యూనిస్ట్ పార్టీ నిరంకుశ పాలనను సమర్థిస్తుంది. ఈ నిరంకుశ ఉత్సాహం, కమ్యూ నిస్టులు ఎక్కడ ఉన్నా వారి మనస్తత్వంలో అసహనా నికి, ద్వేషానికి దారితీస్తుంది. వారికి అధికారం లభించిన ప్రతిచోటా పరిస్థితి మరింత దారుణంగా, తీవ్రంగా ఉంటుంది. కేరళలో మనం ఏ రాజకీయ ఘర్షణను చూసినా, అందులో ఒక పక్షంలో సీపీఎం ఒక సాధారణ కారకంగా ఉంటుంది. అది సీపీఎం వర్సెస్ కాంగ్రెస్, సీపీఎం వర్సెస్ ఆర్ఎస్ఎస్, సీపీఎం వర్సెస్ బీజేపీ, సీపీఎం వర్సెస్ కేరళ కాంగ్రెస్, సీపీఎం వర్సెస్ సీపీఐ, ఇంకా కొన్నిసార్లు సీపీఎంలోని ఒక వర్గానికి వర్సెస్ మరో వర్గానికి మధ్య కూడా జరగవచ్చు. ఇది ఇతర భావజాల సమూహాలు ,వాటి సిద్ధాంతాల పట్ల సీపీఎంకు ఉన్న అసహనాన్ని నిరూపిస్తుంది.

సీపీఎం రెచ్చగొట్టిన ఈ హింసాత్మక గందర గోళంలో ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు అత్యంత తీవ్రంగా ప్రభావితమైన భావజాల సమూహాలుగా ఉన్నాయి. ఈ 'హత్య రాజకీయాల' చరిత్ర 1940వ దశకంలోనే ప్రారంభమైంది. అంటే కేరళ రాజకీయ రంగంలో అవిభక్త కమ్యూనిస్ట్ పార్టీ అధికారాన్ని రుచి చూడక ముందే ఆరంభమైంది. ఆర్ఎస్ఎస్‌పై అవిభక్త సీపీఐ జరిపిన మొదటి ముఖ్యమైన భౌతిక దాడి 1948లో తిరువనంత పురంలో జరిగింది. ఇది ముఖ్యమైనది. ఎందుకంటే ఆ దాడి అప్పటి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ (గురూజీగా ప్రసిద్ధి చెందిన వారు) ప్రసంగిస్తున్న ఒక ఆర్ఎస్ఎస్ సాంఘీక్‌పై (శారీరక వ్యాయామాలపై దృష్టి సారించిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమం) జరిగింది. శ్రీ గురూజీ వేదికపై ఉండగా వారు సభపై దాడిచేశారు. సీనియర్ ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్ పి. పరమేశ్వరన్ ముఖ్య శిక్షక్‌గా (ప్రధాన బోధకుడు) ఉన్నారు. స్వయంసేవకులు తగిన విధంగా ఎదురుదాడి చేశారు. ఒక విద్యార్థి నాయకుడి నేతృత్వంలోని యువ మార్క్సిస్టులు అక్కడి నుండి పారిపోయారు. కార్యక్రమం కొనసాగింది. ఏమీ జరగనట్లుగా గురూజీ ప్రసంగించారు. ఆయన తాను ప్రత్యక్షంగా చూసిన సంఘటన గురించి కనీసం ప్రస్తావించలేదు. 1952లో అలప్పుళలో గురూజీ ప్రసంగించవలసి ఉన్న అలాంటి ఒక సభలోనే సీపీఐ మరో పెద్ద దాడి చేసింది. ఇక్కడ కూడా సంఘటనల క్రమం పునరా వృతమైంది. ఆ హింసాత్మక దాడిపై పెద్దగా చర్చ జరగకుండానే కార్యక్రమం కొనసాగింది.

**సీపీఎం - హింసా సంస్కృతి**

దాదాపు ఒక దశాబ్దం పాటు నిశ్శబ్దం తర్వాత, 1964లో సీపీఐలో నిలువుగా చీలిక ఏర్పడింది. సీపీఐ ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులపై శారీరకంగా దాడి చేయకుండా సంయమనం పాటించినప్పటికీ, మరో వర్గమైన సీపీఎం, కొన్ని సంవత్సరాల ప్రశాంతత తర్వాత మళ్లీ హింసాత్మక మార్గాన్ని అనుసరించింది. ఆర్ఎస్ఎస్‌పై సిపిఎం జరిపిన తదుపరి ప్రధాన దాడి జనవరి 1969లో, త్రిస్సూర్ లోని శ్రీ కేరళ వర్మ కళాశాల సమీపంలో జరిగింది. కళాశాల యాజమాన్యం స్వామి చిన్మయానందజీని ఉపన్యాసం ఇవ్వడానికి ఆహ్వానించింది. కానీ, ఎస్ఎఫ్ఐకి పూర్వగామి అయిన కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ (కేఎస్ఎఫ్), ఆ ప్రాంతంలోని తమ సీపీఎం నాయకులతో కలిసి స్వామిజీని అవమానించడానికి, శారీరకంగా దాడి చేయడానికి అన్ని రకాల నీచమైన కుతంత్రాలను ప్రయోగించారు. స్వామిజీపై ఎలాంటి శారీరక దాడి జరగకుండా ఉండేందుకు ఏబీవీపీ విద్యార్థులు స్వామిజీని చుట్టుముట్టి, ఆయనకు రక్షణగా నిలిచి, ఆ ప్రదేశాన్ని సురక్షితంగా విడిచి వెళ్లడానికి కారు వద్దకు తీసుకువెళ్లారు. మరుసటి రోజు, స్వామీజీపై దాడి చేయడానికి సీపీఎం చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా ఏబీవీపీ నిరసన ర్యాలీ నిర్వహించినప్పుడు, సీపీఎం గూండాలు ఏబీవీపీ విద్యార్థులపై దాడి చేశారు. దాని ఫలితంగా భీకర మైన వీధి పోరాటం జరిగింది. బహుశా రాష్ట్రంలో ఆ తరహా పోరాటం అదే మొదటిది కావచ్చు. ఆ తర్వాత, దాదాపు ప్రతి సంవత్సరం, కేఎస్ఎఫ్, ఆపై ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, బయట నుంచి వచ్చిన సీపీఎం మనుషుల సహాయంతో కళాశాలలో ఏబీవీపీ కార్యకర్తలపై దాడి చేశారు. 1969లో, స్థానిక కార్యకర్తలు, ప్రస్తుతం పొలిట్‌బ్యూరో (పీబీ) సభ్యు లుగా, మాజీ, ప్రస్తుత రాష్ట్ర కార్యదర్శులుగా ఉన్న పినరీ విజయన్, కొడియేరి బాలకృష్ణన్‌ల నాయకత్వంలో, తలస్సేరిలో మిఠాయిల తయారీ దారుడైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త వడక్కల్ రామకృష్ణన్‌ను హత్య చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఒక నెల తర్వాత, వారు కొట్టాయం జిల్లా లోని పొంకున్నంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త శ్రీధరన్ నాయర్‌ను హత్య చేశారు. అదే సంవత్సరం, పాలక్కాడ్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త రామకృష్ణన్ హత్యకు గురయ్యారు. సీనియర్ ఆర్ఎస్ఎస్ కార్యకర్త, మాజీ ప్రచారక్ వెలియతునాడు చంద్రన్, 1970 జనవరి 11న ఎర్నాకులం జిల్లాలోని పారూర్‌లో జరిగిన సీపీఎం దాడిలో తదుపరి బాధితుడు అయ్యారు. 1973లో త్రిస్సూర్ జిల్లాలోని నల్లెంకరలో మండల్ కార్యవాహ శంకరనారాయణన్ హత్యకు గురయ్యారు. 1974లో, సీపీఎం కార్యకర్తలు కొచ్చిలో ఆర్ఎస్ఎస్ మండల్ కార్యవాహ సుధీంద్రన్‌ను హత్య చేశారు.

**ఎమర్జెన్సీ తర్వాత కొత్త అధ్యాయం**

ఎమర్జెన్సీ కాలంలోని పరిణామాలు హత్యల రాజకీయాలలో ఒక కొత్త అధ్యాయాన్ని తెరిచాయి. పైన పేర్కొన్న దాడులు ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలకు తీవ్రమైనవే అయినప్పటికీ, ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత 1978లో సంఘ కార్యకర్తలపై హత్యాకాండను సీపీఎం తమకు అలవాటైన విషయంగా భావించింది. ఎమర్జెన్సీ సమయంలో, కేరళలో నిరంకుశ, వంశపారంపర్య పాలనకు

# సా రాజకీయం.. శాంతి పథం



వ్యతిరేకంగా పోరాటాన్ని కేవలం ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు మాత్రమే కొనసాగించాయి. సహజంగానే, యువ, సాహసోపేతమైన సీపీఎం కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. ఎమర్జెన్సీపై పార్టీ నాయకత్వం తీసుకున్న రాజీ వైఖరిని వారు అంగీకరించలేకపోయారు. కమ్యూనిస్టు నాయకులు ఎలాంటి ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని తీసుకోవడానికి సిద్ధంగా లేనప్పటికీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పోస్టర్ ప్రచారాలు, కరపత్రాల పంపిణీ వంటివి చేపట్టారు. వేలాది మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సత్యాగ్రహం చేసి, అరెస్టులను ఎదిరించి, అమానుషమైన పోలీసు హింసను అనుభవించారు. అప్పుడప్పుడు 'విప్లవం' అనే డొల్ల ప్రసంగాలను వింటున్న కమ్యూనిస్టు మద్దతుదారులు చాలామంది ఉండేవారు. ఫలితంగా, ఆ సిపిఎం కార్యకర్తలలో చాలామంది ఎమర్జెన్సీ సమయంలో ఆర్ఎస్ఎస్ రహస్య కార్యకలాపాలలో చేరారు. ఎమర్జెన్సీ తర్వాత వారు చురుకైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలుగా మారారు. ఈ దృగ్విషయం కన్నూర్, అలప్పుజ, తీర ప్రాంత త్రిస్సూర్ వంటి సిపిఎం కంచుకోట ప్రాంతాలలో మరింత స్పష్టంగా కనిపించింది. కార్యకర్తల ఈ వలస సిపిఎంకు చివరి దెబ్బగా మారింది.

ఆర్ఎస్ఎస్‌లో చేరిన తమ మాజీ సహచరులను హత్య చేయడమే ఈ వలసలకు అడ్డుకట్ట వేయడానికి ఉత్తమ మార్గమని సీపీఎం నాయకత్వం భావించింది. 1978 సెప్టెంబరులో, వారు కన్నూర్ జిల్లాలోని తలస్సేరిలో పనుంద శాఖకు చెందిన యువ కళాశాల విద్యార్థి, ముఖ్యశిక్షక్ చంద్రన్‌ను హత్య చేసి ఈ దాడులను ప్రారంభించారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఆయన తండ్రి సీపీఎం స్థానిక కమిటీ సభ్యుడు. ఆ తర్వాత, తలస్సేరి తాలూకాలో వరుస హత్యలు జరిగాయి. ఆర్ఎస్ఎస్ అమరవీరులలో చాలామంది మాజీ సిపిఎం సభ్యులు లేదా, కనీసం, సీపీఎం సభ్యుల కుటుంబసభ్యులు. ఆర్ఎస్ఎస్ ఎదుగుదలను అణచివేయడానికి కత్తులు, ఖడ్గాలు సరిపోవని భావించినప్పుడు, వారు బాంబుల తయారీని ప్రారంభించారు. 1978 నుండి, తలస్సేరిలోనే అనేక మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు హత్యకు గురయ్యారు. వారిలో అత్యంత ప్రముఖులు: ఆర్ఎస్ఎస్ ఖండ్ కార్యవాహ కరింబిల్ సతీశన్ (1981), బిజెపి కన్నూర్ జిల్లా కార్యదర్శి పన్నీనూర్ చంద్రన్ (1986), కన్నూర్ జిల్లా శారీరిక్ ప్రముఖ్ మనోజ్ (2014). 1984లో, కన్నూర్ జిల్లా సహ కార్యవాహ సదానందన్ మాస్టర్ రెండు కాళ్లను మోకాళ్ల కింద నరికేశారు.

**ఆర్ఎస్ఎస్ శాంతి ప్రయత్నాలు**

ముఖ్యంగా, ఈ ప్రమాదకరమైన హత్యా రాజకీయాలకు ముగింపు పలికే మార్గాలను కనుగొనడానికి ఆర్ఎస్ఎస్ సంసిద్ధతను వ్యక్తం చేసింది. గతంలో సంఘ ఈ దిశగా అనేక గంభీరమైన చర్యలు చేపట్టింది. అవి సీపీఎం ఫాసిస్ట్ హత్యారాజకీయాలు ఉచ్ఛస్థితిలో ఉన్న రోజులు. కేరళ వీధుల్లో అమాయక సంఘ కార్యకర్తల రక్తం చిందింది. ఈ విషయంలో సంఘ నాయకులు సీనియర్ సీపీఎం నాయకులతో సంప్రదింపులు జరపాలని ఆలోచించారు. పరమేశ్వరన్ ఆర్ఎస్ఎస్ కేరళ ప్రాంత ప్రచారక్ కె.భాస్కరరావును సంప్రదించారు. దానికి అనుగుణంగా, పరమేశ్వరన్ ఢిల్లీలో సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఈఎంఎస్ నంబూద్రిపాద్ (ఈఎంఎస్)కు ఒక లేఖ రాశారు. ఈఎంఎస్ ఆయనకు సానుకూల ధోరణితో సమాధానమిచ్చారు.

1999 నవంబర్ 29 లేదా 30 తేదీలలో, కొచ్చిలోని జస్టిస్ వి.ఆర్.కృష్ణఅయ్యర్ నివాసంలో ఒక సమావేశం జరిగింది. ఆర్ఎస్ఎస్ దీనిలో భాగం కాదు! సీపీఎం జరిపిన హింసకు ఆర్ఎస్ఎస్ (మీడియా సాంకేతికంగా బిజెపి అని అంటుంది) ప్రధాన బాధితురాలైనప్పటికీ, ఆ సమావేశంలో పాల్గొన్నవారు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ! వారు తలస్సేరిలో శాంతిని కాపాడాలని నిర్ణయించారు. మరుసటి రోజే భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయకృష్ణన్ మాస్టర్ తన 6వ తరగతి విద్యార్థుల కళ్లెదుటే దారుణంగా హత్యకు గురయ్యారు!

మనం ఆర్ఎస్ఎస్-సీపీఎం చర్చలను పరిశీలిస్తే, ఒక విషయం సుస్పష్టం: ఆర్ఎస్ఎస్ చొరవ తీసుకుంది. అందువల్ల, కేరళలో రాజకీయ హింసను ఎవరు ప్రేరేపిస్తున్నారు, దానిని నివారించడానికి ఎవరు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు అనే దానిపై ఎలాంటి చర్చకు తావు లేదు.

ఇటీవల, ఈ ప్రమాదకరమైన ఆటలో ఒక కొత్త మలుపు చోటుచేసుకుంది. కన్నూర్‌లో ముస్లిం లీగ్ కార్యకర్త అరియిల్ శుక్కూర్, మరో ముస్లిం కార్యకర్త ఫైసల్ హత్యకు గురయ్యారు. ఈ విషయంలో సీపీఎం ఆర్ఎస్ఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, రెండు కేసుల్లోనూ జరిగిన విచారణలు సీపీఎం కార్యకర్తలనే దోషులుగా తేల్చాయి. ఇప్పుడు కమ్యూనిస్టులు కూడా తమ కార్యకర్తల ప్రత్యక్ష ప్రమేయాన్ని తప్పించి, దానికి బదులుగా వృత్తిపరమైన హంతకులను నియమించుకుంటున్నారు. రాష్ట్రంలోని ఇస్లామిస్టులతో పరోక్ష పొత్తు ద్వారా మతతత్వ రంగు పులిమే ధోరణి ఉంది. ఈ ధోరణి కొనసాగడమే 'దేవభూమి'కి అత్యంత తీవ్రమైన ముప్పు కావచ్చు.

**టి. సతీశన్, గణేష్ రాధాకృష్ణన్**
**(ఆర్గనైజర్ నుంచి)**

భాగం-37

మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# వ్యక్తివాద నియమాలు

**అర్థశాస్త్ర వికాసంలో వ్యక్తివాదం ప్రధాన పాత్ర పోషించింది. వ్యక్తివాదం ఆధారంగానే కార్మిక విప్లవం చెలరేగింది. వ్యక్తివాదంలో ప్రధానంగా ఏడు నియమాలున్నాయి. వాటిలో మొదటిది వ్యక్తిగత స్వార్థానికి చెందినది కాగా, రెండోది స్వేచ్ఛాయుత పోటీ నియమం.**

**వ్య**క్తివాదంలో రెండో నియమం స్వేచ్ఛాయుత పోటీ నియమం. దీని ప్రకారం వస్తువుల ధరలను ప్రభుత్వం అదుపు చేయకూడదు. రామరాజ్యవాదానికి చెందినవారి అభిప్రాయంలో, పై సిద్ధాంతం అమలు చేసేచోట అందరూ విద్యావంతులైతే కొంతమేరకు సబబే అని చెప్పాలి. ప్రపంచంలో ఎటుచూసినా స్వార్థం కోసం కపటాలు, మోసాలు సాగుతూనే ఉంటాయి. అలాంటి దశలో అవిద్యావంతులు, అజ్ఞానులకు నష్టం కలగవచ్చు. బేరం చేయడం కూడా అందరికీ రాదు. అంతేకాకుండా ప్రజ లందరూ ఒకేలా చేయడం కూడా సాధ్యం కాదు.

అంతేకాకుండా ప్రజలందరూ ఒకేలా క్రయ విక్రయాలకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉండరు. వజ్రం,మరకతం,పద్మరాగం వంటి మణులను గురించి- వాటి గుణాలను గురించిన విషయాలు అందరికీ తెలియవు. దానికి రత్నపరీక్షా శాస్త్రంలో ఆరితేరిన వారిని సంప్రదించాల్సిన అవసరం ఉంటుంది. అందువల్లనే మార్కెట్లలోని బోర్డులపై అందరూ అర్థం చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వమో, ప్రైవేటు వ్యక్తులో విభిన్న వస్తువుల ధరవరలు రాసి ఉంచుతారు. సామాన్య ప్రజల విజ్ఞానలోపం వల్ల దుష్పరిణామాలు కలగకుండా ఈ చర్యలన్నీ తీసుకుంటారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నిత్యావసరాల ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని కొంతవరకు నియంత్రణ అవసరం అవుతుంది.

పూర్తిస్థాయిలో ధరలను నియంత్రించడానికి ప్రభుత్వ దుకాణాలు కూడా తెరవాల్సి వస్తుంది. వేతనాలు వంటి వాటి విషయంలో పై సిద్ధాంతం కొంతమేరకు సమంజసమే అనిపిస్తుంది. యజమాని,సేవకుడు తమ పని ఆవశ్యకతలను అనుసరించి వేతన నిర్ణయం చేసుకోవచ్చు. అయినప్పటికీ నాగరిక సమాజంలో జీవన ప్రమాణాలను అనుసరించి వేతన పరిమితిని నిర్ధారించడం అవుతుంది. కొన్నికొన్నిసార్లు ఫలానా పనికి కనీస వేతనం ఎంత ఉండాలి అనే విషయంపై నియంత్రణ అవసరం. మరికొన్నిసార్లు వ్యక్తుల నైపుణ్యాలు, పని విధానాల ఆధారంగా కనీస వేతనం కంటే ఎక్కువ కూడా నిర్ణయించుకోవచ్చు.

అందువల్లనే, 'యుక్తి - కల్పతరువు' మొదలైన గ్రంథాలలో విభిన్నమణులు, రత్నాల గుణాలు, వాటి ధరలు వంటివన్నీ నిర్ణయించి గ్రంథస్థం చేశారు. వేతనాలకు సంబంధించి కూడా స్మృతి గ్రంథాలలో, 'సేవకుడు - యజమానుల మధ్య ఎటువంటి ఒప్పందం లేకుండానే పని చేసినా, చేయించుకున్నా పనికి వేతనం విషయంలో వివాదం తలెత్తినప్పుడు, న్యాయాలయాలను ఆశ్రయించాలి. వాటి ద్వారా వ్యవసాయం, పశుపాలన వంటి వాటి విషయంలో లాభంలో ఒక నిర్ణీత భాగాన్ని సేవకునికి వేతనంగా ఇప్పించాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు.

మరి ఇటువంటివన్నీ ప్రభుత్వాల ద్వారా కాకుండా ప్రైవేటు వ్యక్తుల ద్వారా జరగడం అనుచితమే కదా! ఈ ప్రపంచంలో రజోగుణం, తమోగుణం అత్యధికంగా కనిపిస్తూ ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో, 'దుర్లభో హి శుచిర్నరః'... పవిత్ర హృదయం కలిగిన వారు చాలా అరుదుగా లభ్యమవుతారు. అందువల్ల నియంత్రణ లేకుండా, అనేక రీతులుగా అణిచివేతలు కొనసాగుతూనే ఉంటాయి. పని చేసే ఎద్దులకు కూడా మన శాస్త్రాలలో పనిగంటలు కూడా నిర్ణయమయ్యాయి. వాటి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా యజమానికి ఉంటుంది. అటువంటప్పుడు ఎద్దకంటే ఉన్నతుడైన మానవుడనే ప్రాణిని గురించి ఏమని చెప్పాలి? నిక్కచ్చిగా శ్రామికునికి పని గంటల నియమం, తగు వేతనం ఏర్పాటు చేసే వ్యవస్థ రాజ్యాన్ని పాలించే ప్రభుత్వాల ద్వారా జరిగి తీరాల్సి ఉంది.

మూడవది జనాభా నియమం : 'జనాభా వృద్ధి ఎప్పుడూ రేఖాగణిత సూత్రం వలె రెట్టింపుగా 2 నుంచి 4కు (2X2) పెరుగుతుంది. కానీ ఉత్పాదన మాత్రం 2 తర్వాత 3 చొప్పున పెరుగుతుంది. ఈ నియమాన్ని కూడా మార్పులేనిదిగా భావించాలి. అందువల్ల జనాభా పెరుగుతున్న కొద్దీ వారికి సరిపడేంత ఆహార దినుసులు వగైరా వస్తువుల సంఖ్య పెరగని కాలం ఒకటి వస్తుంది. దాంతో చాలామంది ప్రజలు ఆకలితో మాడవలసి వస్తుంది. అప్పుడు కరవు, యుద్ధం, మహమ్మారులు సోకడం వంటివన్నీ జనాభా తగ్గేందుకు తాత్కాలిక పరిష్కారాలు అవుతాయి' అని జాన్ మిల్టన్ చెప్పాడు. వస్తుతః ఈ తర్కం ద్వారా పేదరికం అనేది ప్రాకృతికం అని, అనివార్యంగానూ చూపించి ఈ విషయంలో ప్రభుత్వాలు కలగ చేసుకోకపోవడాన్ని సమర్థించారు.

వాస్తవానికి ఇప్పటికాలంలో మిల్టన్ చెప్పిన సిద్ధాంతం ఖండనలకు గురి అవుతోంది. ఉత్పత్తి ప్రక్రియలో తగ్గుదల, పెరుగుదల అనేవి ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. తగు నియంత్రణ చర్యలు తీసుకోవడం ద్వారా ఉత్పత్తిని పెంచుకోవచ్చు. ఆహార ఉత్పత్తులను తగ్గించడం ద్వారా జనాభా సంఖ్యను తగ్గించుకోవాలనుకోవడం అమానవీయ చర్య. మనిషి పొడవును బట్టి మంచాన్ని పొడవు పెంచుకోవాలి కానీ, మంచం చిన్నదిగా ఉన్నది కదా అని మనిషి కాళ్లు నరికేయకూడదు. అది మానవీయ చర్య కాదు. సరిగ్గా ఇదే విధంగా ఉత్పాదనలు వృద్ధి చేయడం ద్వారానే సమస్యను తగ్గించడం సరైన పని అవుతుంది.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**

**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# లక్నో విశ్వవిద్యాలయంలో భగవద్గీత కోర్సులు




లక్నో విశ్వవిద్యాలయం శ్రీమద్ భగవద్గీత బోధనల స్ఫూర్తితో కొత్త వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టింది. ఇవి విద్యార్థులకు వారి సాధారణ విద్యాభ్యాసంతో పాటు జీవిత నిర్వహణ నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, నైతిక నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిత్వ వికాసం నేర్చుకోవడానికి సహాయపడతాయి.

ఈ కొత్త పాఠ్యప్రణాళికలో భాగంగా, "సంపూర్ణ శ్రేయస్సు కోసం శ్రీమద్ భగవద్గీత", "సమకాలీన సవాళ్లను ఎదుర్కోవడానికి శ్రీమద్ భగవద్గీత" అనే శీర్షికలతో వృత్తివిద్యా కోర్సులను చేర్చారు. భగవద్గీత కాలాతీత బోధనలు విద్యార్థులు ఒత్తిడి, అనిశ్చితి, పోటీ, ఆధునిక సవాళ్లను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సహాయపడతాయని లక్నో విశ్వవిద్యాలయ అధికారులు విశ్వసిస్తున్నారు. ఈ చొరవను సంపూర్ణ విద్యను ప్రోత్సహించే విస్తృత ప్రయత్నంలో భాగంగా చూస్తున్నారు. దీనిలో విద్యార్థులకు కేవలం విద్యాపరంగానే శిక్షణ ఇవ్వకుండా, వారిలో మానసిక బలం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, భావోద్వేగ తెలివితేటలను పెంపొందించడంలో కూడా మార్గనిర్దేశం చేస్తారు. ఈ కోర్సులు విషయాన్ని ఆధ్యాత్మిక లేదా ధార్మికపరమైన చర్చలకు పరిమితం చేయకుండా, గీతా బోధనలను రోజువారీ జీవితంలో ఆచరణాత్మకంగా ఎలా అన్వయించవచ్చునే దానిపై దృష్టి పెడతాయని భావిస్తున్నారు.

# నెదర్లాండ్స్ నుంచి చోళుల రాగి ఫలకాలు, శిల్పాలు



వలసవాద కాలంలో తీసుకువెళ్లిన చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన కళాఖండాలను తిరిగి ఇచ్చే ప్రక్రియలో ఒక కీలక ముందడుగుగా, నెదర్లాండ్స్ మే 16న 11వ శతాబ్దానికి చెందిన ఆనైమంగళం రాగి ఫలకాలను భారతదేశానికి అధికారికంగా అప్పగించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఐదు దేశాల దౌత్య పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌లో పర్యటిస్తున్న సమయంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఐరోపాలో లైడెన్ ప్లేట్స్ అని ప్రసిద్ధి చెందిన ఈ శాసనాలు, చోళుల కాలం నాటి అత్యంత విలువైన ఆధారాలలో ఒకటిగా ఉన్నాయి. ఒక శతాబ్దానికి పైగా డచ్ వారి సంరక్షణలో ఉన్నాయి. భారత ప్రభుత్వం, డచ్ అధికారులు, ఈ కళాఖండాలు భద్రపరచిన లైడెన్ విశ్వవిద్యాలయం మధ్య సంవత్సరాల తరబడి జరిగిన దౌత్య చర్చల ఫలితంగా వాటిని తిరిగి అప్పగించడం జరిగింది. సా.శ. 985-1014 మధ్య మొదటి రాజరాజ చోళుని పాలనా కాలానికి చెందిన ఈ రాగి శాసనాలు, ప్రస్తుత ఇండోనేషియాలోని శ్రీవిజయ రాజ్య పాలకుడైన శ్రీ మార విజయతుంగ వర్మన్ నాగపట్టణంలో స్థాపించిన బౌద్ధమతమైన చూడామణి విహారానికి భూమి శిస్తు, పన్నుల చెల్లింపులను నమోదు చేశాయి.

# వారణాసిలో వాటర్ మెట్రో

దేశవ్యాప్తంగా 18 నగరాల్లో వాటర్ మెట్రో రవాణా వ్యవస్థను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఒక ప్రణాళికపై పనిచేస్తోందని షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ మే 18న తెలిపింది. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ ప్రాజెక్టును దేశవ్యాప్తంగా ప్రారంభించే ముందు జాతీయ వాటర్ మెట్రో విధాన ముసాయిదాను అంతర్-మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కోసం సిద్ధం చేశారు. మొదటి దశలో శ్రీనగర్, పాట్నా, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లలో వాటర్ మెట్రోను ప్రారంభించాలని మంత్రిత్వ శాఖ యోచిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. రెండవ దశలో, అస్సాంలోని తేజ్‌పూర్, దిబ్రూగఢ్‌లకు వాటర్ మెట్రో రానుంది.






# పాఠశాలల్లో వందేమాతరం అనివార్యం

పశ్చిమ బెంగాల్ రాజకీయ రంగంలో, విద్యా వ్యవస్థలో జాతీయ చైతన్యం, సాంస్కృతిక గుర్తింపు విషయంలో ఒక ముఖ్యమైన మార్పు వచ్చింది. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ-సహాయక పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయకాల ప్రార్థన సమావేశాల సమయంలో "వందేమాతరం" గీతాన్ని ఆలపించడాన్ని ముఖ్యమంత్రి సువేందు అధికారి తప్పనిసరి చేశారు. మే 13న రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ జారీ చేసిన ఒక ఆదేశంలో ప్రతిరోజూ తరగతులు ప్రారంభమయ్యే ముందు జరిగే ఉదయపు అసెంబ్లీలలో విద్యార్థులు "వందేమాతరం" గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ-సహాయక పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయులకు, స్పష్టంగా సూచించింది.

కథ

# అభిమానవంతుడు

**వారణాసి భానుమూర్తి రావు**

నేనూ, రాఘవరెడ్డి చిన్ననాటి స్నేహితులం. ఒకటో తరగతి నుండి పదవ తరగతి దాకా ఒకే స్కూల్లో చదివినాము. కలిసి తిరిగి నాము. మా ఊరికి రెండు మైళ్ల దూరంలో రాఘవ రెడ్డి వారుండే పల్లె ఉండేది. స్కూలుకు ఇద్దరూ తోడుగా పోయి చదువు కొనే వాళ్లం.

రాఘవరెడ్డి పైచదువులు చదవడానికి ఆర్థిక స్థోమత లేక తండ్రికి చేదోడు వాదోడుగా సేద్యం మీద దృష్టి సారించాడు. ఉన్న పది ఎకరాలు మాగాణిని నమ్ముకుని జీవనం సాగించాడు. తండ్రి చెప్పినట్లుగా వ్యవసాయంలో మెలకువల్ని నేర్చుకుని మంచి రైతుగా పంటలు బాగా పండించసాగాడు.

పదో తరగతి తరువాత నేను వాయల్పాడులో ఇంటర్ చదివి మదనపల్లెలో గ్రాడ్యుయేషన్ చేసి టీచర్‌గా ఉద్యోగం సంపాదించాను. నా ఆనందానికి అవధుల్లేవు. మా నాయన ఒక కిరాణా కొట్టు నడిపేవాడు. కొన్ని రోజులు ఉత్తరాల ద్వారా రాఘవరెడ్డి క్షేమ సమాచారాలు కనుక్కునేవాడిని . ఆ తర్వాత నాకు ఉద్యోగ బాధ్యతలు, బదిలీల దృష్ట్యా చిత్తూరు జిల్లా అంతా వివిధ పాఠశాలల్లో పనిచేయాల్సి వచ్చింది. నా వివాహం తర్వాత పిల్లలు వారి చదువులు స్కూల్‌లో బాధ్యతలు ఇలా నా జీవితం నాలుగు దశాబ్దాలు గడిచిపోయింది. దాదాపు నేను రిటైరయ్యాక కూడా నాకు రాఘవరెడ్డి ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో అని తెలుసుకోవాల్సిన పరిస్థితి రాలేదు. ఒక ఉపాధ్యాయుడిగా నా జీవితం నాకు ఎంతో సంతృప్తి నిచ్చింది. రిటైరయ్యే సమయానికి నేను కూడా ప్రమోషన్ పొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యా యుడుగా ఒక ఐదారేళ్లు పని చేశాను.

నా కెందుకో ఈ మధ్య నా చిన్ననాటి స్నేహితుడు రాఘవరెడ్డిని చూడాలి అని నా మనసు తెగ ఆరాటపడుతోంది. మా బాల్య స్మృతులను తలుచుకుంటూ ప్రతిరోజు గడిపేవాడిని. రాత్రిపూట రాఘవరెడ్డి కలల్లో కనపడేవాడు. వాడిని చూడాలని తహతహలాడిపోయేది నా మనస్సు. నాకిప్పుడు డెబ్బయి ఏళ్లు. కాకతాళీయంగా ఇద్దరమూ ఒకే రోజు పుట్టాము . ఆ కాలంలో మాకు జన్మదిన పండగలు ఉండేవి కావు. ఇప్పటిలాగా ఆడంబరంగా పార్టీలు గట్రా చేసుకునే వాళ్లం కాదు. అసలు జన్మదినానికి అంత ప్రాముఖ్యత ఉండేది కాదు. పండగలప్పుడే కొత్త బట్టలు వేసుకునేవాళ్లం. జన్మదినం ఎప్పుడో గూడా కూడా మాకు తెలిసేది కాదు. అలా గడిచిపోయాయి ఆ రోజులు.

రిటైర్మెంట్ తర్వాత నేను నా శ్రీమతి మా కొడుకుతోనే ఉన్నాము. మా వాడు చాలా బుద్ధి మంతుడు. వాడు కూడా మదనపల్లె దగ్గర ఒక ఊర్లో గవర్నమెంట్ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నప్పట్నుండి వాడు చదువు మీద చాలా శ్రద్ధ చూపేవాడు. నాలాగే వాడికి ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. పిల్లలకు చదువు చెప్పి వాళ్లను ప్రయోజకులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి కంటే మించిన వృత్తి లేదంటాడు. ఒకప్పుడు బతకలేక బడిపంతులు అనేవారు. కానీ ఇప్పుడు అన్ని ఉద్యోగాల కన్నా బడి పంతుళ్లే హాయిగా ఉన్నారు. ఉద్యోగంలో తృప్తి, మంచి జీతాలు, సెలవులు. అంతే కాకుండా రిటైర్ అయిన తర్వాత కూడా మంచి పెన్షన్ వస్తోంది. జీవితం ఎలాంటి ఒత్తిడి లేకుండా జరిగిపోతోంది. బడి పిల్లలతో రోజంతా గడపడం వల్ల ఎంతో ఉల్లాసాన్ని , తృప్తిని ఇస్తుంది. ఈ రోజు పిల్లలే రేపటి బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో టీచర్ల బాధ్యత ఎంతో ఉన్నది. ఉపాధ్యాయులు సమాజానికి దివిటీలు వంటి వారు. నా కుమారుడు కూడా నా ఆశల్ని పుణికి పుచ్చుకున్నాడు. స్కూల్‌లో కూడా వాడికి మంచి టీచర్ అనే పేరు వచ్చింది. ఇంతకీ నా పేరు చెప్పనే లేదు కదూ! శ్రీనివాసులు. నా కుమారుడి పేరు రామాంజనేయులు.

నేను నా చిన్ననాటి స్నేహితుడ్ని చూడాలని వాడున్న ఊరికి పోయి తిరిగి వస్తానని ఇంట్లో వారికి చెప్పినాను. వాళ్లు సరే అన్నారు. ఒక రోజు ఉదయం. నేనొక్కడినే మా రాఘవరెడ్డి ఊరికి బస్సులో బయలు దేరాను. మదనపల్లికి ముప్పయి కిలోమీటర్ల దూరంలో వాడి పల్లె ఉంది. ఆ ఊరు చేరుకునే సరికి ఉదయం పదకొండు గంటలు దాటింది. ఆ పల్లెలోని వారిని అడిగి రాఘవరెడ్డి ఇల్లు చేరినాను.





పదంకణాల రాతి మిద్దె. ఇంటి ముందర తీగమల్లె చెట్టు వరండా మీదకు పాకి వుంది. అలాగే వేప చెట్టు ఇంకొక పక్క ఉన్నాయి. చల్లగా గాలి వీస్తోంది. ఇంటికి ముందర వరండా విశాలంగా ఉంది. ఒకమూల ధాన్యపు బస్తాలు పేర్చినారు. ఇంటికి ఎడమ వైపు పశువుల కొట్టం. కుడిచేతి వైపు ఇంకో కొట్టం. అక్కడ వంటలు చెయ్యడానికి మట్టి పొయ్యిలు. గడ్డితో కప్పిన కొట్టం అంతా మసితో నల్లగా మారింది. గోడలు కూడ మసి బారి నట్లున్నాయి. భోజనాలు చేయడానికి రెండు చెక్క బల్లలు, నాలుగు కుర్చీలు ఉన్నాయి. పాత పడిపోయి, పొగకు నల్లగా మసక బారిన ఫ్యాన్లు

తిరుగుతున్నాయి. ఇంటి ముందర తల్లి కోడితో పాటు పది కోడి పిల్లలు చిన్న చిన్న పురుగుల్ని ఏరుకొని తింటూ తిరుగుతున్నాయి. పశువుల కొట్టంలో తెల్లని బలిష్టమైన ఎద్దులు, రెండు మూడు ఆవులు మేత మేస్తున్నాయి. వాటి మెడలోనున్న గంటల శబ్దం వినబడుతోంది. ఒక ప్రక్కగా కుడితి నీరు తొట్టె ఉన్నది. ఇంటి వెనకాల దిబ్బ కనబడుతోంది. ఆ దిబ్బలో చెత్తా చెదారం వేస్తారు. అలాగే పశువుల కొట్టం శుభ్రం చేసినప్పుడు ఆ పేడా వగైరా అంతా దిబ్బలో వేసి కుళ్ల బెడతారు. అదే ఎరువుగా తయారయి చేలకు, మడులకు వాడుతారు.

'రాఘవ రెడ్డి ఉన్నాడా ?' అని అడిగాను. నన్ను పోల్చుకొంటాడో, లేదో అన్న సంశయంతో, మళ్లీ రాఘవరెడ్డీ అని పిలిచాను.

పూర్లోని పిల్లలు పది మంది నా వెనకాలే వచ్చి నన్ను ఏదో వింత మనిషిని చూసినట్లు చూస్తున్నారు. నాకేసి నవ్వుతూ నన్ను ఎగాదిగా చూస్తున్నారు. నా బ్యాగ్‌లోని పది చాక్లెట్లను తీసి పిల్లలందరికీ పంచి ఇచ్చాను..వారి ఆనందానికి అవధుల్లేవు. పిల్లలు తలా ఒకవైపు పరిగెత్తారు.

"నువ్వు... నువ్వు ఎవరు? ఎప్పుడూ నేను చూసినట్లు లేదే ?" అన్నాడు రాఘవరెడ్డి తన కళ్లద్దాలు తుడుచుకుంటూ.

లోపలికి రమ్మన్నట్లు సైగ చేశాడు. ఇంటి ముందర వరండాలో ఇద్దరమూ కూర్చున్నాము.

" నేనెవరో గుర్తుపట్టుకో – చూద్దాం!" అన్నాను నవ్వుతూ.

రాఘవరెడ్డిని చూడగానే నా అంతరంగం ఆనందడోలికల్లో మునిగిపోయింది. కళ్ల



నిండా ఆనందభాష్పాలు. వయసు మీద పడింది కదా ఇద్దరమూ గుర్తుపట్ట లేనంతగా శరీరంలో, ముఖంలో మార్పులు. నా జుట్టు తెల్లబడిపోయింది. పెంచిన గుబురు గడ్డం తెల్లగా ఉంది. నా ముఖంలో మడతలు ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. రాఘవరెడ్డి శరీరంలో కూడా వృద్ధాప్య ఛాయలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. అతని మీసాలు తెల్లగా మెరుస్తున్నాయి. జుట్టంతా ఊడిపోయి తెల్లని గుండు మెరుస్తోంది. ముతక బట్టలు వేసుకుని చేతికర్ర సాయంతో నన్ను ఎగాదిగా చూస్తూ పోల్చుకోలేక పోతున్నాడు.

అంతలో వాడు శ్రీమతి వంటింట్లోంచి బయటికొచ్చింది.

"నేను... నేను ... నన్ను గుర్తుపట్ట లేదా? అన్నాను నేను నవ్వుతూ.

వాడు తల అడ్డంగా ఊపాడు గుర్తుకు రాలేదంటూ.

"ఒరేయ్ ... రాఘవ! నేను రా... నీ బాల్య స్నేహితుడ్ని. శ్రీనివాసుల్ని" అన్నాను నేను వాడి చేయి పట్టుకుంటూ.

రాఘవరెడ్డి ఒక్కసారిగా చేతికర్ర వదిలి లేచి నన్ను గట్టిగా హత్తుకొని చిన్న పిల్లోడిలా ఏడ్చినాడు. నేను కూడా లేచి వాడ్ని ఆలింగనం చేసుకుని గట్టిగా హత్తుకొన్నాను. నాకు

వయసు మీద పడుతోంది కదా! ముగ్గురూ రత్నాల్లాంటి కొడుకుల్ని కన్నావు. ప్రయోజకుల్ని చేశావు. హాయిగా 'కృష్ణా! రామా !' అంటూ వారితో ఉండి మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకుంటూ శేష జీవితం గడపవచ్చు కదా? అన్నాను "ఒరే! శ్రీనివాసులు... ఈ పల్లెలో హాయిగా ప్రశాంత జీవితం గడుపుతున్నాను. నా పశువులతో కాలక్షేపం చేస్తున్నాను. పాడీపంట చూసుకొంటున్నాను. నాకు ఇక్కడ ఉన్న స్వేచ్ఛ, సంతృప్తి నా కొడుకులతో ఉంటే రాదు. వారి బాధ్యతలు, హడావిడి, ఉరుకుల పరుగుల జీవితం మనకు సరిపోదు.



గూడా ఏడుపు ఆగడం లేదు. జలజలమని కన్నీళ్లు జారి నా గుబురు గడ్డం మీద పడుతున్నాయి.

"శ్రీనివాసులు... నువ్వా? ఎన్ని రోజులు అయిందిరా నిన్ను చూసి... యాభై ఏళ్లు దాటిందను కొంటాను. అవునులే ! పెద్ద గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నావు. ఈ బీదరైతు బిడ్డను మర్చిపోయినావు" అన్నాడు రాఘవరెడ్డి. కళ్లలో వస్తున్న కన్నీటిని కండువాతో తుడుచుకున్నాడు.

"అబ్బే... అదేం లేదురా!" 'అని ఇద్దరమూ నులక మంచం మీద కూర్చుని ఒకరి నొకరు క్షేమ సమాచారాలు కనుకున్నాము.

రాఘవరెడ్డి సతీమణి వద్దన్నా భోజనానికి బలవంత పెట్టింది. రాగి సంగటి తిని ఎన్ని రోజుల య్యిందో? రాగిసంగటి, చేపల పులుసు, ఇంటి నెయ్యి,గడ్డ పెరుగుతో భోజనం ఇద్దరికీ వడ్డించింది.

రాఘవరెడ్డి చిన్న నాటి విషయాలు, మేము చేసిన అల్లరి గురించి అన్నీ చెప్పి నవ్వించాడు. అతని అన్ని విషయాలు ఎట్లా జ్ఞాపకం పెట్టుకొన్నాడో అని అనిపించింది.

భోజనాలయ్యాక, రాఘవరెడ్డి మూడు ఫొటో ఫ్రేములు, కొన్ని పెళ్లి ఆల్బములు నా ముందర తెచ్చిపెట్టాడు.

"వీడు నా పెద్ద కొడుకు కేశవ రెడ్డి. తిరుపతి కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వీడు నా రెండో కొడుకు. పేరు గురవారెడ్డి. హైదరాబాద్‌లో ఒక పెద్ద డాక్టర్. ఇక వీడు నా చిన్న కొడుకు. పేరు ధనుంజయరెడ్డి. ఉత్తరప్రదేశ్‌లో కలెక్టర్‌గా పని చేస్తున్నాడు."

ఆశ్చర్యపోయాను నేను.

ఒక రైతుగా ఇదే పల్లెలో భూమి తల్లిని నమ్ముకుని కొడుకుల్ని ఇంత ప్రయోజకుల్ని చేశాడు. అదెలా సాధ్యం? అనుకొన్నాను..

"కొడుకుల్ని ఇంత గొప్ప వాళ్లని చేశావు. ఎలారా? నేను నమ్మలేక పోతున్నాను." అన్నాను.

"అవునురా !నే నెట్లా చదువుకోలేకపోయాను. నా కొడుకుల్ని బాగా చదివించాలని రెక్కలు ముక్కలు చేసుకుని, ఈ సేద్యాన్ని, భూమి తల్లిని నమ్ముకుని చదివించినాను. వాళ్లు కూడా ఇక్కడే గురుకుల హైస్కూల్‌లో చేరి బుద్ధిగా చదువుకొన్నారు.

పెద్దోడికి లెక్చరర్ ఉద్యోగం వచ్చిన తరువాత, ఇద్దరు తమ్ముళ్లను చేరదీసి చదివించినాడు. రెండవవాడు ఎంబీబీఎస్ తిరుపతిలో గవర్నమెంటు కాలేజీలో మెరిట్ కోటాలో సీటు సంపాయించు కొన్నాడు. చిన్నోడిని ఐఏఎస్ చదవమని హైదరాబాద్ పంపాడు. పెద్దోడు తమ్ముళ్లని మంచి ప్రయోజకుల్ని చేసినాడు. అందరికీ పెళ్లిళ్లు అయిపోయినాయి. వారికి పిల్లలు కూడా!" చెప్పాడు రాఘవరెడ్డి.

'రాఘవా! నువ్వు నిజంగా అదృష్టవంతుడివిరా! మరి పిల్లలు అంత పెద్ద పెద్ద కొలువుల్లో ఉన్నారు కదా! మరి మీరెందుకు ఇక్కడ ఇన్ని కష్టాలు పడుతూ ఇలా ఇంకా ఈ పల్లెలోనే ఉన్నార్రా!" అని అడిగాను.

'నాకిష్టం లేదు రా! వాళ్లను ప్రయోజకులను చేయడమే మన బాధ్యత." అన్నాడు వాడు.

"వయసు మీద పడుతోంది కదా! ముగ్గురూ రత్నాల్లాంటి కొడుకుల్ని కన్నావు. ప్రయోజకుల్ని చేశావు. హాయిగా 'కృష్ణా! రామా !' అంటూ వారితో ఉండి మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకుంటూ శేష జీవితం గడపవచ్చు కదా? అన్నాను "ఒరే! శ్రీనివాసులు... ఈ పల్లెలో హాయిగా ప్రశాంత జీవితం గడుపుతున్నాను. నా పశువులతో కాలక్షేపం చేస్తున్నాను. పాడీపంట చూసుకొంటున్నాను. నాకు ఇక్కడ ఉన్న స్వేచ్ఛ, సంతృప్తి నా కొడుకులతో ఉంటే రాదు. వారి బాధ్యతలు, హడావిడి, ఉరుకుల పరుగుల జీవితం మనకు సరిపోదు. మనం అక్కడ ఇమడలేము. ప్రభుత్వం వారు వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నారు. మా భూముల్లో పండే ధాన్యం, కూరగాయలు మాకు తినడానికి సరిపోతాయి. ఇంకా మా పిల్లోళ్లకు కూడా ధాన్యం పంపిస్తాను. పాలు డెయిరీ ఫామ్‌కు అమ్ముతాను. నెలకు పది, పదిహేను వేలు వస్తుంది. ఇంకా మాకు డబ్బులతో పనేముందిరా? నా పల్లె తల్లి నాకు అన్నీ ఇచ్చింది. తాతముత్తాతలు ఇచ్చిన ఆస్తిని,నా పల్లె తల్లిని వదిలి ఎక్కడికి పోను. నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకు ఇక్కడే ఉంటాను. ఇక్కడే చస్తాను" అన్నాడు రాఘవరెడ్డి.

వాడి ఆత్మాభిమానానికి, ఆత్మస్థైర్యానికి వాడి పాదాలకు నమస్కరించాలి అనిపించింది. తను ఈ విషయంలో చాలా తప్పు చేశాడు. రిటైర్ అయిన వెంటనే తన హక్కని కొడుకు దగ్గరికి వెళ్లిపోయాడు. అన్ని విషయాలకు కొడుకు మీద ఆధార పడిపోయాడు. తల్లీతండ్రీ తమకి ఒంట్లో శక్తి ఉన్నంత వరకు తమ పనులు తాము నిర్వర్తించుకోవాలి. కొడుకుల మీద పొలోమని పడిపోయి వారికి ఇబ్బంది కలిగించ కూడదు. వీలైతే వారికి చేదోడు వాదోడుగా ఉంటూ ఆర్థికంగా, భౌతికంగా వారికి సహాయం చేయాలి. వారి వెన్నంటే ఉండి వారికి సలహాలు ఇస్తూ, ధైర్యం చెబుతూ వారి పిల్లల్ని కూడా ప్రయోజకులుగా చేయాలి.

నా అంతరంగంలో పరిపరి విధాల పోతున్నాయి ఆలోచనలు. ఎదురుగా ఉన్న రాఘవ రెడ్డి నిలువెత్తు ఆత్మాభిమానం కలిగిన అపురూప వ్యక్తిగా నాకు కనపడ్డాడు. మళ్లీ ఒక్కసారి రాఘవరెడ్డిని గట్టిగా హత్తుకొని ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ బరువెక్కిన హృదయంతో వీడ్కోలు చెబుతూ తిరుగు ప్రయాణమయ్యాను. ★






# ఐపీఎల్‌లో 'విరాట్ పర్వం'!

**ఐపీఎల్‌లో భారత క్రికెట్ ఆధునిక దిగ్గజం విరాట్ కోహ్లీ తనకే సాధ్యమైన, సొంతమైన పలు రికార్డులతో అలరిస్తున్నాడు. పట్టుదల, అంకితభావం, తపన ఉంటే ధూమ్‌ధామ్ టీ-20 క్రికెట్లో రాణించడానికి వయసు ఏమాత్రం అవరోధం కాదని తన ఆటతీరుతో చాటి చెప్పాడు.**

విరాట్ కోహ్లీ...భారత, ప్రపంచ క్రికెట్ అభిమానులకు ఏమాత్రం పరిచయం అవసరం లేని పేరు. ఐదురోజుల సాంప్రదాయ టెస్టు, ఒక్కరోజులో ముగిసిపోయే యాభైఓవర్ల వన్డే, కొద్ది గంటల్లో ముగిసిపోయే ధూమ్‌ధామ్ టీ-20 క్రికెట్..ఇలా ఫార్మాట్ ఏదైనా తనకుతానే సాటిగా నిలుస్తూ 37 సంవత్సరాల వయసులోనూ ఘాటైన బ్యాటింగ్ రికార్డుల మోత మోగిస్తున్నాడు. ప్రస్తుత 19వ సీజన్ (2026) ఐపీఎల్ మొదటి 58 మ్యాచ్‌లు ముగిసే సమయానికి ఓ మెరుపు శతకంతో పలు అరుదైన ఘనతలను తన పేరుతో లిఖించుకొన్నాడు.

### 2008 నుంచి 2026 వరకూ.....

2008లో ప్రారంభమైన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బెంగళూరు (రాయల్ చాలెంజర్స్) ఫ్రాంచైజీకి గత 19 సీజన్లుగా ప్రాతినిథ్యం వహిస్తున్న విరాట్ అత్యంత నిలకడగా రాణిస్తూ తన ప్రత్యేకతను కాపాడుకొంటున్నాడు. ఒకటి కాదు..రెండు కాదు.. ఏకంగా గత 19 సీజన్లుగా ఒకే తీరుగా రాణించడం అంటే మాటలు కాదు. ఏడాదికి సగటున 14 నుంచి 16 మ్యాచ్ ల వరకూ ఆడుతూ ..సీజన్ కు 400కు పైగా పరుగులు సాధిస్తున్న ఏకైక బ్యాటర్ కోహ్లీ మాత్రమే.

18 సంవత్సరాల వయసులో ఐపీఎల్ అరంగేట్రం చేసి ఐపీఎల్ ట్రోఫీ అందుకోడానికి 17 సంవత్సరాలపాటు నిరీక్షించాల్సి వచ్చింది. గత సీజన్లో బెంగళూరు జట్టు విజేతగా నిలవడంలో ప్రధానపాత్ర వహించి ప్రస్తుత సీజన్లోనూ అదే దూకుడు కొనసాగిస్తున్నాడు..

### 10 శతకాల ఒకే ఒక్కడు...!

రాయపూర్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రత్యర్థిగా జరిగిన డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో విశ్వరూపమే ప్రదర్శించాడు. ఆడిన గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్లతో వెనుదిరిగిన విరాట్ చావో బతుకో అన్నట్లుగా ఆడి అజేయ శతకంతో తన జట్టుకు కీలక విజయం అందించడంతో పాటు ప్లే-ఆఫ్ రౌండ్‌లో చోటు ఖాయం చేశాడు. కేవలం 60 బంతుల్లోనే 105 పరుగుల నాటౌట్ స్కోరుతో' ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకొన్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక శతకాలు సాధించిన బ్యాటర్‌గా.. టీ-20 ఫార్మాట్లో అత్యధిక శతకాలు నమోదు చేసిన బ్యాటర్ల వరుసలో మూడవ వాడిగా నిలిచాడు. టీ-20 చరిత్రలో అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్ రికార్డు కరీబియన్ థండర్ క్రిస్ గేల్ పేరుతో ఉంది. గేల్ మొత్తం 22 శతకాలతో అగ్రస్థానంలో నిలిస్తే.. పాక్ కెప్టెన్ బాబర్ అజామ్ 13 శతకాలతో రెండు, విరాట్ కోహ్లీ 10 శతకాలతో, డేవిడ్ వార్నర్ 10 శతకాలతో సంయుక్త మూడోస్థానంలో కొనసాగు తున్నారు. కోల్‌కతా ప్రత్యర్థిగా రెండు శతకాలు సాధించిన ఘనతను సైతం విరాట్ సాధించాడు, ప్రత్యర్థిజట్టు తమ ఎదుట ఉంచిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అత్యధికంగా మూడు శతకాలు సాధించిన ఇద్దరు బ్యాటర్లలో సైతం చేరాడు. విరాట్, జోస్ బట్లర్ ఛేజింగ్‌లో చెరో మూడు శతకాలు సాధించిన బ్యాటర్లుగా ఉన్నారు.

2019 సీజన్లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ పై 58 బంతుల్లో 100 పరుగులు సాధించిచాడు..

### అత్యంత వేగంగా 14,000 పరుగుల రికార్డు..

టీ-20 ఫార్మాట్లో అత్యంత వేగంగా 14 వేల పరుగుల మైలురాయిని చేరిన తొలి బ్యాటర్ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఇప్పటి వరకూ క్రిస్ గేల్ పేరుతో ఉన్న ప్రపంచ (423 ఇన్నింగ్స్‌లో 14వేల పరుగుల)రికార్డును కేవలం 409 ఇన్నింగ్స్ లోనే అందుకొని వారేవ్వా అనిపించుకొన్నాడు.

ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికంగా 279 మ్యాచ్‌లు ఆడటం ద్వారా మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మల పేరుతో ఉన్న 278 మ్యాచ్‌ల రికార్డును రాయపూర్ గడ్డపై తిరగరాశాడు. 279 ఐపీఎల్ మ్యాచ్ లు ఆడిన తొలి ఆటగాడిగా రికార్డుల్లో చేరాడు.

చెన్నై సూపర్ కింగ్స్ ప్రత్యర్థిగా ఇప్పటివరకూ ఆడిన మ్యాచ్‌ల్లో 1174, ఢిల్లీ క్యాపిటల్స్‌పైన 1172, పంజాబ్‌కింగ్స్‌పైన 1159 పరుగులు సాధించి.. కోల్‌కతాపైన సైతం 1126 పరుగులతో తన సత్తా చాటుకోగలిగాడు.

### 21 ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుల రికార్డు...

ఐపీఎల్ 19 సీజన్ల చరిత్రలో 21సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొన్న రెండో భారత ఆటగాడిగా, నాలుగో క్రికెటర్‌గా విరాట్ రికార్డుల్లో చోటు సంపాదించాడు. అందుకొన్న విరాట్ 'ఆరెంజ్ క్యాప్ రేస్'లోనూ ముందు వరుసలో నిలిచాడు. మొత్తం 279 మ్యాచ్‌ల్లో 21వసారి అత్యుత్తమ ఆటగాడిగా నిలిస్తే.. మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ 278 మ్యాచ్‌ల్లో 21సార్లు చొప్పున ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు విజేతలుగా నిలిచారు..

### రిటైర్మెంట్ ఆలోచనలో విరాట్...

క్రికెట్ అంటే తనకు పంచప్రాణాలుగా చెప్పుకొనే విరాట వచ్చే ఏడాది 2027 వన్డే ప్రపంచకప్‌తో క్రికెట్‌కు పూర్తి రిటైర్మెంట్ ప్రకటించాలన్న లక్ష్యంతో తన ప్రస్థానం కొనసాగించే ఆలోచనలో ఉన్నాడు. భారతజట్టు సభ్యుడిగా ఇప్పటికే అండర్-19 ప్రపంచకప్‌తో పాటు 2011 వన్డే ప్రపంచకప్, 2024, 2026 టీ-20 ప్రపంచకప్‌లు అందుకొన్న రికార్డు ఉంది. భారత గడ్డపై గత 19 సీజన్లుగా జరుగుతున్న ఐపీఎల్‌లో ఆడుతూ వస్తున్న విరాట్ పలు అరుదైన, అసాధారణ రికార్డులతో ఆ లీగ్ కే చిరునామాగా నిలవటం అపూర్వమనటంలో ఏ మాత్రం సందేహం లేదు.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969



**జగిత్యాల :** కోరుట్లలోని ఐలాపూర్ దర్వాజా బస్తీలో జరిగిన హిందూ సమ్మేళనంలో బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ఆశీఃప్రసంగం చేశారు. మచ్చ జ్యోత్స్న శశిధర్, ఆయాచితుల లక్ష్మణ్‌రావు ప్రసంగించారు. 980మంది పాల్గొన్నారు.





**వికారాబాద్:** మే 13న శంకర్‌పల్లి సామాజిక సమరసత ఆధ్వర్యంలో 9 పేద జంటలకు బద్దం జ్యోతిరెడ్డి గార్డెన్‌లో వివాహాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వనవాసి కళ్యాణ ఆశ్రమం అఖిల భారత సభ్యులు రాంచంద్రయ్య ప్రసంగిస్తూ సమాజంలో అసమానతలు తొలగించడంలో ఇలాంటివి ప్రధాన పాత్ర పోషిస్తాయని ప్రశంసించారు. హిందూబంధువులందరం దేశానికి సారథులమని అన్నారు. సమరసతా ప్రాంత మహిళా కన్వీనర్ రుక్మిణి, ప్రాంత ధర్మాచార్య సహప్రముఖ్ అజయ్‌శర్మ, సమరసతా పాలమూరు జిల్లా ఉపాధ్యక్షులు పాపిరెడ్డి దామోదర్ రెడ్డి, శంకర్‌పల్లి కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

**నిర్మల్ :** మామడ మండలం, పొన్కల్ గ్రామంలో జరిగిన హిందూ సమ్మేళనంలో శ్రీశ్రీశ్రీ హరాచారి నారాయణ స్వామీజీ, ఇందూర్ విభాగ్ పర్యావరణ ప్రముఖ్ వకుళాభరణం రాంనరేష్, హిందూ సమ్మేళన కమిటీ అధ్యక్షులు బిచ్చల వినోద్ పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి వేదికపై వచ్చి గ్రామస్తులందరిచేత ప్లాస్టిక్ నిషేధాన్ని సంపూర్ణంగా అమలుచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మరుసటి రోజు నుంచి బట్టసంచులు వాడుతున్నారు. స్టీల్ (ప్లేట్, గ్లాస్) బ్యాంక్ ఏర్పాటు చేసుకున్నారు.








**భాగ్యనగర్:** ఇతిహాస సంకలన సమితి, హిందూ స్పిరిచ్యువల్ అండ్ సర్వీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'భారత నాగరికతలో గోవు, చరిత్రలో గోవు, శాస్త్రీయ పరిశోధనలో గోవు పాత్ర' అనే అంశం మీద మే 17న జాతీయ స్థాయి సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఇతిహాసన సంకలన సమితి తెలంగాణ అధ్యక్షులు ఆచార్య కిషన్‌రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వారణాసి విశ్వవిద్యాలయం నుంచి గురుప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ ఎం.ఎం.రావు ప్రసంగించారు. మాన్‌సింగ్ సునీల్, విహెచ్‌పీ కేంద్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ ఆకారపు కేశవరాజు, యాదగిరిరావు, సాయి వరప్రసాద్, రామ్మూర్తి, వీరేందర్, ఇందుశేఖర్‌లతోపాటు 200 మంది పాల్గొన్నారు.



క్షేత్రసంఘచాలక్ డా॥ వామన శనై, ప్రాంత సంఘచాలక్ హరికుమార్‌రెడ్డి, వర్గ సర్వాధికారి కొత్తపల్లి అప్పాజీ, ముఖ్యఅతిథి రామచంద్రరాజు, రామారావు

# విపత్తులలో ముందుండేది సంఘమే

దేశం, ధర్మం కోసం నిరంతరం పాటుబడుతున్న సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అని, భూకంపాలు, వరదలు, అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతివిపత్తుల సమయంలో ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థగా నిలుస్తున్నదని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామచంద్రరాజు కొనియాడారు. మే 15వ తేదీన సంఘశిక్షావర్గ ప్రథమవర్ష సార్వజనికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలోని ఇతర సంస్థలు ప్రమాదాలు జరిగినపుడు ఆలస్యంగా స్పందించినా, ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం సంక్షోభ సమయాల్లో తక్షణమే ప్రజలను ఆదుకుంటుందని, ఈ విషయాన్ని తాను 1977లో కృష్ణాజిల్లాలో సంభవించిన దివిసీమ ఉప్పెనలో ప్రత్యేక్షంగా గమనించానని అన్నారు.

ఈ ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్ బౌద్ధిక్ ప్రముఖ్ కొండపల్లి రామారావు ప్రసంగిస్తూ సంపూర్ణ హిందూ సమాజాన్ని సంఘటితం చేయడమే సంఘ లక్ష్యమని తెలిపారు. ఈ దేశం కొరకు పని చేయడం త్యాగం కాదు, ఉపకారం కూడా కాదు. సంపూర్ణ హిందూ సమాజం బాధ్యతతో దేశం కొరకు సంఘటితం కావాలి. ప్రపంచంలోని చరాచర సృష్టికళ్యాణం కోసం, జీవన విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడం కోసం సంఘం పనిచేస్తుంది. ప్రస్తుతం ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ప్రపంచంలో సమగ్ర అభివృద్ధి లేదు. మనిషి భోగం అనుభవిస్తూ భూసారాన్ని, గాలిని, పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్నాడు. ఇది సమగ్ర, సంతులిత, సర్వతోముఖాభివృద్ధి కాదు. కేవలం ఎకానమీ కోసం చూస్తే మిగతావి నాశనమవుతాయి. భారతదేశం 2047 నాటికి ప్రపంచానికి ఉత్తమ నమూనా చూపించే ప్రయత్నం చేస్తుంది. దీనికొరకు సంఘ పని శీఘ్రంగా పెరగాలి. గ్రామగ్రామాన శాఖలు ప్రారంభం కావాలి. ఒక గంట సంఘ శాఖలో పొందిన గుణాలను మన ఇంట్లో, పనిచేస్తున్న స్థలంలో, మనం ఉంటున్న గ్రామంలో ప్రకటితమయ్యేలా ఉండాలి. సంవత్సరానికి కనీసం 10మంది కొత్త వ్యక్తులను స్వయంసేవక్‌లుగా చేయాలి. సంఘ ప్రభావంతో సమాజంలోని ప్రజలు జీవన విలువల ఆధారంగా ఉన్నట్లయితే దేశము వైభవాన్ని సాధిస్తుంది. ఇదే సంఘం కోరుకుంటున్నది. ఉజ్వల భవిష్యత్తుకై ప్రతి స్వయంసేవక్ నడుం కట్టి కదం కదం కలపాలి. మనం విజయం సాధించాలని, దానికి భగవంతుడు ఆ శక్తి, బుద్ధి ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

విజయవాడ సమీపంలోని నూతక్కిలోని విజ్ఞానవిహార స్కూల్‌లో మే 1 నుంచి 15 వరకు ఆంధ్రప్రదేశ్ సంఘశిక్షావర్గ ప్రథమవర్ష జరిగింది. ఇందులో 25 జిల్లాలనుండి 230మంది శిక్షణ పొందారు. ఇదే ప్రాంగణంలో జరిగిన విశేష ప్రథమవర్షలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 107 మంది శిక్షణ పొందారు. చుట్టుపక్కల గ్రామాల నుండి హిందూ బంధువులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షార్థులు ప్రదర్శించిన శారీరక్ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ వర్గకు సర్వాధికారిగా కొత్తపల్లి వెంకట సుబ్రహ్మణ్య అప్పాజీ వ్యవహరించారు. ఈ 15 రోజుల శిక్షణలో పాఠశాల నిర్వహణ, గోశాల నిర్వహణ మొదలగు ప్రాజెక్టు రిపోర్టు తయారుచేయడం ద్వారా శిక్షార్థుల నైపుణ్యం పెరిగింది. మంగళగిరిలో జరిగిన పథసంచలన్‌కు విశేషణ ఆదరణ లభించింది.



# ఏడు కూజాల రహస్యం | కథ



అనగనగా ఒక సుసంపన్నమైన రాజ్యం. ఆ రాజ్యానికి రాజు మహేంద్రవర్మ. అతడి ఖజానాలో అపారమైన సంపద ఉన్నప్పటికీ, ఏదో తెలియని వెలితి అతడిని వేధిస్తూ ఉండేది. ఎంత ఉన్నా ఇంకా కావాలనే తపన అతడిలో పెరిగిపోయింది.

ఒకరోజు వేట నిమిత్తం అడవికి వెళ్లిన రాజు, అలసిపోయి ఒక పెద్ద మర్రిచెట్టు కింద నిద్రపోయాడు. ఆ నిద్రలో అతడికి ఒక వింత కల వచ్చింది. ఒక దేవత ప్రత్యక్షమై, “రాజా! నీ కోరిక తీర్చడానికి ఏడు బంగారు కూజాలను ఇస్తున్నాను, అవి నీ అదృష్టాన్ని మారుస్తాయి” అని చెప్పి మాయమైపోయింది.

రాజు ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసేసరికి, ఆశ్చర్యంగా అక్కడ ఏడు భారీ బంగారు కూజాలు ధగధగ మెరుస్తూ కనిపించాయి. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన రాజు, వాటిని పరీక్షించాడు. మొదటి ఆరు కూజాలు అంచు వరకు బంగారు నాణేలతో నిండి ఉన్నాయి. కానీ, ఏడవ కూజా మాత్రం సగం వరకు మాత్రమే నిండి ఉంది. ఆ ఏడవ కూజాను కూడా నింపాలనే కోరిక రాజులో బలంగా కలిగింది. వెంటనే వాటిని అంతఃపురానికి తరలించి, తన సొంత నగలను, రత్నాలను అందులో పోశాడు. కానీ విచిత్రం! కూజా అంగుళం కూడా పైకి రాలేదు. ఒక రోజు ఆదాయం పోశాడు.. నిండలేదు. ఒక నెల ఆదాయం ధారబోశాడు.. అలాగే ఉంది. సంవత్సరం మొత్తం సంపాదన వేసినా, ఆ కూజా ఏమాత్రం నిండకుండా వెక్కిరిస్తున్నట్లు కనిపించింది.

చివరికి రాజు ఆవేశంతో, రాజ్యంలో ప్రజల వద్ద ఉన్న సంపదను కూడా తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇది గమనించిన బుద్ధిమంతుడైన మంత్రి, రాజు దగ్గరకు వచ్చి వినయంగా ఇలా అన్నాడు: “మహారాజా! క్షమించండి. మీరు ఎన్ని జన్మల సంపదను పోసినా ఆ ఏడవ కూజా నిండదు. ఎందుకంటే అది మట్టితో చేసినది కాదు.. అది మానవ ఆశతో నిండిన మనసు వంటిది. మనిషి కోరికలకు అంతు ఉండదు. ఒకటి దొరికితే మరొకటి కావాలనే ఆశ ఆ కూజాను ఎప్పటికీ ఖాళీగానే ఉంచుతుంది. ఈ ఆరు కూజాలు మీకున్న సంపదకు చిహ్నం అయితే, ఆ ఏడవ కూజా మీలోని అసంతృప్తికి చిహ్నం.”

మంత్రి మాటలతో రాజు కళ్లు తెరిచాడు. బయట ఉన్న వస్తువులతో లోపల ఉన్న వెలితిని పూడ్చలేమని గ్రహించాడు. వెంటనే ఆ ఏడు కూజాలను వదిలేసి, తనకున్న దానితో తృప్తిగా జీవిస్తూ, ప్రజారంజకమైన పాలన సాగించడం మొదలుపెట్టాడు. ★

## మంచిమాట

**అర్థరహితమైన మాటల కంటే**
**అర్థవంతమైన నిశ్శబ్దం చాలా గొప్పది**

## మెదడుకు మేత

**ఎంత ప్రయత్నించినా చేతికి చిక్కదు,**
**ముక్కుకి మాత్రమే దొరుకుతుంది..**
**ఏమిటది?**

జవాబు : వాసన

## పద్యం

**మృగ మదంబుచూడ మీద నల్లగనుండు**
**పరిఢవిల్లు దాని పరిమళంబు**
**గురువులైన వారి గుణము లీలాగురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**భావం :** కస్తూరి చూడటానికి నల్లగా ఉన్నప్పటికీ, దాని సువాసన అంతటా వ్యాపిస్తుంది. ఆ రీతిగానే మంచివారి గుణాలు పైకి గొప్పగా కనిపించకపోయినా అంతటా వ్యాపిస్తాయి.

## శ్లోకం

**జన్మాంతర కృతం పాపం వ్యాధిరూపేణ బాధతే**
**తచ్ఛాంతి రౌషధైః దానైః జప హోమసురార్చనైః**

**భావం :** జన్మాంతరంలోని పాపమే ఈ జన్మలో రోగాల రూపంలో బాధిస్తుంది. ఔషధాలు, దానాలు, జపహోమాలతో పాటు భగవంతుడిని అర్చించడం వల్ల దాని నుంచి ఉపశాంతి పొందవచ్చు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తీరము | ఇంతి |
| స్త్రీ | దరి |
| పంక్తి | సాయం |
| వర్ణము | బంతి |
| సహాయం | వన్నె |

జవాబులు : తీరము–దరి, స్త్రీ–ఇంతి, పంక్తి–బంతి, వర్ణము–వన్నె, సహాయం–సాయం.

# ఏడు కూజాల రహస్యం | కథ



అనగనగా ఒక సుసంపన్నమైన రాజ్యం. ఆ రాజ్యానికి రాజు మహేంద్రవర్మ. అతడి ఖజానాలో అపారమైన సంపద ఉన్నప్పటికీ, ఏదో తెలియని వెలితి అతడిని వేధిస్తూ ఉండేది. ఎంత ఉన్నా ఇంకా కావాలనే తపన అతడిలో పెరిగిపోయింది.

ఒకరోజు వేట నిమిత్తం అడవికి వెళ్లిన రాజు, అలసిపోయి ఒక పెద్ద మర్రిచెట్టు కింద నిద్రపోయాడు. ఆ నిద్రలో అతడికి ఒక వింత కల వచ్చింది. ఒక దేవత ప్రత్యక్షమై, "రాజా! నీ కోరిక తీర్చడానికి ఏడు బంగారు కూజాలను ఇస్తున్నాను, అవి నీ అదృష్టాన్ని మారుస్తాయి" అని చెప్పి మాయమైపోయింది.

రాజు ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసేసరికి, ఆశ్చర్యంగా అక్కడ ఏడు భారీ బంగారు కూజాలు ధగధగ మెరుస్తూ కనిపించాయి. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన రాజు, వాటిని పరీక్షించాడు. మొదటి ఆరు కూజాలు అంచు వరకు బంగారు నాణేలతో నిండి ఉన్నాయి. కానీ, ఏడవ కూజా మాత్రం సగం వరకు మాత్రమే నిండి ఉంది. ఆ ఏడవ కూజాను కూడా నింపాలనే కోరిక రాజులో బలంగా కలిగింది. వెంటనే వాటిని అంతఃపురానికి తరలించి, తన సొంత నగలను, రత్నాలను అందులో పోశాడు. కానీ విచిత్రం! కూజా అంగుళం కూడా పైకి రాలేదు. ఒక రోజు ఆదాయం పోశాడు.. నిండలేదు. ఒక నెల ఆదాయం ధారబోశాడు.. అలాగే ఉంది. సంవత్సరం మొత్తం సంపాదన వేసినా, ఆ కూజా ఏమాత్రం నిండకుండా వెక్కిరిస్తున్నట్లు కనిపించింది.

చివరికి రాజు ఆవేశంతో, రాజ్యంలో ప్రజల వద్ద ఉన్న సంపదను కూడా తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇది గమనించిన బుద్ధిమంతుడైన మంత్రి, రాజు దగ్గరకు వచ్చి వినయంగా ఇలా అన్నాడు: "మహారాజా! క్షమించండి. మీరు ఎన్ని జన్మల సంపదను పోసినా ఆ ఏడవ కూజా నిండదు. ఎందుకంటే అది మట్టితో చేసినది కాదు.. అది మానవ ఆశతో నిండిన మనసు వంటిది. మనిషి కోరికలకు అంతు ఉండదు. ఒకటి దొరికితే మరొకటి కావాలనే ఆశ ఆ కూజాను ఎప్పటికీ ఖాళీగానే ఉంచుతుంది. ఈ ఆరు కూజాలు మీకున్న సంపదకు చిహ్నం అయితే, ఆ ఏడవ కూజా మీలోని అసంతృప్తికి చిహ్నం."

మంత్రి మాటలతో రాజు కళ్లు తెరిచాడు. బయట ఉన్న వస్తువులతో లోపల ఉన్న వెలితిని పూడ్చలేమని గ్రహించాడు. వెంటనే ఆ ఏడు కూజాలను వదిలేసి, తనకున్న దానితో తృప్తిగా జీవిస్తూ, ప్రజారంజకమైన పాలన సాగించడం మొదలుపెట్టాడు. ★

## మంచిమాట

అర్థరహితమైన మాటల కంటే
అర్థవంతమైన నిశ్శబ్దం చాలా గొప్పది

## మెదడుకు మేత

ఎంత ప్రయత్నించినా చేతికి చిక్కదు,
ముక్కుకి మాత్రమే దొరుకుతుంది..
ఏమిటది?

జవాబు : వాసన

## పద్యం

మృగ మదంబుచూడ మీద నల్లగనుండు
పరిఢవిల్లు దాని పరిమళంబు
గురువులైన వారి గుణము లీలాగురా
విశ్వదాభిరామ వినురవేమ.

**భావం :** కస్తూరి చూడటానికి నల్లగా ఉన్నప్పటికీ, దాని సువాసన అంతటా వ్యాపిస్తుంది. ఆ రీతిగనే మంచివారి గుణాలు పైకి గొప్పగా కనిపించకపోయినా అంతటా వ్యాపిస్తాయి.

## శ్లోకం

జన్మాంతర కృతం పాపం వ్యాధిరూపేణ బాధతే
తచ్ఛాంతి రౌషధైః దానైః జమ హోమసురైర్చనైః

**భావం :** జన్మాంతరంలోని పాపమే ఈ జన్మలో రోగాల రూపంలో బాధిస్తుంది. ఔషధాలు, దానాలు, జపహోమాలతో పాటు భగవంతుడిని అర్చించడం వల్ల దాని నుంచి ఉపశాంతి పొందవచ్చు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తీరము | ఇంతి |
| స్త్రీ | దరి |
| పంక్తి | సాయం |
| వర్ణము | బంతి |
| సహాయం | వన్నె |

జవాబులు : తీరము–దరి, స్త్రీ–ఇంతి, పంక్తి–బంతి, వర్ణము–వన్నె, సహాయం–సాయం.

# వారఫలాలు

25-31 మే 2026



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

పరిచయాలు పెరుగుతాయి. కాంట్రాక్టులు పొందుతారు. ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. విద్యార్థులు, నిరుద్యోగులకు కొంత ఊరట లభిస్తుంది. ఇంటి నిర్మాణయత్నాలు ఎట్టకేలకు ఫలిస్తాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు రాగలవు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు పట్టుదల పెరుగుతుంది. 25,26 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఇంతకాలం వేధించిన సమస్య నుంచి బయట పడతారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యతిరేక వర్గీయులు అనుకూలంగా మారతారు. వ్యాపారులకు లావాదేవీలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు అనుకూల పరిస్థితులు ఉంటాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు క్లిష్టమైన వివాదాలు తీరతాయి. 26,27 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం, ఔషధసేవనం. చోరభయం. గణపతికి అర్చన చేయించుకుంటే మంచిది.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అనూహ్యమైన రీతిలో కార్యక్రమాలు పూర్తి చేస్తారు. గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం. రాబడి పెరుగుతుంది. వ్యాపారులు కొన్ని ఆటుపోట్లు అధిగమిస్తారు. ఉద్యోగులకు విధులు ప్రశాంతంగా జరుగుతాయి. రాజకీయవేత్తలు,రచయితలకు శుభవార్తలు అందుతాయి. 28, 29 తేదీలలో దూరప్రయాణాలు. ధనవ్యయం. కుటుంబసభ్యులతో తగాదాలు. అంగారకస్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఒక సంఘటన కొంత కలవరపరుస్తుంది. బంధువులతో తగాదాలు. ఆరోగ్యపరంగా చికాకులు. విలువైన వస్తుసామగ్రి జాగ్రత్తగా చూసుకోండి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభాలు కష్టంపై రావచ్చు. ఉద్యోగులకు మార్పులు తథ్యం. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు నిరుత్సాహమే. 27, 28 తేదీల్లో ఆకస్మిక ధనలాభం, ప్రముఖులతో పరిచయాలు. ఆంజనేయునికి అర్చన చేయించుకుంటే మంచిది.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

శత్రువులను కూడా ఆకట్టుకుని మరింత ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు సమకూరతాయి. లాభాలు సైతం తగినంతగా దక్కుతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు ఒక సమాచారం ఊరటనిస్తుంది. 30,31 తేదీల్లో దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆరోగ్యం మెరుగుపడుతుంది. దేవాలయాలు సందర్శిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరతాయి. వ్యాపారస్తులకు అదనపు లాభాలు దక్కే అవకాశం. ఉద్యోగస్తులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు మరిన్ని విజయాలు చేకూరతాయి. 29,30 తేదీల్లో లేనిపోని ఖర్చులు. ప్రయాణాలు. శివాలయంలో 11 ప్రదక్షిణలు చేయండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

చిరకాల కోరిక నెరవేరుతుంది. నిరుద్యోగులకు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారస్తులకు భాగస్వాముల నుంచి మరింత చేయూత అందుతుంది. ఉద్యోగస్తులకు కోరుకున్న మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలు, క్రీడాకారులు, పరిశోధకులకు విశేష ఆదరణ. 30,31 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కుటుంబసభ్యులతో వివాదాలు పరిష్కారం. ఆరోగ్యపరంగా కొంత చికాకులు తప్పకపోవచ్చు. వ్యాపారులకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవరోధాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, రచయితలకు యోగవంతమైన కాలమనే చెప్పాలి. 27, 28 తేదీల్లో మానసిక ఆందోళన. ఆస్తి వివాదాలు. ధననష్టం. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆహ్వానాలు, శుభాకాంక్షలు అందుకుంటారు. వ్యాపారులు విస్తరణ యత్నాలలో అవరోధాలు అధిగమిస్తారు. ఉద్యోగులకు ఉత్సాహంగా ఉంటుంది. పారిశ్రామికవేత్తలు, వైద్యులకు అనూహ్యమైన అవకాశాలు.కళాకారులకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందుతాయి. 25, 26 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. సోదరులతో వైరం. ఆదిత్య హృదయం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

భవిష్యత్తుపై నిరుద్యోగులకు కొత్త ఆశలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. సోదరులతో అపార్థాలు తొలగుతాయి. వ్యాపారులకు విశేషంగా లాభిస్తుంది. ఉద్యోగులకు నూతనోత్సాహం, విధుల్లో అనుకూల మార్పులు. రాజకీయవేత్తలు, కళాకారులకు మరిన్ని అవకాశాలు దగ్గరకు వస్తాయి. 27, 28 తేదీలలో చికాకులు. అనారోగ్యం. బంధువిరోధాలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలం. విద్యార్థులు, నిరుద్యోగులకు కొత్త ఆశలు. భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదాలు పరిష్కారం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు ఉన్నతహోదాలు తథ్యం. వైద్యులు, రచయితలకు అరుదైన అవకాశాలు. వ్యవసాయదారులకు ఊహించని పెట్టుబడులు. 29, 30 తేదీల్లో ధననష్టం. కుటుంబసమస్యలు. వివాదాలు. శివస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పరిస్థితులు అనుకూలించి నూతనోత్సాహంతో ముందడుగు వేస్తారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని కష్టసుఖాలు పంచుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కొత్త కాంట్రాక్టులు ఎట్టకేలకు దక్కుతాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు సంతృప్తినిస్తాయి. ఉద్యోగస్తులకు సమస్యల నుంచి విముక్తి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు శుభవార్తలు 30,31 తేదీల్లో వృథా ఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

# పదరసం-565

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | | 5 |
| | | | | 6 | | | | | |
| 7 | | | 8 | | | 9 | | 10 | |
| | | 11 | | | 12 | | | 13 | |
| | 14 | | | 15 | | | 16 | | |
| 17 | | | 18 | | | | | | 19 |
| | 20 | | | | 21 | 22 | | 23 | |
| 24 | | | 25 | | | | | | |
| | | 26 | | | 27 | | 28 | | 29 |
| | 30 | | | 31 | | | 32 | | |

## ఆధారాలు

**అడ్డం**

1. సినారెకు 'జ్ఞానపీఠ్' తెచ్చిన గ్రంథం (4)
3. మేలిమి బంగారం (3)
6. స్త్రీ, మహిళ (2)
7. ధ్వని,శబ్దం (2)
8. గడ్డి/కట్టెల కట్ట (2)
9. తల్లి, పార్వతి (3)
11. ఏడాదిలో పన్నెండో వంతు (2)
12. కోకకు పర్యాయ పదం (2)
13. ఓడలు, పడవలు నిలిచే స్థలం..అటునుంచి (2)
14. కొండ (2)
15. మొదటి రాశి (2)
16. నఖం (2)
17. దప్పిక (2)
18. ఈ పండు హనుమకు ఇష్టమంటారు (3)
20. అరణ్యం (3)
21. అత్యాశ, అరిషడ్వర్గాల్లో ఒకటి (2)
23. భారతంలో అధ్యాయాల విభజన (2)
24. గారాబమే...పొట్టిగా (2)
25. సమయం..మాగాణి (2)
26. పట్టణం (2)
27. అందమె...(3)
30. నిలువు 11 లాంటిదే..కాస్త చిన్నది (2)
31. తెలివి, బుద్ధి (2)
32. నువ్వులు (3)

**నిలువు**

1. తెలుగులో 'జ్ఞానపీఠ్' తొలి విజేత (4)
2. కృష్ణుని అష్టభార్యల్లో ఒకరు (2)
3. పాండురాజు పట్టమహిషి (2)
4. తనయ,ఒక తెలుగు సంవత్సరం (3)
5. ఇది ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలట (2)
6. ఇష్టం, ప్రియం (2)
8. వంచన (2)
9. ముసలితనం (2)
10. నిప్పును కప్పి ఉండేది, బూడిద (3)
11. నిలువు 3కు సవతి (2)
12. అంధకారంలో (4)
14. గర్వం, మిడిసిపాటు (4)
15. హద్దు, పరిధి (2)
16. కుడ్యం (2)
18. తరువాత, పిమ్మట (4)
19. సమస్తం, సకలం (2)
22. సంగ్రామం (3)
23. పడతిలో భర్త (2)
24. ధాన్యం నిలవచేసేది, గరిసె (2)
26. వల్మీకం (2)
27. ఆదేశం, ఉత్తరువు (2)
28. ఏనుగు (2)
29. పరిపాలించు (2)

## పదరసం - 564 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మే | లు | 2 కొ | లు | 3 పు | | 4 సం | తు | | 5 మ |
| న | | ప్పు | | త్త | | త | | 6 గ | ద్దె |
| 7 కో | ట | | 8 కో | డి | | 9 కం | 10 చె | | ల |
| డ | | 11 కా | కి | | 12 బ | | 13 ర | 14 వి | |
| 15 లు | 16 పా | | ల | | 17 హు | 18 కుం | | 19 రి | 20 గు |
| | 21 ము | ష్టి | | 22 ఆ | మ | డ | | 23 పా | డి |
| 24 క | ల | | 25 వి | న | తి | | 26 కా | న్పు | |
| | 27 ప | సి | | వా | | 28 మ | డి | | 29 ఉ |
| 30 కీ | ర్తి | | 31 వి | లు | 32 వ | | | 33 క | ల్ల |
| రం | | 34 చి | త్తం | | 35 నం | ద | కం | | ము |

సినిమా




# ఆలోచన మంచిదే కానీ...

ఇవాళ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద దృష్టి పెడుతున్నారు. మరీ ముఖ్యంగా ఆహారం విషయంలో జాగ్రత్త పడుతున్నారు. సేంద్రియ వ్యవసాయంతో పండించే ఆహార ధాన్యాలు తీసుకోవాలనుకుంటున్నారు. మరికొందరైతే చిరుధాన్యాలను వాడితే మరింత మంచిదని భావిస్తున్నారు. ఈ అంశాల ఆధారంగా తెలుగులో వచ్చిన చిత్రాలు చాలా తక్కువ. గతంలో రైతులు, వారి సమస్యలు, గిట్టుబాటు ధరల మీద చిత్రాలు వచ్చేవి. యువతరమంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల జపం చేస్తున్న నేపథ్యంలో 'బ్యాక్ టూ రూట్స్' అన్నట్టుగా వ్యవసాయ ప్రాధాన్యం తెలియచేస్తూ, యువత కూడా గ్రామాల బాట పట్టాలనే సూచనతో అడపా దడపా కొన్ని సినిమాలు వచ్చాయి. తాజాగా విడుదలైన 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' కూడా ఆ కోవకు చెందిందే.

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటించిన 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' చిత్రాన్ని మధుదీప్ చెలికాని దర్శకత్వంలో అరవింద్ మండెం నిర్మించారు. ఇది ఐదారేళ్లలో క్రితం మొదలైన సినిమా. ఇప్పటికి జనం ముందుకు వచ్చింది. ఈ మధ్యకాలంలో కాస్తంత ఇదే తరహా చిత్రాలు రావడంతో కథను అటూ ఇటూ మార్చినట్టుగా అనిపిస్తుంది. ఇంతకూ కథేమిటంటే... అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి, సొంతగా ఏదైనా బిజినెస్ చేద్దామని ఇండియా వచ్చేస్తాడు అరవింద్ (త్రిగుణ్). సేంద్రియ వ్యవసాయం చేసే ప్రొఫెసర్ బలరాం చక్రవర్తి (శివాజీరాజా) ప్రభావానికి లోనైన అతను ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. పెన్‌పహాడ్ గ్రామంలోని రైతులు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని రియల్ ఎస్టేట్ వాళ్లకు భూముల్ని ఇచ్చేయాలనుకుంటారు. ఈ విషయం తెలిసి అరవింద్ తాను దాచుకున్న డబ్బుల్ని ఆ రైతులకు అడ్వాన్స్‌గా ఇచ్చి వారి పొలాన్ని కొంత తీసుకుని కౌలుకు వ్యవసాయం మొదలు పెడతాడు. అరవింద్ సంపన్న కుటుంబానికి చెందిన వాడని భావించి, అతనుండే గేటెడ్ కమ్యూనిటీలోని మహి (పాయల్ రాధాకృష్ణ) అతన్ని ప్రేమిస్తుంది. అతనూ ఆమెతో తొలిచూపు ప్రేమలో పడతాడు. అయితే ఉద్యోగం కాకుండా సొంతంగా పొలం కొని వ్యవసాయం చేయాలనే అరవింద్ ఆలోచనలను ఆమె అంగీకరించలేకపోతుంది. దాంతో ప్రేమను చంపుకుంటుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాలు పండించాలని అనుకున్న అరవింద్ కోరిక నెరవేరిందా? రైతును గౌరవించడం తెలియని మహి.. అరవింద్‌లోని గొప్పతనాన్ని గుర్తించి, అతన్ని పెళ్లి చేసుకుందా లేదా? అనేదే మిగతా కథ.

నిజానికి దర్శకుడు మధుదీప్ చెలికాని చక్కని కథను రాసుకున్నాడు. ఇవాళ యువత కేవలం ఉద్యోగం మీద ఆధారపడకుండా, ఏ మాత్రం అవకాశం ఉన్నా గ్రామాలకు వెళ్లి అక్కడ ఆధునిక రీతిలో వ్యవసాయం చేస్తే అది దేశానికి, దేహానికి కూడా మంచిదనే సందేశాన్ని ఇవ్వాలనుకున్నాడు. అందరూ కోరుకుంటున్న మిల్లెట్స్‌ను పండిస్తే... కష్టానికి తగ్గ ప్రతిఫలం వస్తుందని తెలియచేసే ప్రయత్నం చేశాడు. కానీ దీనికి ప్రేమను జత చేయడంతో అది కాస్త కంగాళీగా తయారైంది. ఓ ఆదర్శవంతమైన కథను ప్రేమ దారి పట్టించడమే కాకుండా... వినోదం పేరుతో కొన్ని వెగటుపుట్టే సన్నివేశాలను జత చేయడంతో సీరియస్ నెస్ పోయింది. కమర్షియల్ యాంగిల్‌లో ఆలోచించి దర్శకుడు బహుశా ప్రేమ కథకు పెద్దపీట వేసి ఉండొచ్చు. కానీ ఆ సన్నివేశాలలో కొత్తదనం లేకుండా పోయింది. నిజానికి ఈ సినిమా కోర్ పాయింట్ ఓ సాఫ్ట్‌వేర్ యువకుడు ఎలా విజయవంతమైన రైతుగా మారాడన్నది. కానీ దానికి సంబంధించిన సన్నివేశాలు పై పై సాగిపోవడంతో ప్రేక్షకులపై అంతగా ఇంపాక్ట్ పడలేదు. భిన్న మనస్తత్త్వం కలిగిన హీరో, హీరోయిన్లు చివరి వరకూ ఎవరికి వారు తమదే సరైన పద్ధతి అని భావిస్తుంటారు. చివరిలో సైతం హీరోయిన్ కన్విన్స్ కాదు. దీంతో వారి మధ్య చిత్రీకరించిన సన్నివేశాలన్నీ వ్యర్థ ప్రయాసలా అనిపిస్తాయి. దర్శకుడు ఈ కథను పర్వాలుగా విభజించి తెరకెక్కించాడు.

నటీనటుల విషయానికి వస్తే హీరో త్రిగుణ్ తన పాత్రకు చక్కని న్యాయం చేకూర్చాడు. కానీ హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ విషయంలో అలా జరగలేదు. సినిమా షూటింగ్ చాలా సంవత్సరాల పాటు సాగడం వల్ల కావచ్చు... ఆమె ఒక్కో ఫ్రేమ్‌లో ఒక్కోలా ఉంది. హీరో తల్లిదండ్రులుగా సత్య కృష్ణన్, అనీశ్ కురువిల్ల నటించారు. హీరోయిన్ తల్లి దండ్రులుగా సీవీఎల్ నరసింహారావు, జయశ్రీ రాచకొండ చేశారు. హీరో స్నేహితుడిగా నెల్లూరు సుదర్శన్, సహాయకుడిగా గుండు సుదర్శన్ తమ వంతు వినోదాన్ని అందించే ప్రయత్నం చేశారు. భగ్న ప్రేమికుడిగా వైవా హర్ష చేశాడు. సీనియర్ దర్శకుడు వి.ఎన్. ఆదిత్య గెస్ట్ అప్పీయరెన్స్ ఇచ్చిన ఈ సినిమాలో శివాజీరాజా, గిరిధర్, హర్షవర్ధన్, వేణు యెల్దండి, సప్తగిరి, గిరిధర్, సత్తిపండు, సరయు తదితరులు కీలక పాత్రలు పోషించారు. సాంకేతిక నిపుణుల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ప్రకాష్ చెరుకూరి,అరుణ్ చిలువేరు సంగీతం గురించి. నేపథ్య సంగీతంతో పాటు అవసరమైన చోట నేపథ్య గీతాలనూ పెట్టారు. అయితే వాటి ప్రభావం పెద్దంతగా లేదు. రవికుమార్ వి. ఫోటోగ్రఫీ బాగుంది! మాటలు కొన్ని చోట్ల బాగున్నాయి.

'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' చిత్రాన్ని ఉన్నతంగా తెరకెక్కించాలని దర్శకుడు మధుదీప్ నిజంగా భావించి ఉంటే... ప్రొఫెసర్ బలరాం చక్రవర్తి క్యారెక్టర్ ను ఇంకాస్తంత ప్రభావవంతంగా చూపించి ఉండాల్సింది. అసలు ఆయన ఎందుకు సేంద్రియ సాగు వైపునకు మళ్లారు. దాని నేపథ్యం ఏమిటీ అనేది చూపించి ఉంటే మరింత బాగుండేది. అలానే హీరో ప్రేమకథను కాస్తంత తగ్గించి, ఓ రైతుగా అతనికి ఎదురైన కష్టాలు, వాటిని తొలగించుకున్న తీరును మరింత ఆసక్తికరంగా చూపించాల్సింది. అప్పుడే సినిమా తీయడంలో నిర్మాతల లక్ష్యం నెరవేరి ఉండేది. కాకపోతే... ఆహారం, ఆరోగ్యం వాటి మీద దృష్టి పెట్టమని కోరే సినిమాగా ఉండిపోయింది. ఏదేమైనా... ఓ మంచి ఆలోచనను కలగాపులగం చేసి ప్రేక్షకులను 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' నిరాశకు గురిచేసిందనే చెప్పాలి.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు
















వెల : ₹.80/- | వెల : ₹.60/- | వెల : ₹.270/- | వెల : ₹.80/- | వెల : ₹.54/-













వెల : ₹.800/900 : 999/1200 | వెల : ₹.250/- | వెల : ₹.130/- | వెల : ₹.200/-
















వెల:₹.999/- సెట్ | వెల:₹.450/- | వెల :₹.699/- | వెల : ₹.400/- | వెల : ₹.145/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 32

# G. PULLA REDDY
# DEGREE & P.G. COLLEGE

(Affiliated to Osmania University)

**MEHDIPATNAM,** HYDERABAD - 28

**Ph : 23513154**

**English Medium** Estd 1994 **Co-Education**

**(A College Striving for Excellence in Quality Education)**

## COURSES OFFERED

**B.Sc** (M.S.Cs) (M.P.Cs) (M.E.Cs)

**B.B.A**

**B.Com** (Computers Applications)

**M.Sc** (Mathematics) (Physics)

**WE HAVE :** ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

**For Details contact office between *10.00 A.M. & 5.00 P.M***

**PRINCIPAL**

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01